www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 18-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 141

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: దశమి సా.5.23 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మృగశిర రా.2.06 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ.8.37-10.08, దుర్ముహూర్తం: మ.12.44-1.34, మ.3.14-4.04, అమృతఘడియలు: సా.5.44-7.15; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.35

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన!



భారత్-అమెరికా చర్చల నిలిపివేత దిశగా పరిణామాలు

ఈ నెల 25న భారత్‌కు రావాల్సిన అమెరికా బృందం పర్యటన రద్దు!

2



నైతిక విలువలు ఉంటేనే అమెరికా పౌరసత్వం


వలసదారుల దరఖాస్తులపై యూఎస్‌సీఐఎస్ ఆదేశం

ఎటువంటి నేరచరిత్ర లేకపోవడమే మంచి ప్రవర్తనగా నిర్వచనం

2

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి

రాధాకృష్ణన్



మహారాష్ట్ర గవర్నర్ పేరును ఖరారు చేసిన బీజేపీ

- రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన మాజీ ఎంపీ
- తెలంగాణ గవర్నర్‌గానూ కొన్నాళ్లు అదనపు బాధ్యతలు
- ఆరెస్సెస్‌తో సుదీర్ఘకాలంగా అనుబంధం
- వచ్చే ఏడాది తమిళనాడు శాసనసభ ఎన్నికలు
- వ్యూహాత్మకంగా ఎంపిక చేసిన కమలం పార్టీ
- ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతిస్తాయని అంచనా
- ఇండీ కూటమిలోని డీఎంకే వ్యతిరేకించదనే యోచన
- తమ అభ్యర్థిపై నేడు నిర్ణయం తీసుకోనున్న విపక్షాలు!

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరన్న దానిపై ఉత్కంఠ వీడింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరును బీజేపీ ఖరారు చేసింది. ఆదివారం ఢిల్లీలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షాతోపాటు తెలంగాణకు చెందిన కె.లక్ష్మణ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సీపీ రాధాకృష్ణన్ పేరుకు పార్లమెంటరీ బోర్డు ఆమోదం తెలిపింది. అనంతరం జేపీ నడ్డా మీడియా సమావేశంలో రాధాకృష్ణన్ పేరును ప్రకటించారు. తమిళనాడుకు చెందిన చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957 మే 4న జన్మించారు. 1993 నుంచి 1998 వరకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సంఘచాలక్‌గా పనిచేశారు. కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగానూ

మిగతా 12వ పేజీలో...

విజయం లాంఛనమే..!

పార్లమెంట్ ఉభయ సభల్లో ఉన్న వివిధ ఖాళీలతో కలిపి ప్రస్తుత సభ్యుల సంఖ్య 786. ఇందులో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మెజారిటీకి 394 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది, రాజ్యసభలో 129 మంది సభ్యుల మద్దతు ఉంది. ఉభయ సభల్లో కలిపి ఎన్డీఏ బలం 422. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో 234 మంది, రాజ్యసభలో 79 మంది సభ్యులు.. మొత్తంగా 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీపీ రాధాకృష్ణన్ విజయం లాంఛనమే కానుంది. మెజారిటీ లేకపోయినా.. తమ వాణి వినిపించాలని ఇండియా కూటమి భావిస్తోంది. ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో ఇండియా కూటమి తరఫున అభ్యర్థి అంశంపై చర్చించేందుకు కూటమి నేతలు సోమవారం ఉదయం సమావేశమవుతారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతామని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు.

వారంలో అఫిడవిట్ ఇవ్వాలి.. లేదా

క్షమాపణ చెప్పాలి

ఎన్నికల కమిషన్‌కు ఏ పార్టీ అయినా ఒకటే!

అధికార పక్షమా, ప్రతిపక్షమా అని చూడదు

ఎన్నికల్లో కోటి మందికిపైగా సిబ్బంది పాల్గొంటారు

వారందరి ముందూ ఓట్ల దొంగతనం సాధ్యమా?

రాజకీయ ప్రయోజనాల కోసం

ఈసీ భుజాలపై తుపాకీ పెట్టి కాలుస్తున్నారు

రాహుల్ ఆరోపణలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ధ్వజం

బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది పేర్లతో కూడిన జాబితాను వెబ్‌సైట్లలో పెట్టినట్టు వెల్లడి

ఈసీ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి: కాంగ్రెస్



విలేకరుల సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గెలిపించేందుకు ఎన్నికల కమిషన్ ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ సహా విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఈసీ ఘాటుగా స్పందించింది. ఈ ఆరోపణలను నిరూపించే సాక్ష్యాలతో వారంరోజుల్లోగా ప్రమాణపత్రాన్ని దాఖలు చేయాలని.. లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని.. ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ రెండూ తప్ప మూడో ప్రత్యామ్నాయమే లేదని ఆయన స్పష్టం చేశారు. వారంలోగా ప్రమాణపత్రం సమర్పించకుంటే ఓటర్ల జాబితాపై వస్తున్న ఆరోపణలన్నీ ఆధారరహితమైనవిగా పరిగణించాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీకి, ప్రతిపక్షానికి మధ్య ఈసీ ఎలాంటి తేడా చూపదని, తమకు

మిగతా 2వ పేజీలో...

ఓట్లచోరీపై ఈసీకి 18 వేల అఫిడవిట్లిచ్చాం

ఒక్కదానిపైనా చర్యల్లేవ్.. ఈసీపై ఒత్తిళ్లున్నాయని తెలుసు

ఆ సంస్థలో ప్రక్షాళన జరగాల్సి ఉంది: అఖిలేశ్ యాదవ్

2



బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్, తేజస్వీయాదవ్

ఎన్నికల్ని ఈసీ తస్కరిస్తోంది!

ఓటర్ల తొలగింపు పథకాన్ని సాకారం కానివ్వం

బిహార్‌ను కాజేయడానికే 'సర్' కుట్ర: రాహుల్‌గాంధీ

సాసారం నుంచి 'ఓటర్ అధికార్ యాత్ర'కు శ్రీకారం

20 జిల్లాల గుండా 1300 కిలోమీటర్ల యాత్ర

మోటార్లు మీరు ఆన్ చేస్తారా?

మేం ఆన్ చేయాలా?



కాళేశ్వరంపై అబద్ధపు ప్రచారాలను కప్పిపుచ్చుకొనేందుకు ప్రభుత్వం కుట్ర

వరద నీటిని ఒడిసిపట్టకుండా వృథాగా సముద్రంలోకి వదిలేస్తున్నారు

ఎస్సారెస్పీలోకి నీళ్లొస్తున్నా మిడ్‌మానేరు, ఎల్‌ఎండీ ఎందుకు నింపట్లేదు?

కాళేశ్వరం మోటార్లు పాడయ్యేలా కుట్రలు

రైతుల్ని గోసపెడ్తరా?: హరీశ్ ధ్వజం

13



విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

జలాల్లో వాటా తేలాకే..

ప్రాజెక్టులు కట్టుకోవాలి

తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం

మా అవసరాలు తీరకుండా దిగువన ప్రాజెక్టులు కడితే సమస్యగా మారుతుంది

సముద్రంలోకెళ్లే జలాలు అనడం సరికాదు

మా ప్రాజెక్టులు పూర్తయి వాటాలు తేలాక మిగిలిన నీటిని వాడుకోవచ్చు

వాటాలు తేల్చాల్సిన బాధ్యత కేంద్రానిదే

ఏపీలోని విశాఖపట్నంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నదుల వరద జలాలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇరు రాష్ట్రాల వాటా ఎంతెంతో తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయబద్ధంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే తమకు రాష్ట్ర ప్రయోజనాలే

మిగతా 13వ పేజీలో...

ప్రైవేటు అంబులెన్స్‌ల దందాకు కళ్లెం?



- ప్రైవేటు ఆస్పత్రులతో కలిసి రాష్ట్రంలో అంబులెన్స్‌ల దోపిడీ
- రోగుల తరలింపులో భారీగా కమీషన్లు దండుకుంటున్న వైనం
- పేషెంట్ల సంబంధీకుల్ని భయపెట్టి.. కమీషన్ ఇచ్చే ఆస్పత్రులకు తీసుకెళ్తున్న అంబులెన్స్ డ్రైవర్లు.. భారీగా వాట్సాప్ గ్రూపులు
- చెక్ పెట్టేలా సర్కారు యోచన.. వైద్య కమిషనర్ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అంబులెన్స్‌ల దోపిడీకి చెక్ పెట్టాలని సర్కారు భావిస్తోందా..? వాటి విషయంలో కఠిన నిబంధనలు అమలు చేసి.. నియంత్రణలోకి తేవాలని చూస్తోందా..? ఇష్టారీతిన జరిగే వసూళ్ల విషయంలో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని యోచిస్తోందా..? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. ఇటీవల ప్రైవేటు అంబులెన్స్‌ల దందాపై మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు

మిగతా 13వ పేజీలో...



వైద్యవిద్య కోసం

విదేశాలకు!

నిరుటి కన్నా పెరిగిన తెలుగు విద్యార్థుల సంఖ్య

ఈసారి తెలంగాణ, ఏపీ నుంచి 4 వేల మంది

ఎన్‌ఎంసీ గైడ్‌లైన్స్ ప్రకారం కొన్ని విదేశీ వర్సిటీల్లో బోధన

రూ.30 లక్షల్లోనే ఎంబీబీఎస్

పెరుగుతున్న వైద్యులు.. వారికి తగ్గుతున్న ఉపాధి

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్యవిద్యలో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ)లో ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ఇక్కడ సీటు రాదని తేలిపోయిన విద్యార్థులు వైద్యవిద్య కోసం విదేశాలకు వరుస కడుతున్నారు. నిరుటి కంటే ఈ ఏడాది విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు పలు కన్సల్టెన్సీలు వెల్లడించాయి. తెలుగు రాష్ట్రాల నుంచి గత ఏడాది 3 వేల మంది వరకు వెళితే ఈ ఏడాది ఆ సంఖ్య 3,500-4,000 వరకు

మిగతా 12వ పేజీలో...

ఉక్రెయిన్‌కు నాటో తరహా రక్షణ

ట్రంప్ రాయబారి స్టీవ్ విట్కాఫ్ వెల్లడి

నేడు వాషింగ్టన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ

పాల్గొననున్న యూరప్ దేశాల నేతలు

ఈ నెల 22న జెలెన్‌స్కీ, పుతిన్‌తో కలిసి త్రైపాక్షిక భేటీ నిర్వహిస్తానన్న ట్రంప్

2

గోదావరికి పెరిగిన వరద

మేడిగడ్డకు 5.66 లక్షల క్యూసెక్కులు..

శ్రీరాంసాగర్‌కు 1.51 లక్షలు..

నాగార్జునసాగర్, శ్రీశైలానికి లక్షన్నర క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాష్ట్రంలో నేడు, రేపు అతి భారీ వర్షాలు

3

5431

రాష్ట్రంలో కరెంటు లేని బడులు



బాలికల మరుగుదొడ్లు లేనివి 5,124

కంప్యూటర్లు లేని స్కూళ్లు 22%

60% బడుల్లో ఇంటర్‌నెట్ లేదు

ఒక్క విద్యార్థీ చేరని స్కూళ్లు 2,097

గురు-శిష్యుల నిష్పత్తిలో ముందంజ

కేంద్ర విద్యాశాఖ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మొత్తం 42,901 పాఠశాలలుండగా.. 5,431 బడుల్లో కరెంటు లేదని కేంద్ర విద్యాశాఖ అధ్యయనంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా పాఠశాలల స్థితిగతులపై కేంద్ర విద్యాశాఖ 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన అధ్యయనం వివరాలను ఇటీవలే వెల్లడించింది. దాని ప్రకారం పలు అంశాల్లో తెలంగాణ మెరుగైన స్థానంలో ఉండగా, కొన్ని అంశాల్లో మాత్రం వెనకబడింది. ఈ అధ్యయనం ముఖ్యాంశాలు..

- రాష్ట్రంలో అసలు విద్యుత్తు సౌకర్యమే లేని బడుల సంఖ్య 2065 (4.81 శాతం) కాగా.. కరెంటు కనెక్షన్ ఉన్నా


మిగతా 13వ పేజీలో...



కొడంగల్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడిన ఓ బాలుడు

పేగులు బయటికి వచ్చేలా

కరిచాయ్!



నల్లగొండలో ఓ మహిళపై పిచ్చికుక్కల దాడి

తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన బాధితురాలు

రెండేళ్ల బాలుడు, ఓ యువకుడిపైనా దాడి

ఉమ్మడి రంగారెడ్డిలో రెచ్చిపోయిన వీధికుక్కలు

4 ఏళ్ల బాలుడు సహా 27 మందికి కుక్కకాటు

కొడంగల్‌లో చిన్నారి సహా ఏడుగురిపై దాడి

వీధికుక్కల నియంత్రణకు హెచ్చార్సీలో ఫిర్యాదు

నల్లగొండ, పరిగి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో వీధి కుక్కలు ఆదివారం రెచ్చిపోయాయి. ఈ రెండు ప్రాంతాల్లో కలిపి 30 మందిపై దాడి చేసి గాయపరిచాయి. బాధితుల్లో రెండేళ్లు, నాలుగేళ్ల వయస్సు ఉన్న చిన్నారులతో పాటు వృద్ధులు కూడా

మిగతా 12వ పేజీలో...

వారే.. రాజ్యాంగాన్ని తొక్కేశారు!



- తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్న వారే.. అంబేడ్కర్‌కు ద్రోహం చేశారు
- ఢిల్లీలో పారిశుధ్య కార్మికులు గైర్హాజరైతే వారిని జైలుకు పంపే చట్టం తెచ్చారు
- ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నారు
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని
- ఢిల్లీలో హైవేలను ప్రారంభించిన మోదీ
- దీపావళికి ముందే జీఎస్టీ సంస్కరణలు
- రాష్ట్రాలు సహకరించాలని విజ్ఞప్తి

2

వారంలో అఫిడవిట్ ఇవ్వాలి.. లేదా క్షమాపణ చెప్పాలి



జ్ఞానేశ్‌కుమార్



సుఖ్బీర్ సింగ్, వివేక్ జోషి

(మొదటి పేజీ తరువాయి)

ఏ రాజకీయ పార్టీ అయినా ఒక్కటే నని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టిన ఉద్దేశమే.. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సవరించడమని, కానీ దీనిపై పలు పార్టీలు తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తూ వాస్తవికతను మరిచిపోతున్నాయని.. తమ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్ భుజాలపై తుపాకీ పెట్టి ఓటర్లను లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన మండిపడ్డారు. ఓట్ల చోరీ, డబుల్ ఓటింగ్ వంటి ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని ఆయన కొట్టిపారేశారు. 'ఓట్ల చోరీ' వంటి పదాలు ఉపయోగించడం రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని జ్ఞానేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిహార్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని హడావుడిగా జరిపేస్తున్నారన్న వాదన వస లేనిదని.. ప్రతి ఎన్నికకు ముందూ ఓటరు జాబితాను సరిదిద్దడం ఎన్నికల కమిషన్ చట్టబద్ధమైన విధి అని స్పష్టం చేశారు. ఓటర్ల డేటా బేస్‌లో తప్పులు సవరించాలని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేయడం వల్లే ఈ ప్రక్రియ చేపట్టినట్టు వెల్లడించారు. బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలపడానికి, ఫిర్యాదులుంటే చేయడానికి అన్ని రాజకీయ పార్టీలకూ ఇంకా 15 రోజుల గడువు ఉందని గుర్తుచేశారు. "ఈసీ తలుపులు అందరికీ తెరిచేఉంటాయి. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు పారదర్శకంగా పనిచేస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ఏజెంట్లు, పూర్తి స్థాయిలో పారదర్శకంగా పనిచేస్తున్నారని తెలిపారు.

సాధ్యమేనా?

కోటి మంది అధికారులు, పది లక్షల మంది బూత్ స్థాయి అధికారులు, ఇరవై లక్షల మంది పోలింగ్ ఏజెంట్లు ఒక లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారని.. ఇంతమంది ముందు ఓట్లను దొంగతనం చేయడం సాధ్యమవుతుందా? అని సీఈసీ ప్రశ్నించారు. రెండుసార్లు ఓటింగ్ జరిగినట్లు ఆరోపణలు చేసిన వారిని రుజువులు అడిగితే.. ఇప్పటివరకూ తమకు సమర్పించలేదని తెలిపారు. ఇలాంటి ఆరోపణల వల్ల ఎన్నికల కమిషన్ కానీ, ఓటర్ కానీ భయపడరని అన్నారు. ఓటర్లను అవమానపరిస్తే ఎన్నికల కమిషన్ మౌనంగా ఉండదని హెచ్చరించారు. వలసల వల్లో, ఇతరత్రా కారణాలవల్లనో, అధికార యంత్రాంగం పనితీరులో లోపాలవల్లనో ఒక ఓటరు ఒకటికి మించి ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉంటున్న సందర్భాలు కనిపిస్తున్నాయని.. అలాంటి తప్పులను పరిష్కరించేందుకే ఈసీ ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతోందని జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే.. విపక్షాలు లేవనెత్తిన 'హౌస్ నంబర్ జీరో' సమస్యపైనా ఆయన స్పందించారు. "చాలామంది ఓటర్లకు ఇళ్లు ఉండవు. కానీ, వారి పేరు జాబితాలో ఉంటుంది. జాబితాలో ఇచ్చిన చిరునామాకు వారు కేవలం రాత్రిపూట నిద్రించడానికి వస్తారు. కొందరైతే రోడ్లపక్కన, వంతెనల కింద పడుకుంటారు. అలాంటివారిని ఫేక్ ఓటర్లంటే.. ఆ పేద ఓటర్లను హేళన చేసినట్టే" అని ఆవేదన వెలిబుచ్చారు. పంచాయతీలు, మునిసిపాలిటీలు ఇళ్లకు నంబర్ కేటాయించకపోవడం వల్ల.. కోట్లాది మంది ఓటర్ల ఇంటి నంబర్ 'జీరో'గా ఉంటోందని పేర్కొన్నారు. ఉదాహరణకు.. నగరాల్లో అనుమతులులేని కాలనీలు చాలా ఉంటాయని, ఆ కాలనీల్లో ఉండేవారికి ఇంటినంబర్లు ఉండవని(అధికారులు కేటాయించరని).. అలాంటివారు ఓటరు ఐడీ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు చిరునామా అనే చోట ఏం రాస్తారని నిలదీశారు. అలాంటి సందర్భాల్లో వారి ఇంటినంబర్ స్థానంలో ఊహాత్మక సంఖ్య ఇవ్వడం ద్వారా అలాంటి ఓటర్ల పక్షాన ఈసీ నిలబడుతుందన్నారు.

అలా ఇవ్వం..

సుప్రీంకోర్టు ఆదేశించినట్టుగా.. బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను, వారి వివరాలను జిల్లాలవారీగా ఈసీ వెబ్‌సైట్లలో ప్రచురించినట్టు సీఈసీ తెలిపారు. అయితే.. యంత్రాల సాయంతో చదవదగ్గ రీతిలో (మెషీన్ రీడబుల్) ఓటర్ల జాబితాను విడుదల చేస్తే ఓటర్ల ప్రైవసీకి భంగం కలుగుతుందని 2019లో సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌ని ఎవరైనా ఎడిట్ చేసే (మార్చే) ప్రమాదం ఉంటుంది కాబట్టే దాన్ని నిషేధించారని తెలిపారు. కనుక ఆ నమూనాలో ఓటరు జాబితాను రాజకీయ పార్టీలతో పంచుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఎన్నికల నిబంధనావళిలోని క్లాజ్ నంబరు 11.2.2.2లో సైతం ఓటరు జాబితా 'టెక్స్ మోడ్'లో ఉండాలని మాత్రమే పేర్కొన్నారని.. ముసాయిదా ఓటర్ల జాబితాను 'సెర్చబుల్ (ఓటరు గుర్తింపు కార్డు నంబర్‌తో వెతకగలిగే) పీడీఎఫ్' రూపంలో ఈసీ వెబ్‌సైట్‌లో పెట్టాలని చెప్పలేదని గుర్తుచేశారు. కాబట్టి అలా పెట్టాలని అడిగే హక్కు పిటిషనర్‌కు లేదని జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు.

అందుకే రాహుల్‌ను అఫిడవిట్ అడిగారు

ఒక నియోజకవర్గంలో ఓటర్ కానివారు ఓటరుజాబితాపై ఫిర్యాదు చేయాలంటే.. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ముందు ప్రమాణం చేయాల్సి ఉంటుందని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. ఎవరిపై ఆరోపణలు చేస్తారో వారి ముందే ప్రమాణం చేయాల్సి ఉంటుందని.. అందుకే కర్ణాటక సీఈవో రాహుల్ గాంధీని ప్రమాణ పూర్వకంగా డిక్లరేషన్ సమర్పించాలని కోరారని ఆయన వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారు ప్రమాణపూర్వక డిక్లరేషన్ ఇవ్వకుండా ఈసీ 1.5 లక్షల మంది ఓటర్లకు నోటీసు జారీ చేయాలా? అని ప్రశ్నించారు.

ఈసీ తీరు బహిర్గతమైంది..

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్‌నేత జైరామ్‌రమేశ్ స్పందించారు. "సాసారాం నుంచి రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార యాత్ర' ప్రారంభించిన కొద్దిసేపటికే సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు మీడియాతో మాట్లాడుతూ.. తమకు అధికార, ప్రతిపక్షాల మధ్య తేడా లేదన్నారు. కొండంత సాక్ష్యాలు ఎదురుగా ఉన్నా వారు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం. రాహుల్‌గాంధీ లేవనెత్తిన ఏ ఒక్క నిశితమైన ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వలేదు" అని తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాలతో సహా వెల్లడించాలంటూ ఆగస్టు 14వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఈసీ తూచా తప్పకుండా పాటిస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. ఈసీ ఇచ్చిన డేటాలోని వాస్తవాలనే రాహుల్ చెప్పారని గుర్తుచేశారు. అసమర్థతవల్లే కాక.. బహిరంగ పక్షపాతవైఖరి వల్ల కూడా ఈసీ తీరు పూర్తిగా బహిర్గతమైందన్నారు.

బీజేపీతో ఈసీ కుమ్మక్కు

బిహార్‌ను కాజేయడానికే 'సర్' కుట్ర.. ఓటర్ల తొలగింపు పథకాన్ని సాకారం కానివ్వం: రాహుల్

- ససారం నుంచి 'ఓటర్ అధికార యాత్ర'కు శ్రీకారం


ఓటర్ అధికార యాత్రలో రాహుల్ వాహనాన్ని నడుపుతున్న తేజస్వీ

ససారం, ఆగస్టు 17: బిహార్ ఎన్నికలను దొంగిలించేందుకే ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) బీజేపీతో కుమ్మక్కైందని యావద్దేశానికి తెలిసిపోయిందన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను అది దొంగిలిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు చేపట్టి బిహార్ ఎన్నికలను కూడా తస్కరించాలని చూస్తున్నారని.. ఈ కుట్రను ఇండీ కూటమి అనుమతించదని స్పష్టంచేశారు. రెండు మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్లో 'ఓటర్ అధికార యాత్ర'కు ఆయన ఆదివారం ససారం నుంచి శ్రీకారం చుట్టారు. ఆ రాష్ట్రంలోని 20 జిల్లాల గుండా 16 రోజులపాటు 1,300 కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. సెప్టెంబరు 1న ముగిస్తారు. ససారం సభలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టి ఓట్ల చోరీని బహిర్గతం చేసినందుకే తనను ఈసీ అఫిడవిట్ అడుగుతోందన్నారు. 'ఈసీ ఏం చేస్తోందో.. ఏ విధంగా ఓట్ల చోరీకి పాల్పడుతోందో ఇప్పుడు దేశం మొత్తానికీ తెలిసిపోయింది" అని వ్యాఖ్యానించారు. "బిహార్, మహారాష్ట్ర, అసోం, బెంగాల్ సహా ఇక ఎక్కడ ఓట్ల చోరీ జరిగినా మేం పట్టేస్తాం' అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని.. రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని తొలగించాలని పార్లమెంటులో ప్రధాని ముందే చెప్పానని అన్నారు. ఒత్తిడితోనే మోదీ ప్రభుత్వం కులగణన ప్రకటన చేసిందన్నారు. వాస్తవానికి కులాల జనాభా లెక్కింపు చేపట్టరని.. అలాగే రిజర్వేషన్లపై పరిమితిని కూడా తొలగించరని స్పష్టంచేశారు. కాంగ్రెస్, ఇండీ కూటమి ఈ రెండు పనులూ చేస్తుందని హామీ ఇచ్చారు. తన యాత్రపై రాహుల్ 'ఎక్స్'లో కూడా స్పందించారు. 'ఓటరు అధికార యాత్ర'తో ప్రజల్లోకి వస్తున్నాం. ఒక వ్యక్తికి ఒకే ఓటు అన్న మౌలిక ప్రాథమిక హక్కును కాపాడేందుకే మా పోరాటం. రాజ్యాంగాన్ని రక్షించేందుకు బిహార్లో మాతో కలిసి నడవండి' అని పిలుపిచ్చారు. కాగా.. భారత్ జోడో యాత్ర-2లాగే ఈ యాత్ర కూడా హైబ్రిడ్ విధానంలో జరుగుతుందని.. నడవడంతో పాటు వాహనంలోనూ ఆయన యాత్ర సాగిస్తారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్నంతవరకు రాజ్యాంగానికి ప్రమాదమేనని.. ప్రజల హక్కులకు రక్షణ ఉండదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ సభలో అన్నారు. ఈసీ మోదీ ప్రభుత్వానికి ఏజెంటులా పనిచేస్తోందని ఆరోపించారు. వచ్చే బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రజలు పడగొడతారని జోస్యం చెప్పారు. ఐక్య ఇండీ కూటమి.. నితీశ్‌కుమార్ సర్కారును కూల్చేస్తుందని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ అన్నారు.

ఈసీపై చర్యలేకుండా చట్టం తెచ్చారు

ఎన్నికల కమిషన్‌పై ఎవరూ చర్య తీసుకోకుండా మోదీ ప్రభుత్వం 2023లో చట్టం తెచ్చిందని రాహుల్ ఆరోపించారు. బీజేపీకి సహకరిస్తున్నందుకు, ఓట్లు చోరీ చేస్తున్నందుకు మోదీ, అమిత్‌షా దీనిని తీసుకొచ్చారని అన్నారు. పాదయాత్ర ఔరంగాబాద్ చేరినప్పుడు ఆయన మాట్లాడారు. 'ఎన్నికల కమిషనర్లపై ఎవరూ కేసు పెట్టడానికి వీల్లేదు. ఇండియాలో ఏ కోర్టులోనూ కేసు పెట్టకూడదని 2023లో చట్టం తెచ్చారు. ఎన్నికల ప్రక్రియలో సీసీటీవీ ఫుటేజీపై ప్రభుత్వం ఎందుకు చట్టం తెచ్చిందో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టిన ఎన్నికల కమిషనర్లు చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

ఈసీకి 18 వేల అఫిడవిట్లు ఇచ్చాం

- ఒక్కదాని మీద కూడా చర్యల్లేవు: అఖిలేశ్

కాన్పూర్, ఆగస్టు 17: ఓట్ల చోరీకి సంబంధించి ఎన్నికల సంఘానికి (ఈసీకి) పార్టీ పరంగా తాము ఇప్పటి వరకూ 18,000 అఫిడవిట్లను సమర్పించామని, ఒక్కదానిమీద కూడా ఈసీ చర్యలు తీసుకోలేదని యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై తాము చేసిన ఫిర్యాదుల గురించికానీ, దాఖలు చేసిన అఫిడవిట్ల మీదగానీ ఈసీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఆదివారం అఖిలేశ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈసీపై పలు రకాల ఒత్తిళ్లు ఉంటున్నాయని మాకు తెలుసు. అయితే, ఈసీ తాను ఒంటరిని కాదని తెలుసుకోవాలి. సత్యం అనే మార్గంలో పయనించినప్పుడు ప్రజలు కూడా తోడుగా నిలుస్తారు. ఈసీ సరైన మార్గంలో పయనిస్తే కోట్లాదిమంది భారతీయులు ఆ సంస్థకు రక్షణ కవచంలా ఉంటారు' అని అఖిలేశ్ పేర్కొన్నారు. ఈసీలో ప్రస్తుతం కావాల్సింది సంస్కరణలు కావని, ఆ సంస్థలో పూర్తిగా ప్రక్షాళన జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

దొంగ ఓట్లపై కాంగ్రెస్ వీడియో ఏఐ సృష్టే!

- ఫ్యాక్ట్ చెక్ ద్వారా స్పష్టం చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: దొంగ ఓట్లపై కాంగ్రెస్ పార్టీ పోస్టు చేసిన వీడియో నిజం కాదని, అది ఏఐ ద్వారా సృష్టించినదని ఎన్నికల సంఘం(ఈసీ) వెల్లడించింది. ఏఐ వీడియో ద్వారా దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఈసీ ఆరోపించింది. 'ఓట్ అధికార్ యాత్ర' సందర్భంగా దొంగ ఓట్లపై పౌరుల అభిప్రాయాలతో రూపొందించిన ఒక వీడియోను కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దీనిని ఫ్యాక్ట్ చెక్ ద్వారా పరిశీలించిన ఈసీ.. ఈ వీడియో ఏఐ ద్వారా సృష్టించిందేనని ఆదివారం ప్రకటించింది. బిహార్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఈసీ పేర్కొంది. కాగా, దొంగ ఓట్ల వ్యవహారంపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘంపై పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఎన్నికలను ప్రభావితం చేసేలా కేంద్రంలోని అధికార పార్టీతో ఈసీ పని చేస్తోందని విపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్న విషయమూ విధితమే.

ఉక్రెయిన్‌కు నాటో తరహా రక్షణ

- అమెరికా, యూరప్ భద్రతా హామీ ఇచ్చేందుకు పుతిన్ అంగీకరించారు
- ట్రంప్ ప్రత్యేక రాయబారి విట్కాఫ్



వాషింగ్టన్, ఆగస్టు 17: రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఈ అంశంలో మరో ముందడుగు పడిందని తన సోషల్ మీడియా ట్రుత్‌లో పోస్టు పెట్టారు. అదేమిటనేది వెల్లడించలేదు. తర్వాత దీనికి సంబంధించి అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ కీలక వివరాలు వెల్లడించారు. నాటో తరహాలో అమెరికా, యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు భద్రతా హామీ (సెక్యూరిటీ గ్యారంటీ) ఇచ్చేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారని వెల్లడించారు. "నాటో ఆర్టికల్-5 ప్రకారం కూటమి సభ్య దేశాలపై బయటి దేశమేదైనా దాడి చేస్తే.. కూటమి దేశాలన్నీ అండగా నిలిచి, యుద్ధంలోకి దిగుతాయి. ఈ రక్షణ కోసమే ఉక్రెయిన్ నాటోలో చేరాలనుకుంది. కానీ నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకునే అంశాన్ని పుతిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే నాటో ఆర్టికల్-5 తరహాలో ఉక్రెయిన్‌కు అమెరికా, యూరప్ దేశాలు భద్రతా హామీ ఇచ్చేందుకు అలాస్కా చర్చల్లో పుతిన్ అంగీకరించారు. పుతిన్ ఇలా అంగీకరించడం ఇదే మొదటిసారి" అని విట్కాఫ్ పేర్కొన్నారు. యుద్ధ విరమణ కోసం ఇదొక రాజీ ప్రయత్నమని, ఏదేమైనా ఉక్రెయిన్ అంగీకరించడంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. మరోవైపు, సోమవారం వాషింగ్టన్‌లో ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమావేశం కానున్నారు. ట్రంప్ ఆహ్వానం, జెలెన్‌స్కీ విజ్ఞప్తి మేరకు పలు యూరప్, నాటో దేశాల నేతలు ఈ భేటీలో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 22న తనతోపాటు పుతిన్, జెలెన్‌స్కీ పాల్గొనేలా త్రైపాక్షిక సమావేశం నిర్వహిస్తానని యూరప్ దేశాల నేతలకు ట్రంప్ సమాచారం ఇచ్చారని అమెరికా మీడియా పేర్కొంది.

4 కిలోమీటర్ల దూరంలో ఉన్న సైనికుల కాల్చివేత

- ఉక్రెయిన్ స్నైపర్ యూనిట్ 'ఘోస్ట్' ప్రపంచ రికార్డు

కీవ్, ఆగస్టు 17: 13వేల అడుగుల దూరంలో ఉన్న రష్యా సైనికులను కాల్చి చంపి ఉక్రెయిన్ స్నైపర్ యూనిట్ 'ఘోస్ట్' ప్రపంచ రికార్డు సృష్టించింది. గురువారం(ఆగస్టు 14) పోక్రోవ్‌స్క్ ప్రాంతంలో ఇద్దరు రష్యా సైనికులను ఘోస్ట్ స్నైపర్ యూనిట్ ఉక్రెయిన్‌లోనే తయారు చేసిన ఎలిగేటర్ 14.5ఎంఎం రైఫిల్‌తో దాదాపు 4కిలోమీటర్ల దూరం నుంచే మట్టుబెట్టింది. ఇందుకోసం కృత్రిమ మేధ, డ్రోన్ సాయం తీసుకుంది. ఈ విషయాన్ని మిలిటరీ జర్నలిస్టు యూరీ బుటుసోవ్ కీవ్ పోస్ట్ పత్రిక ద్వారా వెల్లడించారు. ఇప్పటిదాకా ఈ రికార్డు సెక్యూరిటీ సర్వీస్ ఆఫ్ ఉక్రెయిన్‌కు చెందిన 58ఏళ్ల స్నైపర్ పేరు మీద ఉంది. అతడు లార్డ్ ఆఫ్ ఒబ్రైజాన్ రైఫిల్‌తో 3,800మీటర్ల దూరంలోని వ్యక్తిని కాల్చివేశాడు.

పాక్ రక్షకుడిగా దేవుడు నన్ను సృష్టించాడు: మునీర్



న్యూఢిల్లీ, ఆగస్టు 17: పాకిస్థాన్‌కు రక్షకుడిగా దేవుడు తనను సృష్టించాడని ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ వ్యాఖ్యానించారు. దేశాధ్యక్షుడిగా, లేదా రాజకీయ నేతగా మారాలనే ఆలోచనలేమీ తనకు లేవన్నారు. అమెరికా పర్యటన నుంచి తిరిగి వస్తూ బెల్జియంలో దిగిన మునీర్ పాక్ జర్నలిస్టు సుహైల్ వార్రాయిచ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాజకీయ మార్పులకు సమయం ఆసన్నమైందన్న వార్తలను ఊహాగానాలుగా ఆయన తోసిపుచ్చారు. 'దేశ రక్షకుడిగా నన్ను దేవుడు సృష్టించాడు. అంతకుమించి మరే హోదా నాకు అవసరం లేదు. నేనొక సైనికుడిని. దేశం కోసం ప్రాణాలర్పించడమే నా అతిపెద్ద ఆకాంక్ష' అన్నారు. తమ దేశాన్ని అస్థిరపరిచేందుకు అఫ్ఘానిస్థాన్‌తో భారత్ చేతులు కలిపితేగనుక భారత్‌పై తాము దాడి చేస్తామని హెచ్చరించారు.

భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన!

- చర్చల నిలిపివేత దిశగా పరిణామాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 17: భారత్‌పై అమెరికా సుంకాలు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం విరమణపై అస్పష్టత నేపథ్యంలో.. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన నెలకొంది. భారత్‌పై తొలుత 25శాతం వాణిజ్య సుంకాలు విధించిన ట్రంప్.. తాము వద్దని చెప్పినా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ మరో 25శాతం సుంకాలు విధించారు. ఈ అంశం తేలేవరకు వాణిజ్య చర్చలు ఉండబోవని కూడా ప్రకటించారు. తొలి 25 శాతం సుంకం ఇప్పటికే అమల్లోకి రాగా.. అదనపు 25శాతం సుంకం ఈ నెల 27 నుంచి అమల్లోకి రానుంది. మరోవైపు వాణిజ్య ఒప్పందంపై చర్చల ప్రక్రియ కొనసాగుతోందని.. ఈ నెల 25 నుంచి 29 వరకు జరగాల్సిన ఆరో దశ చర్చల కోసం అమెరికా బృందం రానుందని భారత అధికార వర్గాలు తొలుత పేర్కొన్నాయి. కానీ అమెరికా బృందం పర్యటన రద్దయిందని తాజాగా కేంద్ర వాణిజ్యశాఖ వర్గాలు తెలిపాయి.

తెలంగాణ సహా 12 రాష్ట్రాల రాజధానుల్లో సమాచార భవన్‌లు

న్యూఢిల్లీ, ఆగస్టు 17: స్థానిక మీడియాతో ప్రభుత్వానికి సమన్వయం పెంచే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సహా దేశంలోని 12 రాష్ట్రాల రాజధాని నగరాల్లో సమాచార భవన్‌లను నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఆయా నగరాల్లో ఎక్కడో మారుమూల ప్రదేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు దూరంగా ఇవి ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని వసతులు, వివిధ విభాగాలన్నీ ఒకేచోట ఉండేలా కొత్త భవనాలను నిర్మించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్ తరహాలో వీటి నిర్మాణం జరపాలని సూచించింది. ఒక్కో భవనానికి రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నారు.

వారే రాజ్యాంగాన్ని తొక్కేశారు!

- తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్న వారే.. అంబేడ్కర్‌కు ద్రోహం చేశారు
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని
- ఢిల్లీలో హైవేలను ప్రారంభించిన మోదీ


ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ కూలీలతో మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: "రాజ్యాంగ ప్రతిని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొనేవారే.. ఆ రాజ్యాంగాన్ని తొక్కేశారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలకు ద్రోహంచేశారు" అంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వాలు.. రాజ్యాంగ స్ఫూర్తిని తక్కువ చేశాయని, సామాన్యులను అణిచివేసేలా శాశ్వత చట్టాలను తీసుకువచ్చాయని దుయ్యబట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై విమర్శల వర్షం కురిపించారు. "ఎవరైతే రాజ్యాంగాన్ని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొన్నారో.. వారే దానిని తొక్కేశారు. బీఆర్ అంబేడ్కర్ భావాలు, ఆశయాలకు తీరని ద్రోహం చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం-1957లోని ఓ నిబంధనను ఆయన ప్రస్తావించారు. "ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టంలో అత్యంత ప్రమాదకరమైన నిబంధన చేర్చారు. ఎవరైనా పారిశుధ్య కార్మికులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ విధులకు గైర్హాజరైతే నెల రోజులపాటు జైలుకు పంపేలా నిబంధన తెచ్చారు. సఫాయీ కర్మచారుల పట్ల వారి (కాంగ్రెస్) ఆలోచన ఎలా ఉందో ఒక్కసారి ఆలోచించండి. అత్యంత చిన్నతప్పుకే కార్మికులను జైల్లో పెట్టాలా? అలాంటి వారు ఇప్పుడు సామాజిక న్యాయం గురించి ఉపన్యాసాలు దంచికొడుతున్నారు. ఇలాంటి వికృత చట్టాలను తేవడం, అమలు చేయడం వారికే సాధ్యం. అయితే ఇప్పుడున్నది మోదీ. అలాంటి అణిచివేత చట్టాలను గుర్తించి బుట్టదాఖలు చేస్తున్నాం" అన్నారు. హరియాణాలోని గత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా ప్రధాని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. "హరియాణాలో కాంగ్రెస్ హయాంలో అవినీతి రాజ్యమేలింది. లంచాలు తీసుకోకుండా ఒక్క ప్రభుత్వ ఉద్యోగాన్నీ ఇవ్వలేదు. డబ్బులు, లేకపోతే సిఫారసులతో ఉద్యోగాలను అమ్ముకున్నారు. కానీ, ఇప్పుడు ఈ పరిస్థితి మీకెక్కడా కనిపించదు. సీఎం నాయబ్ సింగ్ సైనీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు ఇస్తోంది" అని ప్రధాని అన్నారు.

ఢిల్లీ ట్రాఫిక్ కష్టాలకు చెక్!

ఢిల్లీలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్(యూఈఆర్)-2లను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సుమారు రూ.11వేల కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులతో రాజధానివాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అలాగే సోనిపట్, రోహ్‌తక్, బహదూర్‌గఢ్, గురుగ్రామ్‌ల నుంచి విమానాశ్రయానికి చేరుకునే సమయం తగ్గిపోనుంది. కాగా ఢిల్లీలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను అర్థవంతం చేశామని, యూఈఆర్ రహదారి నిర్మాణంలో వినియోగించామని ప్రధాని చెప్పారు. రహదారుల నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికులు, ఇంజనీర్లతో మోదీ సంభాషించారు. అనంతరం, నూతన రహదారిపై ప్రధాని రోడ్ షో నిర్వహించారు. ఇదిలా ఉండగా జీఎస్టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు పంపామని ప్రధాని మోదీ తెలిపారు. దీపావళికన్నా ముందే అమలు చేయనున్న ఈ సంస్కరణలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇకపై పీఎంవో@ సెంట్రల్ విస్టా!

- వచ్చే నెలలో సౌత్ బ్లాక్ నుంచి తరలింపు

కేంద్ర సెక్రటేరియట్‌లోని సౌత్ బ్లాక్‌లో 78 ఏళ్లకు పైగా ఉన్న ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) వచ్చే నెలలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మించిన కార్యనిర్వాహక భవన సముదాయానికి (ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్) తరలివెళ్లనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికార వర్గాలు వెల్లడించాయి. నూతన పీఎంవో కార్యాలయానికి ఒక కొత్త పేరు పెట్టనున్నారు. మూడోసారి అధికారం చేపట్టాక పీఎంవోను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ప్రజాసేవకు పీఎంవో ఒక ప్రదేశంగా ఉండాలన్న వ్యాఖ్యల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఆ పేరు ఉండనుందని తెలుస్తోంది.

కశ్మీర్‌లో మళ్లీ మేఘ విస్ఫోటం

- కొండ చరియలు పడి ఏడుగురి మృతి
- హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు


జోధ్ ఘాటి గ్రామంలోకి కొట్టుకువచ్చిన బురద, రాళ్లు

జమ్ము/శిమ్లా, ఆగస్టు 17: జమ్ము, కశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఆదివారం తెల్లవారు జామున మేఘ విస్ఫోటం, కొండ చరియలు విరిగి పడడం కారణంగా ఏడుగురు మృతి చెందారు. ఐదుగురు గాయపడ్డారు. రాజ్‌బాఘ్, జంగ్‌లోత్ ప్రాంతంలోని జోధ్ ఘాటి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. జోధ్ ఘాటి గ్రామంలో మేఘ విస్ఫోటం కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయి. జంగ్‌లోత్ ప్రాంతంలో కొండ చరియలు పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఈ ప్రాంతంలోని నదుల్లో నీటి ప్రవాహ మట్టం బాగా పెరిగిపోయింది. ఉజ్ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. జమ్ము, కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. మరోవైపు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగి పడడంతో పాటు ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో పనర్సా, టకోలి, నాగ్వైయిన్ ప్రాంతాల్లోని ఇళ్లలోకి బురద చేరింది.

నైతిక విలువలు ఉంటేనే పౌరసత్వం

వలసదారుల దరఖాస్తులపై అమెరికా

న్యూఢిల్లీ, ఆగస్టు 17: వలసదారుల పౌరసత్వ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనే సమయంలో 'నైతిక ప్రవర్తన'పై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను అమెరికా పౌరతస్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) ఆదేశించింది. పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకొనేవారికి ఎలాంటి నేర చరిత్ర లేకపోవడం మంచి నైతిక ప్రవర్తనగా అమెరికా ఇమిగ్రేషన్ చట్టం పేర్కొంటోంది. ఇప్పుడు దీని పరిధిని మరింత విస్తరించనున్నారు. కుటుంబ బంధాలకు, సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, సమాజంతో మమేకమవడం, ఉన్నత విద్యార్హతలు, స్థిరమైన, చట్టబద్ధమైన ఉద్యోగం, పన్ను చెల్లించే స్థితి వంటి అంశాలతో పాటు దరఖాస్తుదారులు అమెరికాలో నివసించిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు.

లోకం తీరు



జాతీయ రహదారులపై వాహనాల రద్దీ

- కొర్లపహాడ్, పంతంగి, గూడూరు టోల్‌గేట్ల వద్ద వాహనాల బారులు
- చిట్యాల నుంచి చౌటుప్పల్‌కు గంట సమయం

బీబీనగర్/కేతేపల్లి/చౌటుప్పల్ టౌన్/చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై ఆదివారం వాహనాల రద్దీ పెరిగింది. హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారి, విజయవాడ-హైదరాబాద్ 65వ నెంబరు జాతీయ రహదారి మీదుగా పెద్దసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, శని, ఆదివారాలు సెలవులు కావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు తమ సొంత ప్రాంతాలకు గురు, శుక్రవారాల్లో తరలివెళ్లారు. సెలవులు ముగిసి సోమవారం విధులకు వెళ్లాల్సి ఉన్న నేపథ్యంలో తిరుగు పయనమయ్యారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారులు వాహనాలతో కిక్కిరిశాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద గల టోల్ ప్లాజాలోని కౌంటర్ల వద్ద సెన్సార్లు వేగంగా పని చేయకపోవడం, రెండు టోల్ కౌంటర్లు మూసి ఉండడంతో ఇక్కడ వాహనాలు బారులు తీరాయి. సాధారణ రోజుల్లో 10 నుంచి 12 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ఆదివారం 20 వేల వాహనాలు ప్రయాణించాయి. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజాను దాటేందుకు ఒక్కో వాహనానికి ఏడు నిమిషాల సమయం పట్టింది. చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఇక్కడ వాహనాల ప్రయాణం ఆలస్యమైంది. చిట్యాల నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌటుప్పల్‌కు వెళ్లేందుకు గంట సమయం పట్టిందని పలువురు ప్రయాణికులు తెలిపారు. ఇక్కడ సాధారణ రోజుల్లో 30 నుంచి 35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, ఆదివారం 38 వేల వాహనాలు వెళ్లాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారిపైనా వాహనాల రద్దీ పెరిగి బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి.



నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు

తిరుమలలో సర్వదర్శనానికి 14 గంటలు

- గదుల కోసం భక్తుల పడిగాపులు

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కాస్త తగ్గింది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు... వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ భక్తులకు కూడా రెండు నుంచి మూడు గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు తిరుమలలో గదులకు డిమాండ్ కొనసాగుతునే ఉంది. గదులు లభించని భక్తులు జర్మన్‌షెడ్లు, పార్కులు, చెట్ల కింద, ఫుట్‌పాత్‌లపై సేదతీరుతున్నారు. సీఆర్వో కార్యాలయం ముందు గదుల కోసం భక్తులు పడిగాపులు కాస్తున్నారు.

బీసీల యుద్ధభేరీకి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మద్దతు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ

బర్కత్‌పుర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న నిర్వహించనున్న బీసీల యుద్ధభేరీకి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ వెల్లడించారు. కిషన్ రెడ్డి నివాసంలో యుద్ధభేరీ పోస్టర్‌ను ఆవిష్కరించారని ఆయన తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో రవీంద్రభారతిలో బీసీల యుద్ధభేరీ నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సారధ్యంలో జరిగే యుద్ధభేరీకి అన్ని జిల్లాల నుంచి పెద్దఎత్తున బీసీలు తరలివస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నందగోపాల్, కార్యదర్శి భరత్‌గౌడ్, ఆకుల లలిత, ఈబీసీ రాష్ట్ర నాయకులు గంగాపురం వెంకటరెడ్డి, దివ్యాంగుల సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తాం.. ఇటీవలే 120 కోట్లు విడుదల చేశాం: మంత్రి పొన్నం

- చేపలంటేనే తెలంగాణ గుర్తుకు రావాలి: మహేశ్ గౌడ్
- గంగపుత్రులు కేంద్ర సబ్సిడీలను వినియోగించుకోవాలి: దత్తాత్రేయ



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న మంత్రి పొన్నం, మహేశ్ కుమార్, దత్తాత్రేయ తదితరులు

ఖైరతాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మత్స్యకారుల (గంగపుత్రుల) సంక్షేమం, మత్స్య పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గంగ తెప్పోత్సవం అనంతరం ఎన్టీఆర్ మార్గ్‌లో గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, చేపల వృత్తిదారులకు కోల్డ్ స్టోరేజీలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గంగపుత్రుల సమస్యలపై ముఖ్యమంత్రితో ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవలే మత్స్యకారుల అభివృద్ధికి రూ. 120 కోట్లు విడుదల చేశామని కూడా ఆయన గుర్తు చేశారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, చేపలంటేనే తెలంగాణ గుర్తుకు వచ్చేలా మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేద్దామని సూచించారు. కుల వృత్తులన్నింటికీ పూర్వ వైభవం తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికలు వేస్తున్నారని ఆయన తెలిపారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, కుల వృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం సరిగా వినియోగించుకోవడం లేదని విమర్శించారు. ఈ నిధులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్రం 60 శాతం సబ్సిడీ ఇస్తున్నందున, రాష్ట్రం కూడా 40 శాతం సబ్సిడీ ఇవ్వాలని ఆయన కోరారు. గంగపుత్రులు చేపలు పట్టడంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు ఖైరతాబాద్ ఏడుగుళ్ల దేవాలయం నుంచి హుస్సేన్‌సాగర్‌లోని గంగమ్మ దేవాలయం వరకు భారీ శోభాయాత్ర జరిగింది. ఇందులో 250 బోనాలు, గంగతెప్పలు, వలలు, జోగినీ మహిళల నృత్యాలు, పోతరాజుల వీరంగాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అండతోనే ప్రభుత్వాలు: మహేశ్ గౌడ్

రవీంద్రభారతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీల కలయికే భారతదేశమని.. మనం లేకుంటే దేశమే లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. మన అండతోనే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న వారు మతాల పేరుతో చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీల సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా మహేశ్‌గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ముందుగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో మోదీ గెలవడానికి ఓట్ చోరీ చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఐక్యంగా ఉంటేనే దేశం సురక్షితంగా ఉంటుందని.. రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ల తర్వాత కూడా సామాజిక న్యాయంపై చర్చ జరుగుతోందని మంత్రి పొన్నం అన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు ఐక్యత పాటించాలని.. మన జాతి కోసం, సమస్యల పరిష్కారం కోసం కలిసి ఉద్యమించాలని చెప్పారు.

బీజేపీ పల్లె బాట

- స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో కమల దళం
- 21, 22 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో రాంచందర్‌రావు పర్యటన

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా రైతు, యువత, మహిళా సంఘాలతో భేటీలు నిర్వహించడం, స్థానిక సమస్యలను పరిష్కరించాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వంటి కార్యక్రమాలను చేపట్టనుంది. మండల, జిల్లా స్థాయిలో రెండు దశల్లో ర్యాలీలు నిర్వహించనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పల్లె బాటలో భాగంగా రాష్ట్రంలోని 566 మండలాల పరిధిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారు. తమకు కేటాయించిన మండలాల్లో పర్యటిస్తారు. స్థానికంగా వివిధ సంఘాలతో నిర్వహించే సమ్మేళనాలు, రచ్చబండ కార్యక్రమాలకు హాజరవుతారు. పార్టీ కార్యకర్తలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికకు పోటీపడుతున్న నాయకులతో సమావేశమవుతారు. అదే మండలంలో రాత్రి బస చేస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఈ నెల 21, 22 తేదీల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు రంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. మండల, జిల్లా ర్యాలీలు పూర్తయిన తర్వాత ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు స్థానిక సంస్థలను ఎలా నిర్వీర్యం చేశాయో వివరిస్తూ ఈ నెల 21 నుంచి 25 వరకు మండల స్థాయిలో నిరసన ర్యాలీలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. అనంతరం 26 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి కలెక్టర్లకు స్థానిక సమస్యలపై వినతి పత్రాలు అందజేస్తామన్నారు.

రాహుల్‌కు రాజకీయాలపై అవగాహన లేదు: ప్రభాకర్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి రాజకీయాలపై అవగాహన లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ ఒక పెద్ద ప్రాంతీయ పార్టీగా మిగిలిందని ఎద్దేవా చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రభాకర్ మాట్లాడారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ వారసత్వ, ఓడిపోయే పార్టీగా మిగిలిపోయిందని పేర్కొన్నారు.

గోదావరికి పెరిగిన వరద

- మేడిగడ్డ బ్యారేజీకి 5.66 లక్షల క్యూసెక్కులు
- శ్రీరాంసాగర్‌కు రూ.1.51 లక్షల క్యూసెక్కుల నీరు
- నాగార్జునసాగర్, శ్రీశైలానికి లక్షన్నర క్యూసెక్కులు
- రాష్ట్రంలో నేడు, రేపు అతి భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



జలకళతో నిజాంసాగర్ ప్రాజెక్టు

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో గోదావరిపై ఉన్న ప్రాజెక్టులకు వరద పెరుగుతోంది. దీంతో నిన్న మొన్నటి వరకు మోస్తరు నిల్వలతోనే ఉన్న గోదావరి జలాశయాలు ఇప్పుడు నిండు కుండల్లా మారుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1,51,806 క్యూసెక్కుల వరద వస్తోంది. వరద కాల్వకు 5 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 90 టీఎంసీలు కాగా ప్రస్తుతం 64 టీఎంసీల నీరు ఉంది. నిజాం సాగర్ ప్రాజెక్టులోకి 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 43 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. 17 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రాజెక్టులో 12 టీఎంసీల నిల్వ ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి 5.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 34 అడుగులకు చేరింది. ఇక కృష్ణా నదిపై గద్వాల జిల్లాలో ఉన్న జూరాల ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 11 గేట్ల ద్వారా 77,946 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 38,818 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 1,78,101 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మూడు గేట్లను ఎత్తి 79,269 క్యూసెక్కులను, రెండు విద్యుత్ కేంద్రాల ద్వారా 65,807 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు 1,45,076 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు గేట్లను ఐదడుగుల మేర ఎత్తి 1,70,588 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 303 టీఎంసీల నీరు ఉంది.

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షం..

శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఆదిలాబాద్ జిల్లాలోని 12 మండలాల్లో అతి భారీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని తాంసిలో 17.2, తలమడుగులో 16.4, మావలలో 16, సాత్నాలలో 15.6, సిరికొండలో 14.8, గుడిహత్నూర్‌లో 14.7, ఆదిలాబాద్ అర్బన్ మండలంలో 14.4, ఇంద్రవెల్లిలో 13.7, బోరాజ్‌లో 13.6, జైనథ్‌లో 13, ఇచ్చోడలో 12.6, ఆదిలాబాద్ రూరల్‌లో 12.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలో ఆదివారం వర్షాలు దంచి కొట్టాయి. సారంగాపూర్ మండలంలో 13 సెం.మీ, తానూర్ మండలంలో కూడా 10 సెం.మీ వర్షపాతం నమోదైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ఆదివారం రాత్రి 8.50 నుండి 10 గంటల వరకు భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా తాండూరులో ఆదివారం సాయంత్రం జోరు వాన కురిసింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి తేలికపాటి జల్లులు కురిశాయి.

జలపాతంలో గల్లంతైన యువకుడి మృతి..

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల జలపాతంలో గల్లంతైన యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన పామర్తి ప్రేమ్‌కుమార్(23) శనివారం ఏడుబావులకు వచ్చాడు. అక్కడ సెల్ఫీ దిగే క్రమంలో జలపాతంలో పడిపోయాడు.

నేడు, రేపు అతి భారీ వర్షాలు

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. భూపాలపల్లి జిల్లాకు ఆరెంజ్.. ఆదిలాబాద్, హన్మకొండ, కామారెడ్డి, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

సౌదీలో కష్టాలు.. కన్నీళ్లు అనుభవించా

- మంత్రి పొన్నం చొరవతో ఇంటికి వచ్చా
- ఏడేళ్లు ఎడారి జీవితం అనుభవించిన ఈశ్వర్ ఆవేదన

భీమదేవరపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'సౌదీలో కష్టాలు.. కన్నీళ్లు అనుభవించా.. ఏడేళ్ల పాటు ఎడారి జీవితం నిత్య నరకంలా మారింది. డ్రైవర్ పనని ఖర్జూర తోటలో కూలీగా పెట్టారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో భారత్‌కు రాగలిగాను' ఇది సౌదీలో నరకం అనుభవించిన హనుమకొండ జిల్లా వాసి తాళ్లపల్లి ఈశ్వర్ ఆవేదన. సౌదీ నుంచి ఆదివారం ఇంటికి చేరుకున్న ఆయన తన బాధను మీడియాతో వెళ్లబోసుకున్నారు. భీమదేవరపల్లి మండలంలోని కొప్పూర్ గ్రామానికి చెందిన ఈశ్వర్ ఆర్థిక ఇబ్బందులతో ఏడేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లారు. ఈ క్రమంలో వీసా, పాస్‌పోర్టు గడువు ముగియడంతో ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు.

కూతురి అప్పగింతలు చేస్తూ కుప్పకూలిన తల్లి

- తీవ్ర భావోద్వేగానికి గురై గుండెపోటుతో మృతి



బానోత్ కల్యాణి

కామేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెళ్లయి అత్తారింటికి వెళ్లిపోతున్న కూతురికి అప్పగింతలు చేస్తూ తీవ్ర భావోద్వేగానికి గురై గుండెపోటుతో ఆమె తల్లి మృతిచెందింది. ఈ విషాద ఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం అబ్బాసుపురం గ్రామంలో ఆదివారం జరిగింది. అబ్బాసుపురం గ్రామానికి చెందిన బానోత్ మోహిలాల్, కల్యాణి(40) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. వారి పెద్ద కుమార్తె సింధు వివాహం టేకులపల్లికి చెందిన బాలాజీతో ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. వివాహం అనంతరం సాయంత్రం అప్పగింతల కార్యక్రమం జరుగుతోంది. ఈ క్రమంలో అల్లుడితో పాటు వియ్యపువారికి కూతురిని అప్పగిస్తూ.. భావోద్వేగానికి గురైన కల్యాణి గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందింది. ఆమె మృతితో పెళ్లింట విషాదం అలముకుంది.

కూకట్‌పల్లిలో 11 మంది జూదరుల అరెస్టు

- నిందితుల్లో ఆల్విన్ కాలనీ కార్పొరేటర్, ఎమ్మెల్సీ తండ్రి, ఎమ్మెల్యే వియ్యంకుడు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, కూకట్‌పల్లిలోని ఓ పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి దాడి చేసిన బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకుని కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. అరెస్టయిన వారిలో ఓ కార్పొరేటర్, ఓ ఎమ్మెల్సీ తండ్రి, ఓ ఎమ్మెల్యే వియ్యంకుడు ఉన్నారు. కూకట్‌పల్లి వైష్ణవి కాలనీ ప్లాట్ నంబర్ 27లోని గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు వియ్యంకుడు నాయినేని తులసీరావు ఆ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. తులసీరావుతోపాటు ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండల్‌రావు, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.2,52,090 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాద్రికి ముప్పు

- రాజ్యసభలో సీపీఎం పక్షనేత జాన్ బ్రిటాస్

భద్రాచలం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ముంపు ముప్పు ఉందని, ఆ ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న నిర్వాసితులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని రాజ్యసభలో సీపీఎం పక్షనేత జాన్ బ్రిటాస్ అన్నారు. అయితే ఏపీలో నిర్మిస్తున్న ఆ ప్రాజెక్టుకు సీపీఎం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఏపీలోని పోలవరం ముంపు ప్రాంతాల పరిశీలనకు వెళ్తూ ఆదివారం ఆయన భద్రాచలంలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ రాష్ట్ర విభజన శాస్త్రీయంగా నిర్వహించలేదని ఫలితంగా భద్రాచలం ఏజెన్సీకి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి ఏపీ పునర్విభజన అంశాన్ని పునఃపరిశీలన చేయాలని కోరారు. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కూలీల పిల్లలకు బీఎస్సీ, బీటెక్‌లో 15 శాతం సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీల పిల్లలకు మొట్టమొదటిసారిగా బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో ప్రత్యేక కోటా అమలు చేయనున్నట్లు ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. బీఎస్సీ అగ్రికల్చర్‌లో 15 శాతం, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో 15శాతం సీట్లు వ్యవసాయ కూలీల పిల్లలకు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ సీట్లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉండాలన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు మొదటి సెమిస్టర్‌కు రూ.49,560 ఫీజు ఉంటుందని తెలిపారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ వర్సిటీ, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ, పీవీ నరసింహారావు వెటర్నరీ వర్సిటీల్లో వ్యవసాయ, అనుబంధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 19 నుంచి 23 వరకు మొదటి దశ సంయుక్త కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ వెల్లడించారు.

కౌన్సెలింగ్ పేరుతో భర్తను చితకబాదిన ఎస్సై సస్పెన్షన్

వేమనపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి ఎస్సై సురేశ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఓ దంపతుల గొడవలో అత్యుత్సాహం ప్రదర్శించి కౌన్సెలింగ్ పేరుతో భర్తను చితకబాదినట్లు విచారణలో వెల్లడి కావడంతో రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా ఈ నిర్ణయం తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం సుంపుటం గ్రామానికి చెందిన అల్లం కిష్టయ్యకు నీల్వాయి గ్రామానికి చెందిన ప్రమీలకు 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. ప్రమీల అనారోగ్యంతో 20 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. భార్య రాకపోవడంతో కిష్టయ్య అత్తగారింటికి వెళ్లి వారితో గొడవపడ్డాడు. దీంతో అత్తమామలు అతడిపై నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎస్సై సురేశ్ కౌన్సెలింగ్ పేరుతో కిష్టయ్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకుని విపరీతంగా కొట్టడంతో అతడు అనారోగ్యం పాలయ్యాడు. ఎస్సైపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఏసీపీకి ఫిర్యాదు చేశాడు. ఏసీపీ వెంకటేశ్వర్లు ఎస్సై సురేశ్‌పై విచారణ జరిపి రామగుండం సీపీకి నివేదిక అందించారు.

15 మంది విద్యార్థినులకు అస్వస్థత

- కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

కల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భోజనం వికటించడంతో ఖమ్మం జిల్లా కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రమాదం తప్పింది. శనివారం పాఠశాల ముగిసిన తర్వాత వసతి గృహంలో అల్పాహారంగా పకోడీ ఇచ్చారు. తర్వాత దాన్నే రాత్రి భోజనంతో పాటుగా వడ్డించారు. ఇది తిన్న తర్వాత కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు, వికారంతో 15 మంది అస్వస్థతకు గురవగా వార్డెన్‌ సిబ్బంది వెంటనే కల్లూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారు కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. తహసీల్దార్ సాంబశివుడు, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి విజయలక్ష్మి, ఎంఈవో పి.నివేదిత గిరిజన పాఠశాలను సందర్శించి ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపారు. కాగా, ఇదే ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 5న ఉడికీ ఉడకని అన్నం వడ్డించడంతో 38 మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు.

పుట్టినరోజున బహుమతిగా యూరియా బస్తా

అన్నదాతకు మిత్రుని చేయూత



ఇనుగుర్తిలో రైతు పుట్టిన రోజున యూరియా బస్తాను బహుమతిగా ఇస్తున్న మిత్రుడు శోభన్

ఇనుగుర్తి/కేసముద్రం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఓ వ్యక్తి తన మిత్రుని పుట్టిన రోజు సందర్భంగా యూరియా బస్తాను బహుమతిగా ఇచ్చి సంతోషాన్ని నింపాడు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లికి చెందిన బొల్లు శివకృష్ణ (చింటు) పుట్టినరోజు సందర్భంగా ఇనుగుర్తిలో ఆయన మిత్రుడు మలిశెట్టి శోభన్ కేక్ తీసుకువచ్చి కట్ చేయించాడు. అప్పటికే యూరియా బస్తాల టోకెన్ల కోసం శివకృష్ణ ప్రయత్నించగా అవి అందకపోవడంతో నిరుత్సాహంగా ఉన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న శోభన్ ఓ యూరియా బస్తానే శివకృష్ణకు బహుమతిగా ఇచ్చి ఆశ్చర్యపరిచాడు. మరోవైపు.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం విలేజి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే కూడలిలో రహదారిపై ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు యూరియా కోసం రాస్తారోకోకు దిగారు. అంతకు ముందు కేసముద్రం, ధన్నసరి సొసైటీలకు ఒక లారీ యూరియా రావడంతో టోకెన్లను రైతువేదికలో ఇచ్చారు. దీనికోసం తెల్లవారుజాము నుంచే రైతులు భారీసంఖ్యలో రైతు వేదిక వద్దకు తరలివచ్చారు. టోకెన్లు అయిపోవడంతో మిగిలిన రైతులంతా బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు.



కేసముద్రంలో యూరియా టోకెన్ల కోసం బారులు తీరిన కర్షకులు

నల్లకలువల కొలనులో వికసించిన కవిత్వం



> రజిత ఉద్యమ కవిత్వం ప్రధానంగా స్త్రీ సమస్యను, దళిత సమస్యను, తెలంగాణ అస్తిత్వ ఆరాట ఆత్మగౌరవ ఆకాంక్షలను చుట్టుకొని కనిపిస్తుంది. సామాజికంలోనూ వ్యక్తిగతంలోనూ రజితకి కవిత్వం ఊరట అయింది, ఓదార్పు అయింది. తన లోపల నిరంతరం జాజ్వల్యమానంగా రగిలే భావోద్వేగాలకి బాసట అయింది. ఆ జ్వాలాముఖి స్వరం శాశ్వతంగా మూగబోయింది, తను పంచిన కవితలను గుర్తులుగా వదిలి.

అనిశెట్టి రజిత వరంగల్ చైతన్యజ్వాల. హోరెత్తి ఎగిసిపడే కల్లోల కాలపు కడలి తరంగం. కవిత్వమై కాలాన్ని వ్యాఖ్యానించిన సంవేదనాశీలి. ఉద్యమోపజీవి. 1958 ఏప్రిల్ 14న పుట్టి పద కొండేళ్ళ వయసులోనే 1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎత్తిన పిడికిలి, విప్పిన ధిక్కారస్వరం– అర్ధదశాబ్దకాలం బహుముఖ సామాజిక ఉద్యమాలలో, ఊరేగింపులలో ఆమెను ముందువరసలో నిలిపాయి. అరవై ఏడేళ్ల వయసులో 2025 ఆగస్టు 11న తుది ఊపిరి ఆగేవరకు ఆ పిడికిలి బిగి సడలలేదు. ధిక్కారం మొక్క పోలేదు. కవిత్వం శాశ్వత చిరునామాగా అవి నిరంతర స్ఫూర్తిదాయక శక్తులై భాసిస్తాయి.

కార్మికులు, కర్షకులు, విప్లవవీరులు, శ్రామిక స్త్రీలు అందరూ ఆమె కవితలలో సందడి సందడిగా కనబడతారు. జన్మభూమి పథకాలు, విప్లవవీరుల తలలకు వెలకట్టే విధానాలు, మహిళా సాధికారత లోని మాయ, స్త్రీలపై అనుక్షణం జరిగే అత్యాచారాలు, ఇంటి పని వంటి అనేక సమస్యలను సహానుభూతితో కవిత్వం చేసింది. శ్రామిక బహుజన స్త్రీ సమస్యలను సంబోధించటం, చదువుకున్న మధ్యతరగతి భాషను వదిలి శ్రామిక జన వ్యవహార భాషలో యాసలో కవిత్వాన్ని రాయటం రజిత ప్రత్యేకతలు.

రజిత ఉద్యమ కవిత్వం ప్రధానంగా స్త్రీ సమస్యను, దళిత సమస్యను, తెలంగాణ అస్తిత్వ ఆరాట ఆత్మగౌరవ ఆకాంక్షలను చుట్టుకొని కనిపిస్తుంది. అంతర్జాతీయ మహిళా దశాబ్ది చైతన్య స్ఫూర్తితో 1984లో ప్రచురించిన 'గులాబీలు జ్వలిస్తున్నాయి' సంపుటిలో గులాబీ సౌందర్య సౌకుమార మాధుర్యాలతో, నలిగి పడ్డ అత్తరు త్యాగాలతో ఉపశమింపబడే ఆడవాళ్ళను అంతరంగ వేదన నుండి 'జ్వలించే గులాబీలు' అని పునర్నిర్వచించింది రజిత. వరకట్నపు ఆత్మహత్యలు హత్యలు, అత్యాచారాలు నిత్యకృత్యం అయిన ఈ మూడు దశాబ్దాల స్త్రీల దుఃఖపు జీర రజిత కవిత్వంలో వినబడుతుంది. 2012 డిసెంబర్‌లో ఢిల్లీలో జ్యోతి సింగ్‌పై జరిగిన అత్యాచార ఘటన సందర్భం నుండి 'అవును మౌనాన్నే మాట్లాడుతున్నాను' కవిత రాసింది. "నిత్య గాయాల జ్యోతిలా మండుతూ/ ఉద్యమ భాషనై మాట్లాడుతున్నాను" అనే కవితా పాదాలు రెండు ఆమె తననుతాను ఉద్యమప్రతినిధిగా నిలబడి మాట్లాడటాన్ని సూచిస్తాయి. రుద్రమ ప్రచురణల పక్షాన అత్యాచారాలపై వరంగల్ కవుల నిరసన కవిత్వాన్ని సేకరించి 'ఉద్విగ్న'ను ప్రచురించింది.

1985 కారంచేడు ఘటన పరిణామంలో తెలుగు నాట దళిత అస్తిత్వ ఉద్యమంగా బలపడింది. 'నేనొక నల్ల మబ్బునవుతా'నంటూ దానితో మమేకతను కవితా ముఖంగా ప్రకటించింది రజిత. నలుపును దళిత సంకేతం చేసి 'నలుపిప్పుడు కొట్లాడి బాధితుల చేతుల ఆయుధమై', నిరసన ప్రకటిస్తున్న వర్తమాన వాస్తవాన్ని చెబుతూ–

"ఈ నల్లమనుషులే/ కాకిగోలతో మీరు నటించే గాఢనిద్ర నుండి/ లేవగొట్టే దండోరాలవుతారు" – అంటూ 'నలుపంటే భయమెందుకు' కవితలో అగ్రవర్ణ అహంకారాన్ని సవాల్ చేసింది.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలంగాణ గుణగానం, తెలంగాణ సంస్కృతీ సంకీర్తనం, తెలంగాణలోని విశిష్టవ్యక్తుల ప్రశంస, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ఘటనలు రజిత కవిత్వానికి వస్తువైనాయి. అయితే కవితలను ఈ పద్ధతిలో వర్గీకరించి చెప్పటం కూడా కష్టమే. తరచూ అవన్నీ ఒక కవితలోనే కలగలిసి ఉంటాయి. 'జీవగడ్డగచేయ', 'పాట పుట్టిన ఊరు ఉయ్యాలో', 'పాట పూచిన' వంటి కవితలలో ఇది చూడవచ్చు. మొదటి కవితలో తెలంగాణ భాష ప్రశస్తి, కాకతీయచరిత్ర వైభవం, ప్రాచీన తెలంగాణ కవుల ప్రశస్తి, విప్లవోద్యమ ప్రస్తావన, తెలంగాణ ఉద్యమానికి చాళ్ళు దీసిన జయశంకర్ జనార్దన్, రాములు వంటి వాళ్ళ ప్రశంస, బతుకమ్మ పండుగ ప్రత్యేకత వంటివి కలగలిసి ఉన్నాయి. 'తల్లీ తెలంగాణమా', 'తెలంగాణ మార్చ్', 'నరుడా వినరా', 'అబ్బబ్బో సర్కారోడా' వంటి కవితలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వలస విముక్తి ఆశయాన్ని పదే పదే నొక్కి చెప్పాయి. ప్రధానంగా ఇవి 2009 డిసెంబర్ 9న రాష్ట్రం ఇవ్వటానికి అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన సూత్రప్రాయ ప్రకటన ఉపసంహరింపబడిన తరువాత ఉధృతమైన మలిదశ ఉద్యమకాలానికి చెందినవి. 'అబ్బబ్బో సర్కారోడా' కవిత ఇచ్చినమాట తప్పిన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహప్రకటన కాగా, ప్రత్యేక తెలంగాణా ఆకాంక్షకున్న ప్రజాబలం ప్రదర్శించటానికి 2011 మార్చ్ 10 న జరిగిన సాగరహార దృశ్యాన్ని కళ్ళ ముందు ఆవిష్కరింప చేసే కవిత 'తెలంగాణ మార్చ్'.

తెలంగాణ ఉద్యమం, మహిళా సమస్యలు, కులపోరాటాలు, ప్రపంచీకరణ ఫలితాల వంటి అనేక ఘనమైన అనుభవాలను దాటి వచ్చాక కవి రజిత మనసు పాత జ్ఞాపకాల్లోకి తొంగి చూసింది. కాలం కాన్వాస్ మీద తను పుట్టిన ఊరుని కన్న తండ్రి, వసివాడని మనుషులు, గాయపడిన పాటలు, అమలిన గీతాలతో చిత్రించింది. 2023 లో వచ్చిన రజిత ఆఖరి కవితా సంపుటి 'కాలం కాన్వాస్ మీద' ఆమె అంతర్గాన కవితా లోలత్వంతో నిండిపోయింది: "ఊరంటే ఉట్టి మట్టి కాదు/ మట్టీ! మనిషీ! ఉత్పత్తి!/ ఊరంటే జనజీవన తంత్రం!/ సూర్యునితో కలెదిర్గే శ్రమ యంత్రం!" అని 'ఊరు బంధం' కవితలో అంటుంది. మనిషిని మనిషి పట్టించుకునే ఆరాటాలు తగ్గిన చోట ఊరు అటువంటి మానవీయ స్నేహాలను నిలిపి ఉంచుతుందని నమ్మింది రజిత. అందుకే జ్ఞాపకాల పల్లెలో తన బాల్యపు ఉనికికి చోటు లేకపోవడం గురించి వేదన పడుతుంది. అది సహజమూ, పరిణామ క్రమంలో భాగమూ అని తెలిసినా సరే ఆ మనాది ఆమెని నిలువనియ్యలేదు: "నా పల్లె జాడ ఏడనో జెప్పుండ్రని/ నోరా ర్సుకుపోంగ అడుగుతాంది/ కాలుగాలి కాటుగల్సిన పిల్లోలె గాయిరిగాయిరిగా తిరుగుతాంది" అంటూ ఇప్పటి ఊర్లలో తనకి కనిపించని గుండె తడిని తల్చుకుని బుగులు పడుతుంది. 'మా నాన్నే విశాల ప్రపంచం', 'మా నాయిన విశ్వమానవుడు' వంటి కవితల్లో తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన తండ్రిని పదేపదే తల్చుకుంది రజిత. స్వేచ్ఛ, మానవ సంస్కారం, ప్రజాస్వామికత మొత్తంగా సమాజ సూత్రాలని పరిచయం చేసి స్వేచ్ఛా విహంగంలా తనను వినీలాకాశంలోకి ఎగురవేసిన 'నాయిన' ఆమె జీవితంలోనే కాదు, కవిత్వంలోనూ కథా నాయకుడే.

సామాజికంలోనూ వ్యక్తిగతంలోనూ రజితకి కవిత్వం ఊరట అయింది, ఓదార్పు అయింది. తన లోపల నిరంతరం జాజ్వల్యమానంగా రగిలే భావోద్వేగాలకి బాసట అయింది. ఆ జ్వాలాముఖి స్వరం శాశ్వతంగా మూగబోయింది, తను పంచిన కవితలను గుర్తులుగా వదిలి.

■ కాత్యాయనీ విద్మహే
■ కె ఎన్ మల్లీశ్వరి

దళిత కవితా సంపుటుల పరిచయం

దళిత రచయితల వేదిక, ఆంధ్ర ప్రదేశ్ – కవి సంధ్య, హైదరాబాద్ – భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో చల్లపల్లి స్వరూప రాణి 'అల్లిక', కోయి కోటేశ్వర రావు 'నాగస్వరం', తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్ 'పోరాట పద్యం' – ఈ మూడు దళిత కవితా సంపుటాల పరిచయ సభ ఆగస్టు 24 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ సభలో విమల, దార్ల వెంకటేశ్వరరావు, కదిరే కృష్ణ గ్రంథ పరిచయాలు చేస్తారు. చూపు కాత్యాయని, సంగిశెట్టి శ్రీనివాస్, జి.వి. రత్నాకర్‌లు ఆప్తవచనం పలుకుతారు. వివరాలకు: 98482 02526.

కవి సంధ్య

మంజీర పుస్తకావిష్కరణ సభ

విప్లవ కవి మంజీర రచనలు, జ్ఞాపకాలతో విరసం ప్రచురించిన 'వివా కామ్రేడ్ రవి' పుస్తకావిష్కరణ సభ ఆగస్టు 24 ఉ.10గం.లకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరుగుతుంది. సభలో పుస్తకాన్ని ఆవిష్కరించి పాణి, తాయమ్మ కరుణ, నల్లూరి రుక్మిణి, చిలకా చంద్ర శేఖర్, కేఎస్‌పీఎస్ కృష్ణ, వై వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడతారు.

రివేరా

అద్దేపల్లి సాహిత్య పురస్కారం

అద్దేపల్లి రామ మోహనరావు సాహిత్య పురస్కారాన్ని 2025కు గాను కవి, విమర్శకుడు, వక్త రెంటాల శ్రీ వేంకటేశ్వర రావుకు ప్రదానం చేస్తున్నాము. పురస్కార ప్రదాన సభ అద్దేపల్లి రామ మోహనరావు జన్మదిన మాసం సెప్టెంబర్ 7న కాకినాడలో జరుగుతుంది.

అద్దేపల్లి ఉదయభాస్కరరావు

సోమవారం 18 ఆగస్టు 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్



"రచన ప్రశ్నతో మొదలవ్వాలి"

– జయమోహన్

తమిళ రచయిత జయమోహన్ గారిని బుక్ బ్రహ్మ లిటరరీ ఫెస్టివల్‌లో చూసినప్పుడు ఒక సీనియర్ రచయిత లాంటి వేషభాషలు ఏం కనిపించలేదు. ఒక నార్మల్ సీనియర్ పర్సన్ లాగే అనిపించారు. నార్మల్ సీనియర్ పర్సన్స్‌కి కొన్ని కచ్చితమైన అభిప్రాయాలు ఉంటాయి, కొన్ని భేషజాలు ఉంటాయి, ముఖ్యంగా కొత్త తరం పట్ల ఒక చిన్నచూపు ఉంటుంది. కానీ, జయమోహన్ నా ఊహలు అన్నింటినీ తారుమారు చేశారు. సింపుల్, ఫ్రెండ్లీ, సులభంగా మాట కలపగలిగే వ్యక్తి.

మూడో రోజు ఉత్సవం ముగిశాక అందరూ వీడ్కోళ్లు చెప్పుకొని వెళ్ళిపోతుంటే, నాకు ఈ ఉత్సవం నుంచి ఒక పరిపూర్తి కావాలనిపించింది. ఆయనతో, ఇలా గుంపులో నిల్చొని కాకుండా, ఒక ముఖాముఖి చర్చ చెయ్యాలనిపించింది. ఆయన్ని అడగ్గానే చాలా మామూలుగా 'ఒకే ష్యూర్' అన్నారు. రాత్రి సెంట్రల్ యూనివర్సిటీ తమ్ముళ్ళు లిఖిత్, హర్ష, ఝాన్సీ పబ్లికేషన్స్ శ్రీదివ్యలను వెంటేసుకుని, లైట్లు ఆర్పేసిన కారిడార్‌లో ఫోన్ టార్చ్ ఆన్ చేసుకొని ఆయన గదికి చేరుకున్నాను. తలుపు తీయగానే ఎదురుగా టేబుల్ ముందు కూర్చుని జయమోహన్ నవ్వుతూ కనిపించారు. దండం పెట్టి ఎదురుగా ఉన్న మంచం మీద కూర్చున్నాను. మేమంతా సెటిల్ అయ్యాక జయమోహన్ మాట్లాడం మొదలైంది.

ముందుగా, తెలుగు సాహిత్యంతో మీకు ఉన్న పరిచయం ఏంటి?

తెలుగులో నాకు బాగా నచ్చిన నవల అల్పజీవి. విశ్వనాథ శాస్త్రి (రావి శాస్త్రి) గారి ఆ నవల ఎంతో గొప్ప రచన. నేను వివిధ భారతీయ భాషలలో వచ్చిన నవలల్ని పరిచయం చేస్తూ తెలుగు నుంచి 'అల్పజీవి' నవలని పరిచయం చేశాను. అలాగే నాకు చలం రచనలు కూడా ఇష్టం. దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి కవిత్వం నాకు ఎంతో ఇష్టం.

అసలు మీరు ఎందుకు రాస్తారు? డబ్బు, పేరు, కీర్తి ఇలాంటి వాటి కోసమా లేక ఒక కథ చెప్పాలనే, లేదా మీ లోపల ఉన్నదాన్ని వ్యక్తపరచాలనే ఓ బలమైన కోరిక వల్లనా?

ఇండియాలో రచయితగా మీరు బతకలేరు. రచన ఒక ఉద్యోగంగా అయ్యే పరిస్థితి లేదు. నేను ఇరవై ఏళ్ళు ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం చేసి, నాకు సినిమాల్లో అవకాశాలు రావడం మొదలయ్యాక నేను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను.

ఇంత సుదీర్ఘకాలం రచయితగా కొనసాగడం, ఇంత విస్తృతంగా రాయడం ఎలా సాధ్యం అయింది? (ఆయన పేరు మీద మూడు వందల పైనే పుస్తకాలు ఉన్నాయి!)

ఎవరైనా రచయిత ఎక్కువ కాలం రచయితగా కొనసాగాలంటే ఆరోగ్యకరమైన శరీరం ఉండడం ముఖ్యం. నేను నా శరీరాన్ని చాలా బాగా మెయింటైన్ చేస్తాను. ఆహారపు అలవాట్లు, నిద్రా, కాలకృత్యాలు అన్నీ పెర్ఫెక్ట్‌గా ఉంటాయి. నాకు ఇప్పుడు 63ఏళ్ళు. ఏ ఆరోగ్య సమస్యలూ లేవు. నేను అలోపతి మందులు కూడా అంత త్వరగా తీసుకోను, మత్తు కలిగించే ఎలాంటి మాదక ద్రవ్యాలూ ఎప్పుడూ తీసుకోలేదు. రచయితకి తన శరీరం పట్ల శ్రద్ధ ఉండాలి.



> "వేరే జీవితో మనకు, 'తానే నేను' అన్నంతగా సహానుభూతి కలిగినప్పుడే మనం రాయగలం. ఇది ఒక నేపథ్యం కలిగిన వ్యక్తి మరొక నేపథ్యం గురించి రాసేటప్పుడూ ఉండాలి, ఒక వ్యక్తి మరొక వ్యక్తి గురించి రాసేటప్పుడూ ఉండాలి. తమిళంలో వెల్లలార్ అనే కవి అంటాడు, "నీళ్ళు లేక ఎండిపోయిన మొక్కను చూస్తే, నా మనసుకి ఎంతో కష్టంగా ఉంటుంది" అని. ఒక మొక్కతో కూడా మనల్ని మనం ఎంపతైజ్ చేసుకోగలిగినప్పుడు, వేరే నేపథ్యం కలిగిన వ్యక్తులతో ఎందుకు చేసుకోలేం?"

మీరు ఒక రచనని ఏదైనా ఒక విషయం చెప్పాలనుకుని మొదలుపెడతారా? లేక ఏదైనా ఒక విషయం తెలిసినప్పుడు ఇది మంచి రచన అవుతుందని మొదలుపెడతారా?

రచన ఎప్పుడూ idea (ideology అనే మాటని ఆయన idea అన్నారు)తో మొదలు అవకూడదు. నీకు ఆల్రెడీ తెలిసిందాన్ని నిరూపించడం కోసం అన్నట్టుగా రచన చెయ్యకూడదు. రచన ప్రశ్నతో మొదలు అవ్వాలి. ఇప్పుడు తెలుగులో వచ్చిన 'తెల్ల ఏనుగు' నవలే తీసుకుంటే, అది ఒక ప్రశ్నతో మొదలైంది? ఈ దేశంలో దళితులు తెల్లవాళ్ళ పాలనను సపోర్ట్ చేశారు. ఎందుకంటే, దేశీయ రాజసంస్థానాలతో పోల్చుకుంటే, బ్రిటిష్ పాలనలో వాళ్ళకి గౌరవప్రదమైన జీవితం దొరికింది. కానీ అదే తెల్లవాడు కొన్ని కోట్లమంది చనిపోయే కరువుకు కారణం అయ్యాడు. ఆ కరువులో కళ్ల ముందు అన్ని వేల మంది చనిపోతూ ఉంటే ఏ చదువుకున్న బ్రాహ్మడూ దాని గురించి రాయలేదు. వీటన్నింటికి కారణం ఏంటి అనే ప్రశ్నతో ఈ నవల మొదలైంది. నవల చివరిలో నాకు దొరికిన సమాధానం ఎలాంటిదైనా కావొచ్చు. కానీ, ఆ సమాధానాన్ని అన్వేషిస్తూనే నా రచన నడుస్తుంది.

ప్రస్తుతం తెలుగులో అస్తిత్వ వాద ఉద్యమాలు బలంగా ఉన్నాయి. ఎంతోమంది వివిధ నేపథ్యాల నుంచి వచ్చి రచనలు చేస్తున్నారు. ఒక వాదన ఏంటంటే– ఎవరి గురించి వాళ్లే రాసుకోవాలని, వేరే వాళ్ళు రాయడం అన్నది సరైనది కాదని. దాని గురించి మీరేం అంటారు?

ఎవరి గురించి వాళ్ళు రాసుకోవడం మంచిదే. కాకపోతే మనం మనుషులు గానే ఎంతో వైవిధ్యం ఉన్న వాళ్ళం. మన పక్కనున్న వ్యక్తి గురించే మనకు తెలీదు. అలాంటప్పుడు వేరే వాళ్ళ గురించి నేను ఎలా రాయగలను? నేను రాసింది అంతా నా ఊహే అవుతుంది, లేదా నా అవగాహన అవుతుంది. ఇప్పటిదాకా వచ్చిన రచనలు అన్నీ అలా వచ్చినవే. ఇక్కడ మనం గుర్తుపెట్టుకోవాల్సింది– మనకు తెలీని దాని గురించి రాస్తున్నప్పుడు మనకు ఉండాల్సింది అవగాహన మాత్రమే కాదు empathy కూడా. వేరే జీవితో మనకు, 'తానే నేను' అన్నంతగా సహానుభూతి కలిగినప్పుడే మనం రాయగలం. ఇది ఒక నేపథ్యం కలిగిన వ్యక్తి మరొక నేపథ్యం గురించి రాసేటప్పుడూ ఉండాలి, ఒక వ్యక్తి మరొక వ్యక్తి గురించి రాసేటప్పుడూ ఉండాలి. తమిళంలో వెల్లలార్ అనే కవి అంటాడు "నీళ్ళు లేక ఎండిపోయిన మొక్కను చూస్తే, నా మనసుకి ఎంతో కష్టంగా ఉంటుంది" అని. ఒక మొక్కతో కూడా మనల్ని మనం ఎంపతైజ్ చేసుకోగలిగినప్పుడు, వేరే నేపథ్యం కలిగిన వ్యక్తులతో ఎందుకు చేసుకోలేం?

క్రాఫ్ట్ గురించి మాట్లాడదాం, మీరు ఒక కల్పనని విస్తృతం చేసి, ఒక పెద్ద నవలగా రాయడం కోసం ఎలాంటి పద్ధతిని పాటిస్తారు?

బహుశా ప్రపంచంలో అతిపెద్ద నవల నేనే రాసానేమో. 'వెన్మురసు' (మహాభారతం కథ) ఇరవై నాలుగు వేల పేజీల నవల. వెయ్యి పేజీల నవలలు, ఐదు వందల పేజీల నవలలు కూడా ఓ పది దాకా రాసాను. నా దృష్టిలో కాల్పనిక రచయితకి సాహిత్య పఠనం చాలా ముఖ్యం. క్లాసిక్స్ అనే రచనల్ని 15 నుంచి 20 మధ్య వయసులోనే చదవాలని అంటాను. అప్పుడు అర్థం కాకపోవచ్చు. కానీ మనసులో ముద్రించుకుపోతాయి. నా కూతురు తన పదిహేనవ ఏట టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' చదివింది. పూర్తి అయిన తర్వాత అందులో ఓ ప్రధాన పాత్ర చనిపోయినందుకు ఏడ్చింది కూడా, తన ఏడుపు ఆపడం కోసం ఒక డ్రెస్ కొనివ్వాల్సి వచ్చింది. ఇప్పుడు తను చాలా మంచి రచయిత్రి అయింది. నా కొడుకు కూడా అంతే. విస్తృతమైన పఠనం మన ఊహాశక్తిని పెంచుతుంది. అలాగే మనం రాస్తున్న సబ్జెక్ట్ కోసం చేసే స్టడీ కూడా చాలా ముఖ్యం (ఇక్కడ ఆయన సోషియాలజీ, పొలిటికల్ ఎకానమీకి సంబంధించిన కొంత మంది రచయితల పేర్లు చెప్పారు). అలాగే నేను నా మనసులో ఎప్పుడూ కథల కోసం ధ్యానం చేస్తూ ఉంటాను. చటుక్కున ఒక మెరుపు మెరుస్తుంది. వెంటనే రాసేస్తాను.

రచనలో డెప్త్ అంటే ఏంటి? ఒక థ్రిల్లింగ్ రీడింగ్ అనుభవాన్ని ఇచ్చే పాపులర్ నవలకి, క్లాసిక్ నవలకి ఈ 'డెప్త్' విషయంలోనే తేడా చెప్తుంటారు.

'డెప్త్' అంటే ఒక రచనని అనేక కోణాల నుంచి తరచి చూడగలగడమే అంటాము. గొప్ప రచనలు అన్నింటిలోనూ ఈ లక్షణం ఉంటుంది. నేను ఇప్పటికి ఎన్నోసార్లు టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' చదివాను. చదివిన ప్రతిసారీ అందులో ఒక కొత్త కోణం కనిపిస్తుంది. పాపులర్ రచనల్లో ఆ లక్షణం ఉండదు. చదివినంతసేపు బాగుండొచ్చు గానీ చదివిన తర్వాత మర్చిపోతాం. ఒకసారి రైల్లో వెళ్తున్నప్పుడు మా అమ్మాయి ఒక పాపులర్ నవల చదివి, దిగివెళ్లిపోతున్నపుడు ఆ పుస్తకాన్ని సీట్ లోనే వదిలేసింది. "ఎందుకు?" అని అడిగితే, "షెల్ఫ్‌లో దాచుకునేంత గొప్ప పుస్తకం కాదులే నాన్న," అంది. ఇలా ఎన్నో విషయాలు మాట్లాడుతూ– చివరిలో ఓ రెండు ప్రశ్నలు అడిగాను.

రచనల్లో cliche లని ఎలా అవాయిడ్ చేయ్యాలి? నేను రాస్తున్న కథల్లో ఒకేలాంటి సందర్భాలు వస్తున్నాయి.

వాటిని నేను cliche లు అనను. అది పెద్ద తప్పేం కాదు. నువ్వు చెప్తున్న విషయం, కథ కొత్తదా కాదా అనేదే ముఖ్యం. కానీ కథలో మనం వాడే వ్యక్తీకరణాలు, ఉపమానాలను రిపీట్ చెయ్యకూడదు. వెన్మురసు నవలలో కొన్ని వేల ఉపమానాలను వాడాను, రిపీట్ చెయ్యకుండా.

రచనలో పాఠకులని రంజింప చెయ్యడం కోసం అన్నట్టుగా ఏమైనా చేస్తారా?

No. I write to amuse myself. ("నా ముచ్చట కోసం నేను రాస్తాను" అనే ఈ మాటతో ఆయన మనసు దోచుకున్నారు. నేనూ నమ్ముతాను.)

ఆయనతో మాటల్లో సమయం తెలీకుండానే గడిచి పోయింది. రాత్రి అంతా అలా ఆయన మాట్లాడుతుంటే వింటూనే ఉండాలని అనిపిస్తున్నా, అంత పెద్దాయనను ఇంక ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక ఓ పరవశం లాంటి భావనతో బయటికి వచ్చేశాను. వేలు ఖర్చుపెట్టి 'రైటింగ్ మాస్టర్‌క్లాస్' లకు అటెండ్ అయ్యేవాళ్ళు నాకు తెలుసు. ఇక్కడ నాకు అలాంటి మాస్టర్ క్లాస్ ఇలా ఊరికినే జరగడం ఆహా ఏమి నా భాగ్యం అనుకుంటూ గదికి వచ్చి నిద్రపోయాను.

ఇంటర్వ్యూ ■ ప్రసాద్ సూరి
✆ 91336 08072

కంచు మెట్టెలు

సద్దలు జొన్నలు
ఆకలి అల్లికల రొట్టెవోసి
దద్దింకాదిన్నని దంచుతున్న
కరైకుడి మణి మృదంగం
వలయపట్టి డోలు
కుందెన కుదుర్ల మీద రోకలి బల
అమ్మ చేతి మట్టి గాజుల గల గల

అలుకుపిడసతోని ఇడుపులలికి
కోడీకలతోనీ నీరు సున్నము ముగ్గు దిద్ద
డావిన్సీ రవివర్మలు ఎమ్మెఫ్ హుస్సేన్‌లు
దిడ్డి గోడల మీద ఈనెల జాజు పట్టెలు
చేయిదిర్గిన రెక్కల చేతాలం
అమ్మ మునివేళ్ళ కాంటెంపరరీ పంచపాళి

అంట్లు తోముతున్న ఆరోహణావరోహణల్లో
జాలారి బండమీద చెవులటికెల నట్టువాంగం
మిద్దె రాములు సుక్క సత్తయ్యలను
పొయిల బూడిదతోని పూతపూస్తున్న సార్కలు
పొడపోతుల గజ్జెల లాగులు
అమ్మ కంటె తుశ్శె నాగరాలు

పూసలెంకటమ్మ ఈత గుల్లల
చిట్యాల అంగట్ల ఆదాంబి సందుకలు
ఎరుకలి నాంచారి జెప్తున్న ఎరుక
ఇరవై తులాల మెరిసేటి సాలంకడాలు
అమ్మ నీ పాదాలు పసుపొంచుకున్న
పగిడికొండలు

ఇంట్లకు ఆకిట్లకు
మక్బూల్ సాబ్రీ కవ్వాలి
ఎం.ఎస్. సుబ్బులక్ష్మి మీటుతున్న తంబుర
అమ్మ గచ్చు జగిండ్ల మీద నడుస్తున్నప్పుడు
జన్న జన్నంటూ కాళ్ల వేళ్ల కొసల కంచు మెట్టెల
మాదిగ డప్పుల మాయామాళవగౌళం

■ విశ్వనాథుల పుష్పగిరి
✆ 96664 35426

తొలి పుస్తకం వచ్చాక చదవాలన్న కాంక్ష మరింత పెరిగింది!

చదువు ముచ్చట

తుల శ్రీనివాస్

నా 'చింతలతొవ్వ' కవిత్వం సంపుటి వచ్చిన తరువాత నాలో చదవాలన్న కాంక్ష మరింత పెరిగింది. అత్యధికంగా పేరు పొందిన పుస్తకాల్లో నిజంగా ఏముందో చదువాలన్న కుతూహలం పెరిగింది. సమాజ గతిని మలుపు తిప్పిన పుస్తకాలను కవి దృష్టితో పరిశీలిస్తున్నాను. లోకల్ లిటరేచర్ తోపాటు అనువాద నవలలు కవిత్వం కథ ఇలా ఏది అందుబాటులో ఉంటే అది చదువుతాను. ఇపుడు నెరుడా కవిత్వం, దాస్తొయెవ్‌స్కీ 'ఇడియట్' నవల చదువుతున్నాను. రాయడం సుఖాన్ని ఇస్తే చదవడం ఆనందాన్ని ఇస్తుంది. నాకు సుఖపడటం కంటే ఆనంద పడటమే ఇష్టం.

మీ సమకాలీనంగా కవిత్వపరంగా ప్రేరణ కలిగించే తోటికవులు?

ప్రేరణ కలిగించిన వారిలో మునాసు వెంకట్ గారితో మొదలుకుని కె. శివారెడ్డి, గోరటివెంకన్న, ఎన్. గోపి, ప్రసేన్, నలిమెల భాస్కర్, వంశీకృష్ణ, జూకంటి జగన్నాథం, బొమ్మలబాయి సిద్ధార్థ, కవి యాకూబ్ వంటి లబ్దప్రతిష్ఠులతో పాటు ఈ తరం కవులు మారాబత్తుల పెద్దన్న, మెట్టా నాగేశ్వరరావుల కవిత్వాన్ని, సాగర్ల సత్తయ్య కథలను ఎక్కువగా చదువుతాను. విభిన్నమైన ఈ రచయితల రచనారీతుల్ని ఆస్వాదిస్తాను.



రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

శేషేంద్ర 'ఆధునిక మహాభారతం' చదివి ఆయన కవితా నిర్వహణ నైపుణ్యానికి అబ్బురపడ్డాను. నిజానికి అదొక కళాఖండం. చక్కటి భావ చిత్రాలు, ఇమేజరీలు, వాక్యాన్ని కవిత్వం చేసిన తీరు, అలంకారాల ప్రయోగం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కవిగా నేనేమి చేయాలో, రాయాల్సిన వాక్యం ఎలా ఉండాలో ఆయన కవిత్వం నాకు గుర్తుజేసింది. ఈ సంపుటిలో సంవేదనలు నా రక్తంలోకి చేరాయి. సమాజాన్ని ఇంత డీప్ సీక్ చేసి చూసాడా అనిపించింది!

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవడం గుర్తుంది?

పీజీలో నా మిత్రుడొకడు చలం 'మైదానం' బహుమతిగా ఇచ్చాడు. మైదానాన్ని చదవడం వల్ల నా భావనా ప్రపంచం ఎక్స్‌పాండ్ అయింది. నెరెటివ్‌లో అంత థిక్‌గా ఎలా రాశాడా అనిపించేది. సంప్రదాయ జీవినైన నాకు సరికొత్త నేత్రాలని చ్చింది మైదానమే.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

మీరు ఎక్కువసార్లు చదువుకున్న కవిత్వ సంపుటి?

'మహాప్రస్థానం'. నా అభ్యుదయ భావాన్ని శ్రీశ్రీ మరింత విస్తృతపరిచాడు. శ్రీశ్రీ శబ్దవేగం హృదయానికి వ్యాయామం. పదాల్లోని గతి శక్తి ప్రకంపనలు సృష్టిస్తుంది. ఆ అభ్యుదయావేశం, శబ్ద కవిత్వ ఝరి మహాప్రస్థానాన్ని నన్ను మళ్లీ మళ్లీ చదివించింది.

కవిత్వ రచనలో మీకు ఉపయోగపడిన సలహా?

ఏ సలహా లేకుండానే తొలిసంపుటి 'చింతలతొవ్వ' అచ్చేసి, సద్విమర్శకులు ప్రశంసలు అందుకున్నాను. అయితే రెండో సంపుటికి వచ్చిన చాలా సలహాల నడుమ నాకు ఉపయోగపడిందని అనుకున్న సలహా– పొయెటిక్ టెక్నిక్ గురించి. దాన్ని అనుసరించి కేవలం నెరేటివ్ మీదనే డిపెండ్ అవ్వకుండా శిల్ప చతురతతో కవితలు అల్లిన విధానం నా రెండో సంపుటిలో చూడొచ్చు.

(తుల శ్రీనివాస్ తొలి కవిత్వ సంపుటి 'చింతల తొవ్వ' 2023లో పబ్లిష్ అయ్యింది.)

✆ 99485 25853



వర్ధన్నపేట మండలంలోని బండౌతపురం గ్రామంలో తెగిపోయిన కట్టుకాలువ మత్తడి




గతంలో కొట్టుకుపోయిన కట్టు కాలువపై వేసిన పైపులు

అంతా మాయ!

చెరువులు, కట్టుకాలువ, చెక్‌డ్యామ్ పనుల్లో అవినీతి

- వర్షాకాలం వచ్చిందంటే కోతలు పడుతున్న మత్తళ్లు
- బండౌతపురంలో ఇటీవల మళ్లీ తెగిన కట్టుకాలువ మత్తడి
- పనుల్లో డొల్లతనం ఉందని స్థానికుల మండిపాటు
- కోనాయిచలం కట్టుకాలువపై డబ్బులు వెనకేసిందెవరు?

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మండలంలో ఇరిగేషన్ అధికారుల పనితీరుపై కొన్నేళ్లుగా ఎన్నో ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లకు వెన్నుదన్నుగా ఉంటూ, ఉన్నతాధికారులను సైతం శాసించే స్థాయిలో మాయ చేయడంలో దిట్ట అనే ప్రచారం ఉంది. మండలంలోని బండౌతపురం గ్రామంలో ఇటీవల కట్టు కాలువ మత్తడి మళ్లీ తెగడంపై ఈ అధికారి పనితీరును ఎండగడుతూ పలువురు విమర్శలు చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.



వర్ధన్నపేటలో ఉన్న కోనారెడ్డి చెరువును నింపేందుకు ఎన్నో ఏండ్ల కిందట జఫర్‌గఢ్ మండలంలోని కోనాయిచలం నుంచి వర్ధన్నపేట వరకు దాదాపు 11 కిలో మీటర్ల మేర కట్టుకాలువను తవ్వారు. ఆకేరు వాగులో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కోనాయిచలం వద్ద ఉన్న ఫీడర్ ఛానల్ షెట్టర్లను ఓపెన్ చేసి నీటిని కోనారెడ్డి చెరువులోకి మళ్లించేవారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కట్టుకాలువ చుట్టు పక్కల ఉన్న పంట పొలాలు సైతం ఇప్పటికి నీటిలో మునిగిపోతూనే ఉన్నాయి. శాశ్వత పరిష్కారాలు చేయకుండా కంటి తుడుపు చర్యగా పనులు చేస్తూ బిల్లులు తీసుకుంటున్న సదరు వ్యక్తులకు ఇరిగేషన్ శాఖ అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతేడాది వర్షాల ధాటికి బండౌతపురంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మత్తడి బస్తాలు మరోసారి కొట్టుకుపోయాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సొంత నిధులతో మళ్లీ తాత్కాలిక మరమ్మతు పనులు చేశారని ఏఈ అమర్‌నాథ్ స్పష్టం చేశారు.

పనుల్లో డొల్లతనం

వర్ధన్నపేట మండలవ్యాప్తంగా జరుగుతున్న చెరువుల మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు, కట్టు కాలువ పునరుద్ధరణ పనుల్లో డొల్లతనం కనిపిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలం వచ్చినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు వీటిపై దృష్టి సారిస్తున్నారని, మిగతా సమయాల్లో పట్టించుకోవడంలేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కోనారెడ్డి చెరువు కట్టకు రూ.2కోట్లతో తూముల మరమ్మతులు చేసిన మరో ఏడాదికే 2020లో చెరువుకు భారీ గండిపడింది. రింగు బండ్ పేరిట మరిన్ని నిధులు తీసుకొచ్చి చేస్తే వాటిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. తదనంతరం దాదాపు రూ.13కోట్లతో కోనారెడ్డి చెరువుకు శాశ్వత మరమ్మతు పనులు చేసినా వాటిపై ఫిర్యాదులు అందాయి. విజిలెన్స్ విచారణ పేరిట సైతం చాలా కాలం పాటు చెరువు పనులు కాకుండా చేశారని అపవాదు మూటగట్టుకున్నారు. ఆకేరు వాగుపై ఏర్పాటు చేసిన చెక్‌డ్యామ్‌ల పనుల్లో సైతం అవినీతి జరిగిందని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. నాసిరకం పనులు చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపణలు, ఫిర్యాదులు చేయడమే తప్ప వాటిపై పూర్తిస్థాయి విచారణ ఇప్పటికీ లేకపోవడం గమనార్హం.

అవినీతి జరిగిందా?

వర్ధన్నపేట కోనారెడ్డి చెరువుల పనుల్లో గత ప్రభుత్వాలు అవినీతి పాల్పడ్డాయని ఇప్పటి ప్రభుత్వం, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ విచారణ ఎక్కడుందో ఇప్పటికీ ఎవరికీ స్పష్టత లేదు. 2019కు ముందు దాదాపు రూ.2కోట్లకుపైగా నిధులు వెచ్చించి తూము మరమ్మతులతో పాటు మండలంలోని బండౌతపురం గ్రామంలో కట్టుకాలువకు మత్తడిని ఏర్పాటు చేశారు. వీటి పనులన్నీ ఆ నిధుల్లోనే చేశారని ఏఈ అమర్‌నాథ్ స్పష్టం చేస్తున్నారు. తదనంతరం ఇప్పటివరకు కట్టు కాలువకు ఎలాంటి డబ్బులు వెచ్చించలేదని చెబుతున్నారు. కట్టుకాలువను దాటి వ్యవసాయ పొలాలకు రైతులు వెళ్లేందుకు రెండు భారీ పైపులు వేసి, దాదాపు 50 మీటర్ల వరకు కాంక్రీటుతో మత్తడిని ఏర్పాటు చేశారు. కానీ ఏడాది దాటగానే వరద ఉధృతికి ఆ పైపులు, కొంత మేర మత్తడి తెగిపోయింది. దీంతో మళ్లీ వరద వచ్చినప్పుడల్లా చుట్టుపక్కల రైతుల పొలాలు మునిగిపోయి, భూమి కోతకు గురవుతూనే ఉంది. ఖాళీ సంచుల్లో ఇసుక నింపి బస్తాలు వేయడం వర్షాకాలం పూర్తికాగానే శాశ్వత పనులను మరిచిపోవడం అధికారులకు షరామామూలుగా మారింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించామని, అంచనాలు వేసి పంపించామని చెప్పడం ఇరిగేషన్ అధికారులకు పరిపాటిగా మారింది. చేసిన తాత్కాలిక మరమ్మతు పనుల్లో సైతం పారదర్శకత లేకపోవడంతో ఏడాదికోసారి కాలువకు గండ్లు పడుతూనే ఉన్నాయి.

డబ్బులు వెనకేసిందెవరు..?

కోనాయిచలం నుంచి వర్ధన్నపేట వరకు ఉన్న కట్టుకాలువకు రెండేళ్ల కిందట ఈజీఎస్ నిధుల నుంచి పూడికతీత తీసినట్లుగా ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగేశ్వర్ తెలిపారు. ప్రభుత్వం రూ.8లక్షలు కేటాయించగా, కిలో మీటరు వరకు పనులు చేసి రూ.2లక్షల వరకు వెచ్చించినట్లు స్పష్టంచేశారు. గతేడాది ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాలతో సొంత నిధుల పేరిట స్థానిక మాజీ జడ్పీటీసీ రెండు హిటాచీల సహాయంతో 11కిలోమీటర్ల జంగిల్ కటింగ్ చేసి, బండౌతపురం మత్తడిని మరమ్మతు చేశారు. ఇలా కట్టుకాలువకు మరమ్మతులు చేస్తున్న జాబితా ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు అధికారికంగా పనులు జరగలేదని, నిధులు ఇవ్వలేదని చెప్పడంలో ఆంతర్యం తెలియడం లేదు. చేసిన పనులు నాసిరకంగా ఉండడంతో తెగిపోయిన కట్టలకు, కొట్టుకుపోయిన పైపులకు బాధ్యత ఎవరు వహిస్తారో చెప్పడం లేదు. అసలు కట్టుకాలువ పేరిట డబ్బులు వెనకేసిందెవరో.? అంతా మాయగా ఉందని ఆరోపణలు వస్తున్నాయి.

'గెరిల్లా' వీరుడు.. ధిక్కార సూర్యుడు..



- మొఘలాయిలను గడగడలాడించిన సర్వాయి పాపన్న
- మూడున్నర శతాబ్దాల కిందటే గొరిల్లా సైన్యం ఏర్పాటు
- బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాటం
- శత్రు దుర్భేద్యంగా రాతికోట నిర్మాణం
- ఖిలాషాపూర్‌లో చరిత్ర సాక్ష్యంగా నిలిచిన కోట
- పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమవుతున్న కోట, బురుజులు
- పర్యాటకంగా తీర్చిదిద్దాలంటున్న ప్రజలు
- నేడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

7

'బొగత'లో గందరగోళం



బొగత జలపాతం వద్ద సందర్శకులు

- పెద్ద ఎత్తున తరలివచ్చిన పర్యాటకులు
- అనుమతి లేదన్న అటవీశాఖాధికారులు
- వ్యయప్రయాసలకోర్చి వచ్చామని వాగ్వాదం
- ఎస్సై జోక్యంతో ప్రత్యేక అనుమతి

6

మత సామరస్యం, ఐక్యతకు చిహ్నం



- కాజీపేట అఫ్జల్ బియాబాని దర్గా
- ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు
- ఏటా ఘనంగా దర్గా ఉర్సు
- ఈ నెల 21 నుంచి మొదలు
- ముస్తాబవుతున్న దర్గా

7



మాట్లాడుతున్న జస్టిస్ సామ్ కోషి

ప్రపంచీకరణ అయిన మధ్యవర్తిత్వం

- వివాదాల పరిష్కారానికి ఐచ్ఛిక ప్రక్రియ
- కోర్టుల భారాన్ని తగ్గిస్తోంది..
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషి
- మధ్యవర్తిత్వంలో 40 గంటల శిక్షణ కార్యక్రమం

7

వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి

- నగరం మునగకుండా సమన్వయంతో పని చేయాలి
- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక
- భద్రకాళి బండ్, చిన్నవడ్డెపల్లి చెరువు, ఐసీసీసీ కేంద్రాల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం ముంపునకు గురికాకుండా ప్రణాళిక ప్రకారం శాశ్వత చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక అన్నారు. ఆదివారం వరంగల్ మునిసిపల్ కమిషన్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నగరంలో భద్రకాళి బండ్, చిన్నవడ్డెపల్లి చెరువు, బల్దియా కార్యాలయంలోని ఐసీసీసీ సెంటర్‌వద్ద పర్యటించి పరిశీలించారు. వరద ముంపును ఎదుర్కొనేందుకు అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలైన ఎన్‌టీఆర్ నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ, 12 మోరీల ప్రాంతాల వద్ద నిత్యం ఎదురయ్యే సమస్యపై అధ్యయం చేశారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ.. నగరంలో వరదనీరు అంచనాలకు మించితే వివిధ విభాగాలు సమన్వయంలో పని చేయాలన్నారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముందుకు గురి కాకుండా ఉండేందుకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సామర్థ్యం ఎంత ఉందని ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్ట్రీం లైన్ చేసుకోవాలన్నారు. గ్రీన్ ఏరియాలోకి నీరు చేరడంతో పాటు లోతట్టు ప్రాంతాలకు వరద ప్రభావం రాకుండా చూడాలన్నారు. చిన్నవడ్డెపల్లి చెరువు, కట్టమల్లన్న చెరువులో నీరు చేరే క్రమంలో లోతట్టు ప్రాంతాల్లో స్ట్రీం వాటర్ వెళ్లడానికి అవకాశం లేక పోవడంతో వరద ముంపు వాటిల్లుతోందన్నారు.



భద్రకాళి బండ్ వద్ద పరిశీలిస్తున్న శశాంక, కమిషనర్

అనంతరం మునిసిపల్ కార్యాలయంలోని ఐసీసీసీ సెంటర్‌లో పర్యటించి అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నగరంలోని ప్రతీ చెరువు, పలు కాలనీలు ఐసీసీసీకి అనుసంధానం చేయడం వల్ల ప్రతీ క్షణం అక్కడ ఎం జరుగుతుందో వెంటనే తెలుసుకోవచ్చని అన్నారు. ఇంకా నగరంలో ట్రాఫిక్ నియంత్రణ ఇక్కడి నుంచి మానిటరింగ్ చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ రవికుమార్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.



వడ్డెపల్లిలో జరిగిన పోచమ్మ బోనాల వేడుకల్లో నృత్యం చేస్తున్న వినయ్‌భాస్కర్ కుటుంబసభ్యులు

బోనాల సంబురం

గ్రామాలు, పట్టణాల్లో పోచమ్మ బోనాల సందడి 8

సైబర్ నేరగాళ్ల వలలో గృహిణి

● బ్యాంకు ఖాతా నుంచి రూ. 90వేలు మాయం
● మానుకోట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల వలలో ఓ గృహిణి పడి బ్యాంకు ఖాతా నుంచి రూ. 90 వేలు లూటీ చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన గృహిణి సెల్‌ఫోన్ వాట్సప్ ద్వారా లింక్ పంపిచి టెలిగ్రాం లింకకు ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పడంతో రూ.700 పంపించారు. సైబర్ నేరగాళ్ల బాధిత మహిళకు తిరిగి రూ. 910 పంపిచారు. దీంతో ఆశపడిన గృహిణి రెండవ సారి రూ. 90 వేలు ఇన్వెస్ట్మంట్ చేసింది. గంటల తరబడి వేచిచూసినా తన బ్యాంకు ఖాతాలో ఏమాత్రం నగదు జమకాలేదు. తిరిగి తనకు వచ్చిన ఫోన్ నెంబర్‌కు కాల్ చేయడంతో స్విచ్‌ఆఫ్‌గా వచ్చింది. దీంతో అప్రమత్తమైన బాధిత మహిళ 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి, మానుకోట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మృతుడు ఖమ్మం జిల్లా వాసి


ప్రేమ్‌కుమార్ (ఫైల్)

గంగారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల జలపాతంలో శనివారం గల్లంతైన యువకుడు పామర్తి ప్రేమ్‌కుమార్ (24)మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జెన్నారం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ మేనత్త కుమారుడు సందీప్‌తో శనివారం విహారయాత్రకు వచ్చి ఏడుబావుల జలపాతంలో గల్లంతైన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న గంగారం పోలీసులు శనివారం రాత్రి గల్లంతైన ప్రేమ్‌కుమార్ మృతదేహం కోసం రిస్కీ టీంతో ప్రయత్నించారు. రాత్రి సమయం కావటంతో వారికి సాధ్యపడలేదు. ఆదివారం ఉదయం నుంచి గాలింపు చేపట్టగా, మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు శవపంచనామా చేసి, కేసు నమోదు చేసిన ఎస్‌ఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఐటీఐ చదువుకుని హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడని తండ్రి తెలిపారు. ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఏడుబావుల జలపాతం వద్ద భారీ బందోబస్తును అటవీశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, ఈ ఏడాది రెండు శాఖల్లో సమన్వయం లోపించటంతో ఏడుబావుల జలపాతం వద్దకు వెళ్లే పర్యాటకులను ఎవరూ అడ్డుకోలేక పోయారు. దీంతో జరగాల్సిన ప్రమాదం కాస్త జరిగిపోయిందని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది స్థానిక పోలీసులు ఏడుబావుల జలపాతం నిషేధం విధించామంటూ బ్యానర్ కట్టి వదిలేశారు. ఎటువంటి కాపలా పెట్టలేదు. ఈ విషయంపై ఎస్‌ఐ రవికుమార్‌ని వివరణ కోర ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. గూడూరు సీఐ సూర్యప్రకాష్‌ని వివరణ కోరగా జలపాతం వద్ద నెలక్రితమే బ్యానర్ కట్టి, పోలీసులను కాపలా పెట్టామన్నారు.

రైతు పుట్టినరోజుకు బహుమతిగా యూరియా బస్తా..

» టోకెన్ దక్కని అన్నదాతకు మిత్రుడి చేయూత


రైతు పుట్టినరోజున యూరియా బస్తాను బహుమతిగా ఇస్తున్న మిత్రుడు శోభన్

ఇనుగుర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో మిత్రుని పుట్టిన రోజున అతడికి సంతోషాన్ని కలిగించేందుకు ఎంతో అవసరమైన యూరియా బస్తానే బహుమతిగా ఇచ్చిన వినూత్న ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం లో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని అయ్యగారిపల్లికి చెందిన బొల్లు శివకృష్ణ(చింటు) పుట్టినరోజు సందర్భంగా ఇనుగుర్తిలో ఆయన మిత్రుడు మలిశెట్టి శోభన్ కేక్ తీసుకువచ్చి అతనితో కట్ చేయించాడు. అప్పటికే యూరియా బస్తాల టోకెన్ల కోసం శివకృష్ణ ప్రయత్నించగా అవి అందకపోవడంతో నిరుత్సాహంగా ఉన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న శోభన్ ఓ యూరియా బస్తానే శివకృష్ణకు బహుమతిగా ఇచ్చి, ఊహించని గిఫ్ట్‌తో స్నేహితుని కళ్లలో ఆనందం నింపాడు. కష్టకాలంలో అండగా నిలిచి ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడని శోభన్‌ను పలువురు అభినందించారు.

బొగత వద్ద పర్యాటకుల వాగ్వాదం

● ఫారెస్టు సిబ్బంది తీరుపై ఆగ్రహం ● ఎస్సై జోక్యంతో సద్దుమణిగిన లొల్లి


బొగొత జలపాతం ముఖద్వారం వద్ద జనం రద్దీ

వాజేడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాత జలపాతం వద్ద ఫారెస్టు అధికారులు, పర్యాటకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం నుంచి జలపాతం సందర్శనను నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇదే క్రమంలో వందలాది మంది పర్యాటకులు బొగత వద్దకు చేరుకున్నారు. వారిని ఫారెస్టు సిబ్బంది లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలో ఓ ఉన్నతాధికారి వాహనం అటు రాగా, దానిని సందర్శన నిమిత్తం లోపలికి పంపించారు. ఆ వాహనం బయటకు వచ్చేక్రమంలో పర్యాటకులు బొగత సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనుమతి లేదన్నప్పుడు ఆ అధికారి వాహనాన్ని ఎలా లోపలికి పంపించారంటూ ఫారెస్టు సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు గేట్లను తోసివేస్తూ బొగత లోపలికి చేరుకున్నారు. ఈనేపథ్యంలో బొగత సిబ్బందికి, పర్యాటకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న వాజేడు ఎస్సై జక్కుల సతీష్ సీఆర్పీఎఫ్ బలగాలతో అక్కడికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. వందలాదిమంది పర్యాటకులు తాము బొగత లోపలికి వెళ్లి తీరుతామని భీష్మించుకొని ఉండటంతో ఉన్నతాధికారుకు ఎస్సై సమాచారం అందించి ప్రత్యేక అనుమతులు తీసుకుని లోపలికి అనుమతించారు. బొగత సందర్శన బంద్ చేసిన క్రమంలో ఫారెస్టు అధికారుల తీరు ఇటీవల వివాదాస్పదమవుతోంది. అందరిని ఒకే విధంగా చూడకుండా రెకమెండేషన్లు, ఉన్నతాధికారుల బంధువులు, ఇతరత్రా వ్యక్తులను లోపలికి పంపించడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఫారెస్టు ఉన్నతాధికారులు సైతం నోరు మెదకపోవడం విస్మయం కలిగిస్తోంది. ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసాలకోర్చి ఆర్థికభారంతో ప్రకృతి అందాలను చూద్దామని వచ్చే పర్యాటకులకు ఇలాంటి అనుభవాలు ఎదురవుతుండటం వివాదాస్పదమవుతోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్య తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిపోయిన బొగత సందర్శకుల వాహనాలు

కనుజును వేటాడిన ముగ్గురిపై కేసు

● వండిన వేటమాంసం స్వాధీనం

కొత్తగూడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లక్ష్మీపురం దుర్గారం గ్రామసమీపంలోని అడవిలో శనివారం రాత్రి కనుజును వేటాడి చంపిన అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో వదాహత్ ఆదివారం తెలిపారు. అడవిలో రాత్రి గ్రామానికి చెందిన అర్పపల్లి సుధాకర్, జల్లి ఉపేందర్, హర్యావత్ నర్సింహలు ఉచ్చులు ఏర్పాటు చేసి కనుజును వేటాడి చంపారు. ఆపై వేట మాంసాన్ని గ్రామంలో విక్రయించి, కొంతమాంసాన్ని వండుకున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖాధికారులు గ్రామానికి వెళ్లి విచారణ చేసి వారిని పట్టుకున్నారు. ఈ మేరకు వారిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

ఇద్దరిని తప్పించారా..?

కనుజును వేటాడిన కేసులో మరో ఇద్దరు ఉన్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఐదుగురు కలిసి కనుజును వేటాడి చంపి మాంసం వాటాల్లో తేడాలు రావడంతోనే ఈ బృందంలో నుండే అధికారులకు సమాచారం చేరవేసినట్లు తెలిసింది. ఇందులో ఇద్దరిని అటవీశాఖాధికారులే తప్పించి ముగ్గురిపైనే కేసు నమోదు చేసినట్లు గ్రామంలో చర్చ సాగుతోంది. వారిని తప్పించడంపట్ల పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఎఫ్ఆర్‌వోను వివరణ కోరగా తమ ప్రాథమిక విచారణలో ముగ్గురే ఉన్నట్లు తేలిందని, ఇంకా ఎవరైనా ఉంటే సమగ్ర విచారణ జరుపుతామని స్పష్టం చేశారు.


కొత్తగూడ అటవీశాఖ కార్యాలయంలో పట్టుబడిన వేటగాళ్లు, వండిన మాంసం

సౌదీలో కష్టాలు.. కన్నీళ్లు అనుభవించా..

మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఇంటికి వచ్చా
ఏడేళ్లు ఏడారి జీవితం అనుభవించిన తాళ్లపల్లి ఈశ్వర్


కొప్పూర్‌లో తన కుటుంబ సభ్యులతో సౌదీ నుంచి వచ్చిన తాళ్లపల్లి ఈశ్వర్

భీమదేవరపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'సౌదీలో కష్టాలు.. కన్నీళ్లు అనుభవించా.. ఏడేళ్ల పాటు ఏడారి జీవితం నిత్యం నరకంలా మారింది. డ్రైవర్‌గా పనిచేస్తానని సౌదీకి వెళ్లి ఖర్జూర తోటలో కూలీగా మారానని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు భార్య, పిల్లలను చూస్తానో లేదోనని మదన పడ్డాడు. ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తాను ఇండియాకు రాగాలిగానని దుబాయిలో ఏడేళ్ల నరకం అనుభవించిన తాళ్లపల్లి ఈశ్వర్ ఆవేదన. ఆదివారం భీమదేవరపల్లి మండలంలోని కొప్పూర్ గ్రామంలో తన బాధను విలేకరులతో పంచుకున్నాడు. కొప్పూర్ గ్రామానికి చెందిన ఈశ్వర్ ఏడేళ్ల కిందట అప్పులు చేసి దుబాయికి వెళ్లాడు. భార్య లత, ఇద్దరు ఆడ కూతుళ్లు మణిదీపిక, మౌనికలు ఉన్నారు. వీరిని ఉన్నతంగా చూడాలనే ఉద్దేశంతో సౌదీకి వెళ్లాడు. డ్రైవర్ అయినా ఈశ్వర్‌కు సౌదీలో డ్రైవర్ పనిచేస్తామని మధ్యవర్తి తోట కూలీ పని చేయించారు. రెండేళ్ల కరోనా రావడంతో వీసా ముగిసిపోయింది. దీంతో వీసా పాస్‌పోర్టు గడువు ముగియడంతో ఆందోళన చెందాను. విషయాన్ని కొప్పూర్‌లోని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇండియా, సౌదీ ఎంఎస్‌తో మాట్లాడి తనను ఇండియాకు తీసుకువచ్చారన్నారు. తాను మంత్రి పొన్నం చొరవతో ఇండియాకు వచ్చి తన కుటుంబ సభ్యలను చూశానన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

మడికొండ , ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని సాయి ఆర్చిడ్ కాలనీలో చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండలోని సాయి ఆర్చిడ్ కాలనీకి చెందిన మాదడి కృష్ణారెడ్డి కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. శనివారం రాత్రి అందరు ఇంట్లో నిద్రిస్తుండగా ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. బంధువుల ఇళ్లల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. అతడి కుమారుడు మాదడి రఘు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా కృష్ణారెడ్డి వివరాలు తెలిస్తే సెల్ నంబర్ 87126 85248కు తెలుపాలని సీఐ కిషన్ కోరారు.

టెక్స్‌టైల్‌పార్కులో పనులను వేగవంతం చేయాలి

● మార్చి నాటికి చింతలపల్లి రైల్వే బ్రిడ్జిని పూర్తిచేయాలి ● ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి అథారిటి కమీషనర్, టీజీఐఐసీ ఎమ్డీ శశాంక

గీసుగొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వరద కాలువ, ఆర్వోబీ, ఆర్వో ప్లాంట్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఫ్యూచర్ సిటీ అభివృద్ధి అథారిటీ కమిషనర్, టీజీఐఐసీ ఎం.డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి కె.శశాంక అన్నారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట హవేలి శివారులో నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేఎంటీపీ మధ్య నుంచి పోయే వరద కాలువ నిర్మాణానికి రూ.160కోట్లు మంజూరైనట్లు చెప్పారు. వరద కాలువ నిర్మాణం ఎక్కడా రాజీలేకుండా నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అదేవిధంగా కైటెక్స్ కంపెనీ సమీపంలో నిర్మించే ఆర్వో వాటర్ ప్లాంటేషన్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కేఎంటీపీలోకి వచ్చే విధంగా చింతలపల్లి రైల్వే స్టేషన్ వద్ద నిర్మించే ఆర్వోబీ నిర్మాణాన్ని మార్చి కల్లా పూర్తిచేయాలన్నారు. అనంతరం పార్కులో ఎంవోయూ చేసుకున్న కంపెనీల వివరాలను ఆయన ఆరా తీశారు. ఇప్పటి వరకు అందులో ఎన్ని కంపెనీలు నిర్మాణాలు చేపట్టాయని టీజీఐఐసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కంపెనీల నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గణేశా ఎకోపెట్ కంపెనీ ఉత్పత్తులను, దక్షిణ కొరియా యంగ్వాన్ కంపెనీ నిర్మాణ పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి నాయక్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ రాంప్రసాద్, ఈఈ సునీత, గీసుగొండ, సంగెం మండలాల తహసీల్దార్‌లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్, ఎన్ఐటీ ప్రొఫెసర్ వంశీకృష్ణ, ఆర్ఐ సాంబయ్య, సర్వేయర్ పాల్గొన్నారు.


పార్కులో మౌలిక నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకుంటున్న శశాంక

రుద్రేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు

వేయిస్తంభాల గుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు


వేయిస్తంబాల గుడిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులు శాం కోసం, శ్రీనివాస్

హనుమకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని సుప్రసిద్ధ శ్రీ రుద్రేశ్వరస్వామివారి వేయిస్తంభాల గుడిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు పి.శామ్‌కోసి, శ్రీనివాస్ సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఉత్తిష్ఠ గణపతి దర్శనం చేయించారు. అనంతరం శ్రీ రుద్రేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం నిర్వర్తింపచేశారు. ఇద్దరు న్యాయమూర్తులకు ఆలయ మండపంలో శేషవస్త్రాలను ప్రదానం చేసి, తీర్థప్రసాదలను అందచేశారు. వేదాశీర్వచనం జరిపారు. ఆలయ ప్రాశస్త్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా నాయమూర్తి శాంకోసి మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నాటి అతి పురాతనమైన, అత్యంత ప్రాశస్త్యం కలిగిన వేయిస్తంభాల గుడిని సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు మరో న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రుద్రేశ్వర స్వామి దర్శనం తనకు గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. పురాతన దేవాలయాలు సందర్శించడం వల్ల మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు గంగు మణికంఠ శర్మ, ఆలయ సిబ్బంది మధుకర్, ఎల్. రామక్రిష్ణ, బి.రజిత తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు రాక సందర్భంగా ఆలయం వద్ద భారీ పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.

ఇల్లందలో రోడ్డు ప్రమాదం

● వృద్ధురాలిని ఢీకొట్టిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు
● తల కింది భాగం నుజ్జునుజ్జు, బయట పడిన అవయవాలు


యాకమ్మ(ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్‌ఐ భూక్యా చందర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లంద గ్రామానికి చెందిన తూళ్ల యాకమ్మ(60) ఆరోగ్యం బాగాలేక స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లి వైద్యం చేసుకుని వస్తోంది. ఈ తరుణంలో తన ఇంటికి వెళ్లేందుకు వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిని దాటుతోంది. ఈ క్రమంలో వరంగల్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తూ వేగంగా మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసింది. ఈ తరుణంలో అప్పటికే రోడ్డు సగం వరకు దాటిన వృద్ధురాలిని ఢీకొట్టడంతో యాకమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు వెనక ఉన్న మరో వృద్ధుడు సాతుపెల్లి కుమారస్వామిని సైతం ఢీకొట్టగా గాయాల పాలయ్యాడు. దీంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. బస్సు ఢీకొనడంతో వృద్ధురాలు కిందపడిపోగా ఆమె పైనుంచి బస్సు వెనక టైర్లు వెళ్లాయి. దీంతో వృద్ధురాలి తల కింద భాగమంతా నుజ్జు నుజ్జు అయ్యాయి. శరీర అవయవాలన్నీ బయట పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఘటన స్థలానికి వచ్చిన ఎస్‌ఐ చందర్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేటకు తరలించారు. మృతురాలి మనవడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో యువన్ రాజ్‌కు కాంస్య పతకం


మెడల్‌తో యువన్‌రాజ్

వడ్డెపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని తాల్కటోర ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల కిందట నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హనుమకొండ 56వ డివిజన్ అమరావతి నగర్‌కు చెందిన మోరె అనిల్, నవత దంపతుల కుమారుడు మోరె యువన్‌రాజ్ పాల్గొన్నారు. తెలంగాణ శిఖోకాయి రిప్రజంటీవ్ పాలకుర్తి పాపయ్య ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించి కాంస్య పతకాన్ని సాధించారు. యు వన్‌రాజ్‌కు నిర్వాహకులు మెడల్‌తోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నల్లబెల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రుద్రగూడెం జాతీయ రహదారి క్రాస్ వద్ద ఆదివారంజరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన నూనావత్ వెంకన్న (55) గోవిందరావుపేట నుంచి ద్విచక్రవాహనంపై మరిపెడ బంగ్లాకు వెళుతున్న క్రమంలో నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం జాతీయ రహదారి క్రాస్‌వద్దకు రాగానే ఒక్కసారిగా ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు కిందపడ్డాడు. రోడ్డు కింద బండలు ఉండడంతో వెంకన్న తలకు, మెడ భాగానికి తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారాన్ని అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ప్రమాద స్థలిని పరిశీలించి, మృత దేహన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తప్పిపోయిన బాలికలను తల్లికి అప్పగింత


పిల్లలను తల్లికి అప్పగించిన పోలీసులు

కాజీపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైలులో తప్పిపోయిన ఇద్దరు బాలికలను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కాజీపేట రైల్వే ఎస్సై ఎం. అభినవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోరఖ్‌పూర్ నుంచి యశ్వంత్‌పూర్ వెళ్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తల్లి ఇద్దరు కూతుళ్ల చాందిని, ఆదిత్యలతో కలిసి యశ్వంతపూర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో రైలు రామగుండం రైల్వే స్టేషన్‌లో ఆగగానే తల్లికి వాంతులు రావడంతో రామగుండంలో రై లు దిగింది. తిరిగి రైలెక్కే క్రమంలో రైలు కదిలింది. ఇద్దరు పి ల్లలు రైల్లోనే ఉండిపోయారు. వెంటనే రైల్వే పోలీసులను సమచారం ఇవ్వడంతో కాజీపేటలో రైలులో ఉన్న ఇద్దరు పిల్లలను పోలీసు లు పట్టుకుని తల్లిని పిలిపించి అప్పగించినట్లు రైల్వే ఎస్సై చెప్పారు.

మానుకోటలో పట్టపగలే దొంగల బీభత్సం

● ఇంటి తాళం పగలగొట్టి.. 10 తులాల బంగారుం, 15 తులాల వెండి, రూ. 15 వేలు నగదు అపహరణ

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మానుకోట పట్టణంలోని నర్సంపేట బైపాస్ రోడ్‌లో ఆదివారం పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంటిలోపల ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులో బంగారు ఆభరణాలు, వెండి గొలుసులతో పాటు నగదును అపహరించుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. శారద అనే ఒంటరి మహిళ కుమారుడితో కలిసి మహబూబాబాద్ పట్టణంలోని నర్సంపేట బైపాస్ ప్రధాన రహదారి పక్కన ఓ ఇంటిలో నివాసం ఉంటున్నది. శనివారం ఉదయం ఇంటికి తాళంవేసి చిన్నగూడూరులోని బంధువుల ఇంటిలో వివాహ వేడుకకు హాజరైంది. మరుసటి రోజు తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న బీరువాను ధ్వంసం చేసి, అందులో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి గొలుసులతో పాటు రూ. 15 వేల నగదు అపహరించుకెళ్లినట్లు తెలిపారు. క్లూస్ టీం అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. కాగా, మహబూబాబాద్ పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. నిఘాను పెంచి చోరీలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


చిందరవందరగా పడేసిన వస్తువులు, తెరిచి ఉన్న బీరువా



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి

ప్రపంచీకరణ అయిన
మధ్యవర్తిత్వం

» వివాదాల పరిష్కారానికి ఐచ్ఛిక ప్రక్రియ » కోర్టుల భారాన్ని తగ్గిస్తోంది.. » హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషి » న్యాయవాదులకు శిక్షణ

హనుమకొండ లీగల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కోర్టుల్లోని కేసులను గణనీయంగా తగ్గించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ హైదరాబాద్ కార్య నిర్వాహక ఛైర్మన్ జస్టిస్ పి.సామ్ కోషి పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయసేవా సంస్థలు గుర్తించిన మధ్యవర్తిత్వం భావన, సాంకేతికతలపై సాధికారత పొందిన న్యాయవాదులకు 40 గంటల శిక్షణా కార్యక్రమం ఆదివారం హనుమకొండ కాళోజీ జంక్షన్ జంక్షన్‌లోని డీసీసీబీ భవనం సెమినార్ హాల్‌లో జరిగింది.

ఈ సందర్భంగా న్యాయమూర్తి సామ్ కోషి మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం ప్రపంచీకరించబడిందని, మధ్యవర్తిత్వం కోర్టుల భారాన్ని చాలా వరకు తగ్గిస్తోందన్నారు. శిక్షణ పొందిన మధ్యవర్తులు వారి అపారమైన అనుభవంతో న్యాయవాదులను మధ్యవర్తిగా వ్యవహరించేందుకు మెళకువలు నేర్పాలని సూచించారు. మధ్యవర్తిత్వం మొత్తం చట్టపరమైన ప్రక్రియ ద్వారా వెళ్లకుండానే పార్టీల వివాదాలను పరిష్కరించడానికి అవకాశాలను కల్పిస్తోందన్నారు. కార్పొరేట్లు, వ్యాపారాలు, కంపెనీలు మొదలైనవన్నీ వారి వివాదాల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తున్నాయని అన్నారు. మధ్యవర్తిత్వం, రాజీ అనేది రెండు పార్టీల మధ్య వివాదాన్ని పరిష్కరించడానికి సమర్థవంతమైన సాధనం, ఇరువైపుల నుంచి ఎటువంటి బాహ్య ఒత్తిళ్లు లేకుండా వారి వివాదాలను పరిష్కరించుకోవడానికి వారికి ఒక వేదికను అందిస్తుందని అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. పార్టీల మధ్య శాంతి, సామరస్యాన్ని కల్పిస్తుందన్నారు. ఇది కక్షిదారులకు చాలా ప్రయోజనం చేకూరిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో మధ్యవర్తిత్వం వేగంగా అభివృద్ధి చెందడానికి ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు సేవలను అందించాలని సూచించారు. ఈ 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని, మెళకువలు నేర్చుకొని కోర్టులలోని కేసుల కక్షిదారులను మధ్యవర్తిత్వం ద్వారా రాజీ కుదుర్చుకునేలా ప్రయత్నించాలని కోరారు.

మరో హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కక్షిదారులు తమంతట తామే వాళ్ల కోపతాపాలను వదిలిపెట్టుకొని సమస్యలను పరిష్కరించేలా మధ్యవర్తిత్వం పని చేస్తుందని తెలిపారు. మధ్యవర్తిత్వం ఆత్యధిక వివాదాలను పరిష్కరించడానికి సహాయపడుతుందని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా వాణిజ్య సంబంధాలు, వ్యక్తిగత సంబంధాలు చెడిపోకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి. నిర్మలా గీతాంబ, డాక్టర్ బి.పట్టాభి రామారావు, ఇతర జిల్లా న్యాయమూర్తులు నారాయణ బాబు, మనీషా శ్రావణ్ ఉన్నమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమా దేశ్‌పాండే, బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్, భైరపాక జయాకర్, వరంగల్ హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెరిల్లా వీరుడు.. ధిక్కార సూర్యుడు..

మొఘలాయిలను గడగడలాడించిన సర్వాయి పాపన్న

» మూడున్నర శతాబ్దాల క్రితమే గెరిల్లా సైన్యం ఏర్పాటు
» బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాటం
» పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమవుతున్న కోట, బురుజులు
» ఖిలాషాపూర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దాలంటున్న ప్రజలు
» నేడు సర్దార్ పాపన్న 375వ జయంతి



కూలిపోతున్న కోట గోడ



రఘునాథపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బహుజనుల రాజ్యాధికారం కోసం మూడున్నర శతాబ్దాల క్రితమే సబ్బండ వర్గాలను ఏకం చేసి మొఘలాయిలను గడగడలాడించిన సాహస వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లో నిర్మించిన కోట మూడున్నర శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. మొఘల్ సామ్రాజ్యవాదుల కాలం 18వ శతాబ్దం ప్రథమాంకంలో ఔరంగజేబు పాలనలో మొఘల్ సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న రాజరికపు పోకడలను, ప్రజల అణచివేతలను సహించలేక పాపన్న అణగారిన వర్గాల విముక్తి కోసం గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఏకంగా ఖిలాషాపూర్ కోటను నిర్మించి మొఘల్‌లపై పోరాటానికి సిద్ధమయ్యాడు. కాగా, పాపన్న 375వ జయంతిని నేడు(సోమవారం) రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కలెక్టర్లు జిల్లా కేంద్రాల్లో పాపన్న తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.


శత్రు దుర్భేద్యంగా కోట

ఖిలాషాపూర్‌లో పాపన్న నిర్మించిన కోట ఓ అద్భుతం. పెద్ద పెద్ద రాతి కనిలు.. డంగు సున్నం.. మట్టితో శత్రు దుర్భేద్యంగా కోటను నిర్మించారు. కోటకు నాలుగు వైపులా శత్రువుల రాకను గుర్తించేందుకు చిన్న బురుజులు, కోట మధ్యలో పెద్ద బురుజును నిర్మించారు.

ఈ కోట నుంచి తాటికొండ వరకు, భువనగిరి కోట వర కు సొరంగ మార్గం ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఖిలాషాపూర్‌లో 1650వ సంవ త్సరం ఆగస్టు 18న పాపన్న పురుడు పోసుకు న్నాడని, గౌడ కులంలో పుట్టిన పాపన్నకు పసిపాపగా ఉన్నప్పుడు నాగుపాము పడగను నీడగా పట్టిందని చరిత్రకారులు చెపుతారు. మొఘల్‌లపై తిరుగుబాటు చేశాడని, 12 మంది భిన్న కులాలకు చెందిన వారితో పాపన్న ఏర్పాటు చేసుకున్న సైన్యం పన్నెండు వేలకు విస్తరించి మొఘల్ సామ్రాజ్యవాదుల గుండెల్లో గుబులు పుట్టించాడు.

కోటపై పట్టింపేది ?

రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ఇదే గ్రామానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ పేర్వారం రాములును పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమించింది. దీంతో పాపన్న కోటకు పూర్వ వైభవం వస్తుందని ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. కోట శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతుల పనుల కోసం 2016లో ప్రభుత్వం రూ.12 లక్షలు మంజూరు చేయగా కొంత భాగం మరమ్మతుకే సరిపోయాయి. 2019లో రెండోసారి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కోట పునరుద్ధరణకు రూ.4.75 కోట్లతో పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖలు ప్రతిపాదించగా, దశలవారీగా నిధులు కేటాయించింది. కోట ప్రాంగణంలో పాపన్న స్మృతి వనం, ఇతర పనులకు ప్రతిపాదనలు ఉన్నా ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదు. కోట మధ్యలో ఉన్న బురుజు కూలిపోయే పరిస్థితిలో ఉండడంతో గోడలకు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. 2021లో కురిసిన వర్షాలకు కోటలోని ఒక భాగం కూలిపోగా, రూ.50 లక్షల వ్యయంతో పునరుద్ధరించగా, కోటలోని మిగిలిన భాగంలో ఉన్న గోడలు శిథిలమవుతున్నాయి. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



మూసుకపోతున్న కోట సొరంగం

కోటకు కొత్త శోభ తీసుకురావాలి



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా కోటకు కొత్త శోభ సంతరించుకోవాలని ఆశిస్తున్నాం. ముఖ ద్వారం, బురుజు, సొరంగ మార్గం చరిత్రను మా పెద్దలు చెబుతుంటే విని ఆశ్చర్యపోయేవాళ్లం. అలాంటి మూడు వందల యాభై సంవత్సరాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోన్న కోట శిథిలమవుతుంటే చాలా బాధనిపిస్తోంది. పాపన్న కోట పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.

మీసాల రాజయ్య గౌడ్, ఖిలాషాపూర్

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



బహుజనుల రాజ్యాధికారం కోసం మూడు న్నర శతబ్దాల క్రితమే పోరాటం సాగించిన సాహస వీరుడు సర్వాయి పాపన్న నిర్మించిన కోటను పర్యాటకంగా తీర్చిదిద్దాలి. ఖిలాషాపూర్‌లో పాపన్న స్మృతి వనం ఏర్పాటు చేసి పాపన్న పేరిట పెద్ద కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. జిల్లాకు సర్వాయి పాపన్న పేరుగా నామకరణం చేయాలి.

గడ్డమీది వెంకన్న, గౌడ సంఘం అధ్యక్షుడు, ఖిలాషాపూర్

అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయి..

కాకతీయ అవార్డు వేడుకల్లో ఏసీపీ జితేందర్‌రెడ్డి



ఏసీపీ జితేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కవులకు, కళాకారులకు నిలయమైన ఓరుగల్లు నగరంలో అనేక కళా సంస్థలు ఉన్నా రోజా క్రియేషన్స్ స్థానం ప్రత్యేకమైందని స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీసు జితేందర్‌రెడ్డి అన్నారు. అవార్డుల ద్వారా వ్యక్తి బాధ్యతలను పెంపొందింపజేస్తాయన్నారు. శనివారం రాత్రి హనుమకొండ చౌరస్తాలోని వీనస్ ఫంక్షన్‌హాలులో రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకతీయ మహానంది పురస్కార వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భిన్న కళలకు నిలయమైన ఓరుగల్లులో కళాకారులు నిలదొక్కుకోవాలంటే ప్రోత్సహించే సంస్థలు అవసరమన్నారు. రోజా క్రియేషన్స్ ప్రతీయేటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సత్కరించడం అభినందనీయమన్నారు.

ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ నాయకుడు గట్టు మహేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థలకు భిన్నంగా నగరంలోని కళా సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో మెరుగ్గా ఉంటున్నాయన్నారు. ఈ సందర్భంగా గట్టు మహేశ్‌బాబు, ప్రముఖ గాయకులు రావెళ్ల రామారావు, రిటైర్డ్ డీఈవో బూర విద్యాసాగర్‌గౌడ్, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ మంచికట్ల జనార్దన్, జూనియర్ ఘంటసాల గుజ్జారి రమేశ్, పాత్‌ఫైండర్ విద్యాసంస్థల అధినేత ఎన్.వెంకటేశ్వర్‌రావు, ప్రముఖ సాఫ్ట్‌వేర్ నిపుణుడు డాక్టర్ గుజ్జారి శ్రీధర్‌బాబు, నందనం కవిత ముత్యాల చంద్రమౌళి, ఆడెపు రవీందర్, ప్రముఖ కవి అన్వర్, తదితర భిన్నరంగాల ప్రముఖులను కాకతీయ మహానంది పురస్కారాలతో సత్కరించారు. తయ్యాల శ్రీధరాచార్యులు కార్యక్రమ సంయోజకుడిగా వ్యవహరించారు.

కవితా మంజరి ఆవిష్కరణ

వర్ధమాన కవి బిటవరం శ్రీమన్నారాయణ కలం నుంచి జాలువారిన 62 కవితల సమ్మేళనం కవితా మంజరిని ఏసీపీ జితేందర్‌రెడ్డి, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ వాసిరెడ్డి కృష్ణారావు, తదితర కవులతో కలిసి ఆవిష్కరించారు. మహ్మద్ సిరాజుద్దీన్ కవిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సీతాల రఘువేందర్, పొన్నాల సంయుక్త, ఉషా మార్త, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ రామాల సునీత, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు గుడ్డిగా చల్లొద్దు..

» పారాక్వాట్ ప్రాణాంతకం
» అన్నదాతల ఆరోగ్యంపై ప్రభావం
» రక్షణ చర్యలు తీసుకోవాలి



వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పంటలలో కలుపు మొక్కలను నాశనం చేసే మందులను యథేచ్ఛగా వాడొద్దు. దీనికోసం రైతు లు ఎక్కువగా వినియోగించే పారాక్వాట్ డైక్లోరేట్(పెస్టిసైడ్) అత్యంత ప్రమాదకరమైనది. గతంలో కలుపు పనులను కూలీలతో చేయించేవారు. అయితే దానికి ఖర్చు ఎక్కువ కావడంతో పాటు అధిక సమయం పడుతుండడంతో రైతులు గడ్డిమందును వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోకి పారాక్వాట్ డైక్లోరేట్ అనే మందు అందుబాటులోకి వచ్చింది. దీన్ని స్ప్రే చేస్తే తక్కువ ఖర్చుతో పని సులవువు అవుతోంది. దీంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

అయితే పారాక్వాట్ డైక్లోరేట్(పెస్టిసైడ్)అనే ఈ మందును వినియోగించే ముందు రక్షణ చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రాణాలకే ప్రమాదమని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. అత్యంత విషపూరితమైన ఈ మందుతో రైతులు పార్కిన్సన్ (చేతులు వనకడం)వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అంతేగాకుండా ఊపిరితిత్తులు, చర్మం, కళ్లపై కూడా ప్రభావం చూపే అవకాశాలున్నాయని అంటున్నారు. ఈ మందు వాడకపోవడమే మంచిదని చెబుతున్నారు.

మోతాదుకు మించి వాడొద్దు..
- రవీందర్‌రెడ్డి, ఏవో, వరంగల్

క్రిమిసంహారక మందులు ఏవైనా మోతాదుకు మించి వాడొద్దు.. ఇంట్లో నిల్వ చేసుకోవడం కూడా అపాయమే.. పారాక్వాట్ డైక్లోరేట్(పెస్టిసైడ్)అనే ఈ మందును పిచికారి చేసే రైతులు, కూలీలు తప్పకుండా చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు పెట్టుకోవాలి. శరీరం మీద పడకుండా చూసుకోవాలి. తలకు, కళ్లకు, శ్వాస తీసుకునేందుకు తగిన రక్షణ చర్యలు తప్పకుండా తీసుకోవాలి.

డీఎల్‌ఈడీ రెండేళ్ల కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

» ఈనెల 19న డైట్‌లో, 20న ప్రైవేట్ డీఎల్‌ఈడీలో.. » ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ప్రకటన

హనుమకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 2025-27 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ) రెండేళ్ల కోర్సులో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల వారీగా స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియ ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జిల్లా విద్యాశఖ శిక్షణా సంస్థ వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన ఆచార్యుడు ఎం.డి. అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తెలంగాణ డీఈఈసెట్-2025లో అర్హత సాధించి ఉండాలని, ఏ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలోనూ సీటు పొందనివారు, వాటిల్లో చేరని అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

ఈ కింద పేర్కొన్న వర్గానికి చెందిన ఖాళీ సీట్లలో మాత్రమే ప్రతిభ ఆధారంగా ప్రవేశం ఉంటుందని, ఈడబ్ల్యుఎస్ ఖాళీ సీట్లు ఇతర వర్గాలకు మార్పు చేయడం జరగదని తెలిపారు. ఒకవేళ సంబంధించిన వర్గానికి చెందిన అభ్యర్థులు అందుబాటులో లేకుంటే ఆ వర్గానికి సంబంధించిన సీట్లు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కేటాయిస్తామని తెలిపారు.

తెలుగు మీడియంలో మొత్తం 3 సీట్లలో ఓసీజీ-1, ఎస్‌సీటీజీ-1, హెచ్‌ఐజీ-1, ఇంగ్లిష్ మీడియంలో మొత్తం 7సీట్లలో ఓసీజీ-1, బీసీఏజీ-1. బీసీడీఎఫ్-1, ఎస్‌సీటీజీ-1, ఓఈడబ్ల్యుఎస్‌జీ-1, ఓఈడబ్ల్యుఎస్‌ఎఫ్-2, ఉర్దూ మీడియంలో మొత్తం 26 సీట్లలో ఓసీజీ-2, ఓసీఎఫ్-3, ఎస్‌సీజీ-2, ఎస్‌సీఎఫ్-2, ఎస్‌టీజీ-1, ఎస్‌టీఎఫ్-1, బీసీఏజీ-2, బీసీఎఎఫ్-1, బీసీబీఎఫ్-1 బీసీడీజీ-2, బీసీడీఎఫ్ 1, హెచ్‌ఐజీ-1, హెచ్‌ఐజీ-1, ఓహెచ్‌ఎఫ్-1, ఓహెచ్‌ఎఫ్-1, ఓబీసీడీజీ-1, ఓఈడబ్ల్యుఎస్‌జీ-4, ఓఈడబ్ల్యుఎస్‌ఎఫ్-1లో స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు డీఈఈసెట్-2025 రాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ ఒరిజినల్ మెమో, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మెమో, 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్స్, టీసీ, కుల, ఆదాయ, ఈడబ్ల్యుఎస్ ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగుల (పీహెచ్‌సీ) ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈనెల 19న, ప్రైవేటు డీఎల్‌ఈడీ కళాశాలలో ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కళాశాలలో ఉండాలని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌లో సీటు కేటాయింపు నిర్ధారణ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు తెలియజేయనున్నట్లు చెప్పారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన అభ్యర్థులు ప్రభుత్వ డైట్ కళాశాల, ప్రైవేటు డీఎల్‌ఈడీ కళాశాలలో ఈనెల 21న రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

మత సామరస్యం, ఐక్యతకు చిహ్నం

» కాజీపేట అఫ్జల్ బియాబాని దర్గా » ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు » ప్రతీ ఏటా దర్గా ఉత్సవాలు » ఈ నెల 21 నుంచి మొదలు » ముస్తాబవుతున్న దర్గా

కాజీపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ప్రత్యేకత చాటుకున్న దర్గాలలో కాజీపేట హజరత్ సయ్యద్ అఫ్జల్ బియాబాని దర్గా ఒకటి. మత సామరస్యానికి, సమైక్యతకు ప్రసిద్ధిచెందిన ఈ దర్గాలో.. ప్రతీ ఏటా మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు ప్రపంచ వ్యాప్తంగా ఉండే ముస్లింలు హాజరై ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకుంటారు. కేవలం ముస్లింలే కాకుండా ఇతర మతాల వారు సైతం ఈ ఉత్సవాలకు హాజరై భక్తిని చాటుకుంటారు. ప్రపంచంలో ఆకు పచ్చ దర్గాలు మూడు ఉండగా, అందులో ఒకటి మదీనా, రెండోది బాగ్దాద్, మూడోది కాజీపేట దర్గా. ఈ దర్గాకు ఖుస్రుపాషా ఏడో పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు.

21 నుంచి దర్గా ఉర్సు

ఈనెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు వివిధ దేశాల నుంచి భక్తులు హాజరుకానున్నారు. ఇందుకోసం దర్గా ఉర్సువద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దర్గాకు ఆకుపచ్చ రంగు పెయింటింగ్ పనులు వారం నుంచి జరుగుతున్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 21 గంధ లేపనం, 22న ఉర్సు ఉత్సవం, 23 బదావాతో ఉత్సవం ముగింపు ఉంటుంది. ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు హాజరై మొక్కులు చెల్లించనున్నట్లు తెలుస్తోంది. అందుకుగాను ఈ మధ్యే దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా రేవంత్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం అందజేశారు.



ఆకుపచ్చ రంగుతో ముస్తాబవుతున్న దర్గా

దర్గా నేపథ్యం

కాజీపేటకు చెందిన సయ్యద్ గులాం మొహినుద్దీన్ దంపతులకు 1795లో అఫ్జల్ బియాబాని జన్మించాడు. అతడు చిన్నప్పట్నుంచే ఎన్నో మహిమలు చేస్తుండేవారు. దీంతో ఆయనను అనుసరిస్తూ భక్తులు వెంబడించేవారు. 12 ఏళ్లకే ఖురాన్‌ను కంఠస్థం చేసినట్లు చెపుతారు. పీడితులకు, రోగులకు సేవ చేస్తూ, ధనిక, పేదల అంతరంగాన్ని తగ్గించడానికి ఒక గుడిసెలో జీవితాన్ని గడుపుతూ బోధనలు చేసేవారు. బియాబానికి మహ్మద్ ప్రవక్త కలలో కనిపించి నీవు ముస్లిం మతగురువుగా మారి ఇస్లాం మతాన్ని బోధించాలని ఉపదేశం చేశారని చెబుతాడు. ఒకానొక దశలో వర్షాలు లేక కరువులో ప్రజలు అల్లాడుతున్న క్రమంలో బియాబాని శిష్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేయగా, వర్షాలు కురిసి ప్రజలు కరువునుంచి బయటపడ్డారని చెబుతారు. రోగులను స్వస్థపరచడం వంటి అద్భుతాలు చేసేవారు. ఆయన బోధనలు మతసామరస్యం, సామాజిక న్యాయానికి చిహ్నంగా నిలుస్తాయి. నిజాం అలీఖాన్ పాలనలో సయ్యద్ బియాబాని వరంగల్ ఖాజీ (మత న్యామూర్తిగా)నియమితులయ్యారు. ఆపేరునుంచే కాజీపేట అనే పేరువచ్చింది. 1856 సంవత్సరంలో ఆయన మరణానంతరం ఆయన సమాధినే ఈ దర్గాగా నిర్మించారు.

అన్ని మతాల ఐక్యతను చాటే ప్రత్యేక కాన్ఫరెన్స్

ఖుస్రుపాషా, కాజీపేట దర్గా పీఠాధిపతి



ఈ సారి జరిగే దర్గా ఉర్సు ఉత్సవాలకు ముస్లిం, హిందూ, క్రిస్టియన్ మత గురువులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మతాలు వేరైనా మనవతావాదం గొప్పదనే సందేశాన్ని అందించేందుకు అన్ని మతాల ప్రతినిధులతో ప్రత్యేక కాన్ఫరెన్స్ ఉంటుంది. ఈ దర్గా ఉత్సవం అన్ని మతాల ఐక్యతకు ప్రతీక. ఈ ఉత్సవాలకు ప్రపంచ దేశాల నుంచి భక్తులు హాజరుకానున్నారు. ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా భక్తులకు అన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఉత్సవాలకు ప్రతీరోజు సుమా రు 50వేల మంది భక్తులు హాజరు కానున్నారు.

నిరాధార వార్తలు రాసిన
ఇద్దరు జర్నలిస్టులపై కేసు

హనుమకొండ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, విద్యాశాఖ అధికారిపై నిరాధార ఆరోపణలు చేస్తూ వార్తలు రాసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న ఓ పత్రికలో పనిచేస్తున్న ఇద్దరు జర్నలిస్టులపై శనివారం కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్ కుమార్ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన రావుల రాజగోపాల్‌రెడ్డి అనే ఉపాధ్యాయుడు గతంలో విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్‌గా పనిచేసిన క్రమంలో తనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారిపై నిరాధార ఆరోపణలు, అపకీర్తికరమైన వార్తలు ప్రచురించి వాట్సాప్ స్టేటస్ ద్వారా వైరల్ చేసి తమ ప్రతిష్ఠను దెబ్బతీసిన జోర్దార్ పత్రిక జర్నలిస్టు సాంబమూర్తి, చీఫ్ ఎడిటర్ రావుల రాజేశం బ్లాక్ మెయిల్ చేసినట్లు రాజగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరిపై సెక్షన్ 352/ బీఎన్ఎస్, సెక్షన్ 67 / ఐటీ యాక్ట్ 504 ఐపీసీ సెక్షన్ 67 /ఐటీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు పాపన్న జయంతి వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పాపన్న గౌడ్ జయంతిని సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై పాపన్న జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నిబంధనల మేరకే సదయ్యకు ఫారిన్ సర్వీస్

ఎస్టీయూటీఎస్ జిల్లా నాయకుల స్పష్టీకరణ

హనుమకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆట సదయ్య ప్రభుత్వ నిబంధనల మేరకే విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సీటీఈలో ఫారిన్ సర్వీస్‌లో పని చేస్తూ సైకాలజీ బోధిస్తున్నాడని తెలంగాణ రాష్ట్రోపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కె.రాంబాబు, ప్రధాన కార్యదర్శి వి. రాంబాబు పేర్కొన్నారు. హనుమకొండ ఎస్టీయూ భవన్‌లో జరిగిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో వీరు మాట్లాడుతూ.. సదయ్య ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు అయినప్పటికీ సైకాలజీలో పీజీ, పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పట్టా పొందాడని అన్నారు. బీఈడీ విద్యార్థులకు సైకాలజీ బోధించడానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్నందువల్లనే ప్రభుత్వం ఆయనను సీటీఈవో నియమించిందన్నారు. సదయ్య ఫారిన్ సర్వీస్‌లో సీటీఈకి వెళ్లడం వల్ల ఆయన పనిచేసే రైల్వే గేట్ ఉన్నత పాఠశాలలో మరొకరిని భర్తీచేశారని, కనుక విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.సుధాకర్‌రెడ్డి, బి.రవి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్లు

హనుమకొండ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మీడియేషన్ ట్రైనింగ్ కార్యక్రమానికి హాజరవడానికి వరంగల్ నగరానికి వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ సెల్ చైర్మన్ జస్టిస్ పి. సామ్‌కోషి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, మెడిటేషన్ అర్బిట్రేషన్ గవర్నర్స్ బోర్డు సభ్యుడు జస్టిస్ శ్రీనివాసరావులను అదివారం హనుమకొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వరంగల్ కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

'ఆరెస్పీ ఆరోపణలు అవాస్తవం'

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ బీజేపీపై ఆరోపణలు చేస్తున్నాడని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. అదివారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌ను దేశంలోనే అత్యధిక అవినీతి పార్టీగా విమర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారని విమర్శించారు. చర్యలు తీసుకోకపోవడానికి కారణం కాంగ్రెస్- బీఆర్ఎస్ మధ్య ఉన్న చీకటి ఒప్పందమన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, వరంగల్ అధ్యక్షుడు మార్టిన్ లూథర్, జన్ను మధు, శివకృష్ణ, వెంకటేశ్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

భార్యే సూత్రధారి..

- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని హత్యాయత్నం
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రావు

మట్టెవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరంగల్ పోతననగర్ సమీపంలో జరిగిన హత్యాయత్నం కేసులో మట్టెవాడ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందులో భార్యే సూత్రధారి అని నిర్ధారించారు. కేసు వివరాలను ఆదివారం సాయంత్రం మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రావు వెల్లడించారు. వరంగల్ రామన్నపేటకు చెందిన గంగారబోయిన రాజుకు జమ్మికుంట మండలం మోత్కులగూడెంనకు చెందిన పోతుల సందీప్‌కు మూడేళ్ల కిందట పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో రాజు భార్య పద్మకు సందీప్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న రాజును తొలగించుకునేందుకు ఇద్దరు కలిసి పథకం రచించారు. ఆగస్టు 14న సందీప్.. తన స్నేహితులు ప్రమోద్, షబ్బీర్, స్వర్ణకార్‌లతో కలిసి రాజును వరంగల్ పోతననగర్ డంపింగ్ యార్డ్ వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించారు. అనంతరం అందరూ కలిసి రాజు గొంతు నులిమి చంపే ప్రయత్నం చేశారు. ఈలోగా స్థానికులు రావడంతో వదిలేసి వెళ్లిపోయారు. నేరుగా పద్మ ఇంటికి వెళ్లి ఆమె వద్ద రూ.9లక్షలు తీసుకుని సందీప్‌తో వచ్చిన స్నేహితులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇచ్చారు. అనంతరం పద్మ, సందీప్ ఇద్దరూ కలిసి పరారయ్యారు. ఈలోగా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు రాజును ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం ప్రధాన నిందితులైన సందీప్, పద్మలను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.5.40లక్షలు, ఓ కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

క్రీడాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

న్యూశాయంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు నాగవెల్లి సారంగపాణి కుటుంబానికి నాయీబ్రాహ్మణ ఉద్యోగుల పరపతి సంఘం నాయకులు ఆదివారం ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ పరపతి సంఘం తరుపున రూ.10వేలను పోస్టాఫీస్ డిపాజిట్ ద్వారా సారంగపాణి కుమార్తె మహాలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ పరపతి సంఘం నాయకులు మొగిలిచెర్ల శ్రీధర్, జంపాల యుగేందర్, మేడిపెల్లి మురళీధర్, సింగారపు కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సారంగపాణి కూతురికి ఆర్థికసాయం అందిస్తున్న నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల పరపతి సంఘం నాయకులు

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

- బోనమెత్తిన వడ్డెపల్లి, కాజీపేట
- శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు



వడ్డెపల్లిలో పోచమ్మ బోనాల వేడుకల్లో నృత్యం చేస్తున్న పోతరాజులు



కాజీపేటలో మొక్కులు చెల్లించుకుంటున్న స్థానికులు

వడ్డెపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డప్పు చప్పుళ్లు.. బాజా భజంత్రీలు.. డీజే సౌండ్స్.. పంబాల వారి పాటలు.. ఆచరమంతుల ఆటలు.. పోతురాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలతో వెరసి వడ్డెపల్లి పరవశించింది. శ్రావణమాసం చివరి ఆదివారం హనుమకొండలోని వడ్డెపల్లిలో పోచమ్మ బోనాల వేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా, భక్తి ప్రపత్తులతో భక్తులు నిర్వహించుకున్నారు. ప్రత్యేక ఆకర్షణగా పోతురాజులు ఫలహారం బండి నిలిచింది. హనుమకొండ వడ్డెపల్లి మెయిన్ రోడ్డులోని మండల ఆఫీస్ నుంచి వడ్డెపల్లి గ్రామంలోని పోచమ్మ దేవాలయం వరకు డప్పు చప్పుళ్లతో మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని నృత్యాలు చేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాలతో వడ్డెపల్లి పులకించి పోయింది. ఫలహారం బండికి మేక పోతులను కట్టి దేవాలయం వరకు తరలించారు. భక్తులంతా ఆలయానికి చేరుకొని అమ్మవారికి ఇష్టమైన పప్పు, బెల్లం, పసుపు, కుంకుమలు, బెల్లం శాక, నూతన వస్త్రాలు, కొబ్బరి కాయలు, నైవేద్యాన్ని సమర్పించారు.

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ - రేవతి దంపతులు, 60వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ దాస్యం అభినవ్ భాస్కర్- మాధురి దంపతులతోపాటు తల్లి సబిత భాస్కర్, సోదరి అపూర్వ భాస్కర్, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయ్ భాస్కర్, ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ శ్రేణులు ఎనుకొంటి పున్నం చందర్, మండల సమ్మయ్య, జనగాం శ్రీనివాస్ గౌడ్, బుస్స నవీన్, బోడ ప్రసాద్, బీజేపీ శ్రేణులు నాగపురి అశోక్, రేకుల సతీష్, మట్టెపల్లి రాంరాజ్, యాదగిరి తదితరులు అమ్మవారిని దర్శించుకొని కొలిచి ప్రత్యేక పూజలు చేసి కట్న కానుకలు సమర్పించారు.

కాజీపేటలో..

కాజీపేట (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో ఆదివారం పోచమ్మ బోనాలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలసి ఆలయాలకు వెళ్లి బోనం సమర్పించారు. దీంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. మహిళలు అమ్మవారికి చీరె సారె సమర్పించారు. యువత డప్పు చప్పులు, డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. బాపూజీనగర్‌లో కోండ్ర శంకర్ మిత్రమండలి ఆధ్వర్యంలో పోతరాజులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పోతరాజుల నృత్యాలు చేస్తున్న క్రమంలో స్థానిక యువత వారితో ఫొటోలు తీసుకునేందుకు పోటీలు పడ్డారు. సోమిడిలో ఇంటినుంచి అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న క్రమంలో వర్షంతో రోడ్డు బురదమయంగా ఉండడంతో స్థానిక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వెలిబుచ్చారు. గుడి ప్రధాన రహదారిపై రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు. కాజీపేటలోని విష్ణుపురి, బాపూజీనగర్, భవానినగర్, రహ్మత్‌నగర్, వెంకటాద్రినగర్‌తో పాటు అన్ని కాలనీలలో పోచమ్మదేవాలయంలో మహిళలు మొక్కులు సమర్పించడంతో ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది.

బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన జేఎన్ఎస్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్ఎస్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా సాంబరాజ్ రాజ్‌కుమార్, ఏరుకొండ రవి, కోశాధికారిగా పోశాలు, ఉపాధ్యక్షులుగా జ్యోతిరావు, కె.జితేంద్రనాథ్, జాన్సన్, బి.రామ్మూర్తి, రవి, సంయుక్త కార్యదర్శులు ఎన్.దశరథం, ఎన్.శ్యామ్, సంపత్, ఈసీ మెంబర్లుగా డి.రవికుమార్, లక్ష్మణ్‌కుమార్, ఎస్‌డీ. అక్తర్, రమేష్, జి.రాంచందర్ ముఖ్య సలహాదారులుగా ఎడ్ల సురేందర్, ఎం.డి. దస్తగిర్, సాంబమూర్తిలను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, రవిలు మాట్లాడుతూ.. దశాబ్దాల చరిత్ర కలిగిన జేఎన్ఎస్‌లోని జిమ్ అభివృద్ధితో పాటు అన్ని విధాలుగా ఆధునీకరణ చేపట్టి పూర్వ వైభవం తీసుకవస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, సీనియర్ సిటిజన్స్, వాకర్స్ పాల్గొన్నారు.

రాజాజీనగర్‌లో సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 52వ డివిజన్‌లో నూతనంగా ఎన్నికైన రాజాజీనగర్ కాలనీ కమిటీ అసోసియేషన్ సభ్యులు అదివారం స్థానిక కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు చేపట్టబోయే పనుల గురించి వివరించినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు క్రిష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, గౌరవధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీరాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, జగదీశ్వర్, కార్యదర్శి రవీందర్, సహాయ కార్యదర్శులు, సలహాదారులు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ ఎన్నిక



రఘుపతిరెడ్డి

వడ్డెపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 60వ డివిజన్ వడ్డెపల్లిలోని టీచర్స్ కాలనీ ఫేస్-1, ఎస్‌బీహెచ్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక దేవాలయంలో జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా చిర్ర రఘుపతిరెడ్డి, వైస్ చైర్మన్లుగా బి.సత్యనారాయణ, పింగిళి స్వరూపరాణి, ప్రధాన కార్యదర్శిగా డి.జితేందర్‌రెడ్డి, కోశాధికారిగా బి.రవీందర్, సంయుక్త కార్యదర్శులుగా వి.చిరంజీవులు, వి.నవనీత ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి డాక్టర్ జి.కిషన్‌రావు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా నిర్మల, సరిత, రుద్ర, మాధవి, పార్వతి, వసంత, మల్లారెడ్డి, రామానుజచారి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణలు ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు.

సర్వాయి పాపన్న ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా వేణుగోపాల్‌గౌడ్



వడ్డెపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్‌ను సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నెల 18న హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను నిర్వహించనుంది. తన సేవలను గుర్తించి నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు వేణుగోపాల్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గౌడ కులస్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్

కేయూ క్యాంపస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి ఏడాది విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. కేయూ సెనెట్ హాల్‌లో జరిగే ప్రోగ్రామ్‌కు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ మంచాల సదానందం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్‌లు పాల్గొంటారు.

కుమార్‌పల్లిలో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొన్న చిన్నారులు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ 8వ డివిజన్ కుమార్‌పల్లి పాల జెండా ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే వేడుకలు యువతను ఆకట్టుకుంది. దీంతో డివిజన్‌లోని చిన్నారులు, యువత, మహిళలు, ఉట్టి కొట్టడానికి అమితాసక్తి చూపించి గెలుపే లక్ష్యంగా పోటీ పడ్డారు. మహిళలు కోలాటంతో అందరినీ ఆకర్శించగా, చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలు అలరించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గోస్కుల ప్రవీణ్ యాదవ్, ఉపాధ్యక్షుడు గజ్జి సాగర్, మాజీ కార్పొరేటర్ గడల సురేందర్, సభ్యులు కన్నబోయిన హరిన్‌యాదవ్, కన్నబోయిన రాజు యాదవ్, దోర్నాల నరేందర్, రాజబోయిన అశోక్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

బీఆర్‌పీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఆర్‌పీ నేతలు

వడ్డెపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారమే తమ పార్టీ లక్ష్యమని బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని బీఆర్‌పీ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో గడపగడపకూ బీఆర్‌పీ కరపత్రాలను బహుజన ఉద్యమ నేత బండి మొగిలితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలను చైతన్యపరిచి అవినీతిపై సమరశీల పోరాటాలు చేయడమే లక్ష్యంగా తమ పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బుర్రి సాగర్, అంకేశ్వరపు రమేష్, పూరెళ్ల రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్ల రవి, పీసరి రజిత, రాష్ట్ర , జిల్లా నాయకులు లావుడ్య మధూకర్, ఎమ్డీ సహీదా, శ్రీకాంత్, యుగంధర్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శనగర్ కాలనీ ఏరియాలో ఉదయం 11 గంటట నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట, జేఎస్ఎం స్కూల్, జూపార్క్ ఏరియాలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

పైడిపల్లిలో విరబూసిన బ్రహ్మ కమలాలు



పోచమ్మమైదాన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని కూనమల్ల సారంగపాణి నివాసంలో ఆదివారం అరుదైన బ్రహ్మ కమలాలు విరబూశాయి. హిమాలయాల్లో మాత్రమే కనిపించే ఈ అరుదైన పుష్పాలు వికసించడంతో వాటిని వీక్షించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా తమ నివాసంలో బ్రహ్మ కమలాలు వికసిస్తున్నట్లు తెలిపారు.

సంఘీభావ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్‌సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న ఆదివాసీ సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్‌భవన్‌లో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం కాశిబుగ్గ జంక్షన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంగుల యాకర్(ఐఎఫ్‌టీయూ), గుడిమల్ల క్రాంతి (పిడిఎం), కోరిక ఉదయ్ సింగ్(పీడీఎఫ్), రమ (చైతన్య మహిళాసంఘం), కొంపల్లి ప్రవీణ్ (పౌర సంఘం నాయకులు) పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్ ఫార్మసీ విభాగంలో కీలక సదస్సులు

కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఆగస్టు 19, 20, 21 తేదీల్లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా కేయూ ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఫార్మసీ రంగంలో వస్తున్న కీలక మార్పులు, పరిణామాలపై సదస్సులు, విస్తృత ఉపన్యాసాలు నిర్వహిస్తామని కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, కేయూ ఫార్మసీ ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి, సీనియర్ ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డిలు తెలిపారు. ఆగస్టు 19న మొదటి రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 2.45 గంటల వరకు వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల అర్థీషియా విభాగాధిపతి, సీనియర్ గైనకాలజిస్టు ప్రొఫెసర్ రామా సరళాదేవి హాజరై గర్భాకోశ క్యాన్సర్ రాకుండా ముందస్తు చర్యలు- స్కానింగ్‌లపై కీలక ఉపన్యాసం చేస్తారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి యూఎస్ఏలోని టెక్సాస్ యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ డి.సాంబరెడ్డి స్టెరాయిడ్స్ పనితీరు- వాటి దుష్ప్రభితాలపై కీలక ప్రసంగం చేస్తారు. తర్వాత ఓరల్ ప్రజంటేషన్‌లు ఉంటాయని తెలిపారు.

ఆగస్టు 20న రెండో రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 2.30 గంటల వరకు ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వి.చంద్రశేఖర్ హాజరై లంగీవీటి అండ్ సస్టైనబుల్ హెల్త్ అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేస్తారు. హైదరాబాద్ బిట్స్ పిలానీ ప్రొఫెసర్ నితీశ్ గుప్తా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, వాటి చికిత్స అనే అంశంపై ప్రసంగిస్తారు. అలాగే మధ్యాహ్నం 3.45 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఐఐసీటీ హైదరాబాద్ సీనియర్ సైంటిస్టు ప్రొఫెసర్ లింగయ్య నాగరపు హాజరై ఇండియన్ ఫార్మవిజన్ ఇన్నోవేషన్ అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని పల్స్ ఫార్మస్యూటికల్ సైంటిస్టు, కేయూ రిటైర్డు ఫార్మసీ ప్రొఫెసర్ రాంబాబు దేవరాజు హాజరై భవిష్యత్‌లో కొత్త ఔషధాలు కనుగొనడం ఎలా అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మూడు రోజులు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సులకు ఫార్మసీ విభాగంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అకడమిక్ పరంగా, రీసెర్చ్ పరంగా స్కాలర్లకు, ఫార్మాడీ విద్యార్థులకు, ఫార్మసీ విద్యార్థులకు సదస్సు ఎంతో ఉపయోగపడుతోందని వారు తెలిపారు.

ఉత్తరేణి ఉపయోగాలెన్నో!

మన చుట్టూ మనకు ఉపయోగపడేవి ఎన్నో ఉంటాయి. కానీ వాటి గురించి తెలియక పనికి రావనుకుంటాం. అలాంటి ఓ మొక్కే ఉత్తరేణి. అందరూ దీనిని పిచ్చి మొక్క అంటూ పీకి పడేస్తూ ఉంటారు. కానీ దీని వలన అనేకప్రయోజనాలు ఉన్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం..



ఉత్తరేణి మొక్కను క్లాక్ ప్లాంట్ అని కూడా అంటారు. ఇది రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో, పొలాల్లో విరివిగా పెరుగుతుంది. ఈ మొక్కను అందరూ కలుపు మొక్కగా పరిగణించి పీకేస్తూ ఉంటారు. నేలంతా పరుచుకుంటూ ఒక మీటరు ఎత్తు పెరుగుతుందీ మొక్క. దీనికి పసుపు రంగు పూలు పూస్తాయి. వాటి నుంచి చిన్న కాయలు కాస్తాయి. ఈ మొక్క ఆకులు, పువ్వులను సంప్రదాయ వైద్యంలో వాడతారు. గాయాలు, చర్మ సమస్యలను పరిష్కరించేందుకు వినియోగిస్తారు. ఈ మొక్క వేరును జ్వరం, జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు ఉపయోగిస్తారు. ఈ మొక్కలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కూడా ఉన్నాయి. ఈ మొక్క నేలంతా పరుచుకుని నేల కోతకు గురికాకుండా కాపాడుతుంది.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

ఇలాచేస్తే మచ్చలు మాయం..!

వాతావరణ కాలుష్యం వల్ల ముఖం మీద మొటిమలు వస్తుంటాయి. వీటివల్ల ఏర్పడే మచ్చలను మాయం చేయడంలో బియ్యప్పిండి ప్యాక్‌లు అద్భుతంగా పనిచేస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం...



● ఒక గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, చిటికెడు పసుపు, ఒక చెంచా పచ్చి పాలు వేసి పేస్టులా కలపాలి. పొడిచర్మం ఉన్నవారయితే ఒక చెంచా గులాబీ నీళ్లు కూడా కలుపుకోవచ్చు. ఈ పేస్టును ముఖానికి పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తరువాత వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ పిండిని తొలగించాలి. వెంటనే గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చర్మం మీద పేరుకున్న మృతకణాలు అలాగే మచ్చలు తొలగిపోయి ముఖం కాంతులీనుతుంది.

● ఒక గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, ఒక చెంచా కలబంద గుజ్జు, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే తగినంత తేమ అంది ముఖ చర్మం నిగారిస్తుంది. మచ్చలు, ముడతలు కూడా క్రమంగా తగ్గిపోతాయి.

● గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత పదినిమిషాలు వేళ్లతో మర్దన చేసి గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. రెండు రోజులకు ఓసారి ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద మొటిమలు రావు. మచ్చలు, పిగ్మెంటేషన్ కూడా తగ్గుతాయి.

సంకల్పం



పర్వతారోహకురాలిగా కిలిమంజారో అధిరోహించిన అనుభవం. రైడర్‌గా సైకిల్‌పై కార్గిల్ మంచు కొండలను చుట్టివచ్చిన సాహసం. అనుకొంటే అమ్మాయిలు ఏదైనా సాధించగలరని... స్వయంకృషితో ఎదిగి సాధికారత వైపు అడుగులు వేయగలరని నిరూపించే ప్రయత్నం. వెన్నెల బాణోతు... సామాజిక మార్పే సందేశంగా... మహిళా చైతన్యమే లక్ష్యంగా... తెలుగు రాష్ట్రాల్లో మరోసారి సైకిల్ యాత్ర చేపట్టారు... వెన్నెల బాణోతు. ఐదువేల కిలోమీటర్ల యాత్రలో భాగంగా ఇప్పటికి సగానికి పైగా పూర్తి చేసుకున్న వెన్నెలతో 'నవ్య' మాట కలిపింది.



లక్ష్యం... మహిళా చైతన్యం

"చిన్నప్పుడు ఎన్నో కలలు... సోలో ట్రావెలింగ్ చేయాలని. పర్వతాలు అధిరోహించాలని. వాటిని నిజం చేసుకొనే క్రమంలో ఎన్నో అవహేళనలు, అవమానాలు. కానీ ఆత్మస్థైర్యంతో నిలబడి, కుటుంబం మద్దతుతో అన్నిటినీ అధిగమించాను. కామారెడ్డి జిల్లా సోమారం పేట మాది. అమ్మ భూలి... వ్యవసాయం చేస్తుంది. నేను, అన్నయ్య... ఇద్దరు సంతానం. కరోనా సమయంలో నాన్న చనిపోయారు. అప్పటి నుంచీ కుటుంబ భారం అమ్మపై పడింది. నేను బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నా. ప్రస్తుతం మహిళా సాధికారత నినాదంతో సైకిల్ యాత్ర చేస్తున్నాను. దాంతోపాటు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని చెబుతూ వాహనదారుల్లో చైతన్యం నింపుతున్నాను. జూన్ 14న హైదరాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమైంది. ఈ నెల 16 నాటికి 2,871 కిలోమీటర్లు ప్రయాణించి, కరీంనగర్ చేరుకున్నాను. మొత్తం ఐదు వేల కిలోమీటర్ల ఈ యాత్రను శ్రీశైలంలో ముగించాలని అనుకొంటున్నా. వనపర్తి, జోగులాంబ గద్వాల్ తరువాత కర్నూలులోకి ప్రవేశించాను. నంద్యాల, తిరుపతి, ఒంగోలు, అరకు, విశాఖపట్టణం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం వరకు వెళ్లాను. ఏపీలోని దాదాపు అన్ని ప్రధాన పట్టణాలకూ వెళ్లాను. రోజుకు సగటున 60 నుంచి 70 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నా. ఉదయం ఆరు గంటలకు మొదలుపెట్టి, సాయంత్రం ఆరు గంటలకు ఆపేస్తాను. యాత్ర కోసం కాలేజీలో మూడు నెలలు అనుమతి తీసుకున్నా. వాతావరణ మార్పులవంటి అనూహ్య పరిస్థితులు ఎదురైతే దూరం, సమయం పెరగవచ్చు.



నీవల్ల కాదన్నవారే...

నేను పర్వతారోహణ చేస్తానంటే కొందరు నీవల్ల ఏమవుతుందని అన్నారు. సోలో ట్రావెలింగ్ ఎంచుకొంటే తక్కువ చేసి మాట్లాడారు. నేను కాస్త పొట్టిగా ఉంటాను. కనుక ఇలాంటివి నేను చేయలేనని కొందరు నిర్ధారణకు వచ్చేశారు. అసలు కారణం... ఒక ఆడపిల్ల ఇంతటి సాహసం చేయడం అలాంటివాళ్లకు నచ్చదు. ఎత్తిపొడుపు మాటలతో నిరుత్సాహపరచాలని చూస్తారు. నా కలలను నిజం చేసుకోవడానికి, నన్ను నేను నిరూపించుకొని, నాలాంటి ఆడపిల్లలను తక్కువ అంచనా వేసి, చులకనగా చూసేవారి నోళ్లు మూతలు పడేలా సమాధానం చెప్పడానికి సోలో ట్రావెలింగ్ మొదలుపెట్టాను. మహిళా సాధికారత నినాదం తీసుకున్నాను. పర్వతారోహణలో కూడా శిక్షణ తీసుకున్నాను. అప్పుడు కూడా కొందరు... 'నువ్వు నీ బ్యాగ్ అంత ఎత్తు లేవు. దాన్ని ఎత్తడమే నీకు కష్టం. ఇక మౌంటెనీరింగ్ ఏం చేస్తావ్' అంటూ అవమానించారు. ఆ మాటలు నాలో కసిని, పట్టుదలను పెంచాయి. రెండేళ్ల కిందట ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తయిన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి చూపించాను. నాడు విమర్శించినవారే అభినందనలు తెలిపారు.

కార్గిల్ టు కన్యాకుమారి...

ఇదే నా మొదటి సైకిల్ రైడ్ కాదు. 2022లో ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ ఇచ్చిన 'సేవ్ సాయిల్' (మట్టిని కాపాడదాం) నినాదంతో తెలంగాణ మొత్తం... ఐదు వేల కిలోమీటర్లు చుట్టివచ్చాను. గత ఏడాది పద మూడు మంది బృందంతో కలిసి కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటించాను. 3,800 కిలోమీటర్ల ఆ యాత్రను 23 రోజుల్లో పూర్తి చేశాం. అయితే ఒక మహిళగా రెండు మూడు నెలలపాటు ఇల్లు వదిలి, ఒంటరిగా ప్రయాణించడం అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఎక్కువగా నేను రాత్రి పూట పెట్రోలు బంకుల్లో క్యాంప్ టెంట్ వేసుకొని బస చేస్తుంటాను. దానివల్ల ఖర్చు తగ్గుతుంది. కుదరకపోతే హోటల్‌లో రూమ్ తీసుకొంటాను. ఒక్కోసారి కొందరు తమ ఇళ్లకు ఆహ్వానిస్తారు. ఎక్కడ బస చేసినా... నా లొకేషన్ ఇంట్లోవాళ్లకు పంపిస్తాను. వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తాను. నాకున్న ప్రధాన లక్షణం ఏంటంటే... దేనికీ భయపడను.

> **ఎవరెస్ట్ అధిరోహించాలి...**
>
> ప్రస్తుత యాత్ర తరువాత ఆలిండియా సైకిల్ రైడ్ చేయాలని ఉంది. అలాగే ఎవరెస్ట్ పర్వతం అధిరోహించాలనేది నా చిరకాల స్వప్నం. అయితే అందుకు తగిన నిధులు లేక సన్నాహకాలు ఇంకా ప్రారంభించలేదు. కిలిమంజారో ఎక్కాలనుకున్నప్పుడు నిధులు సమకూర్చుకోవడానికి నాలుగేళ్లు పట్టింది. తరువాత కూడా పర్వతారోహణ కొనసాగించాలని అనుకున్నా. కానీ ఎంత ప్రయత్నించినా డబ్బు సర్దుబాటు కాకపోవడంతో సైకిల్ యాత్ర మొదలుపెట్టాను. ఎప్పటికైనా ఎవరెస్ట్ కలను నిజం చేసుకొంటాను.

సవాళ్లు ఎన్నో..

ఏకధాటిగా సైకిల్ తొక్కడమంటే సులువు కాదు. ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. ఒళ్లు నొప్పులు, వ్యాధులు వచ్చే అవకాశాలు అధికం. రహదారి మీద భారీ వాహనాలు వేగంగా తిరుగుతుంటాయి. కొంత మంది మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తుంటారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. లేదంటే ప్రాణాలకే ముప్పు. మధ్యలో సైకిల్‌కు రిపేర్లు వస్తుంటాయి. టైర్లు పగిలిపోతుంటాయి. నేను బాగా ఇబ్బంది పడింది... అరకు ఘాట్ రోడ్డులో. ఎగువకు వెళ్లేటప్పుడు సైకిల్‌ను బలంగా తొక్కాలి. దానివల్ల ఎక్కడ చైన్ తెగిపోతుందోననే భయం. ఇప్పటివరకు ఆ ఘాట్‌లో ఎవరూ సైక్లింగ్ చేయలేదట. అలాంటిది నేను చేశానంటే గర్వంగా అనిపించింది.

భయపడితే సాధించలేం...

నిరుత్సాహపరిచేవారు ప్రతిచోటా ఉంటారు. కానీ వారి మధ్యనే ప్రోత్సహించేవారూ ఉంటారు. 'ఒక అమ్మాయి ఇంతటి సాహసం చేస్తోంది. సమాజ హితం కోసం తనవంతుగా ప్రయత్నిస్తోంది' అని చాలామంది అభినందిస్తుంటారు. నా వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తుంటాను. అవి చూసి నాలాంటివారు కొందరు స్ఫూర్తి పొందామని మెసేజ్‌లు పెడుతుంటారు. కొందరేమో 'నాకూ అలాంటి కలలు ఉన్నాయి. కానీ పెద్దవాళ్లు వద్దంటున్నారు' అని నిరాశతో మాట్లాడుతుంటారు. వాళ్లకు నేను చెప్పేది ఒక్కటే... మహిళ ఎదుగుదలలో కుటుంబ మద్దతు ముఖ్యమనేది నా అభిప్రాయం. ఒకవేళ ఇంట్లోవాళ్లు కాదంటే వాళ్లను ఒప్పించాలి. మా అమ్మవాళ్లు కూడా మొదట్లో వద్దన్నారు. పర్వతారోహణ అంటే... ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుందన్నారు. 'మరణం ఎప్పుడో అప్పుడు రావాల్సిందే. దానికి భయపడుతూ కలలు, ఆశయాలు పక్కన పెట్టడం తగద'ని నచ్చజెప్పాను. అర్థం చేసుకున్నారు. ఇప్పుడు నా సాహసం చూసి గర్వపడుతున్నారు."

● హనుమా

నేతన్నల ఇంటి దీపమై...

మన దేశంలోని ప్రతి ప్రాంతానికి తమవైన విలక్షణ కళారూపాలు ఉన్నాయి. ముఖ్యంగా చేనేత కళాకారుల నైపుణ్యం ఎక్కడికక్కడే ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఆ కళాకారుల ఉత్పత్తులను ఒకే చోట చేర్చి, వారికి స్థిరమైన ఆదాయం లభించేలా చేస్తున్నారు దీపా కృష్ణన్. "రాబోయే తరాల కోసం మన సంస్కృతిని పరిరక్షించడమే నా ఆశయం' అంటున్న ఆమె దేశవ్యాప్తంగా క్రాఫ్ట్ టూర్స్‌ను, వర్క్‌షాపులను కూడా నిర్వహిస్తున్నారు.



"ప్రపంచం ఆధునికత వెంట పరుగులు పెడుతోంది. ఈ ప్రభావం అన్ని రంగాల్లోనూ కనిపిస్తోంది. ముఖ్యంగా... మన హస్త కళా సంప్రదాయాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. కళాకారులకు తగిన ప్రతిఫలం లభించకపోవడమే దీనికి ప్రధాన కారణం" అంటారు దీపా కృష్ణన్. ముంబయి కేంద్రంగా పని చేస్తున్న ఆమె సంస్థ 'ద మ్యాజిక్ రూమ్' దేశంలోని వివిధ ప్రాంతాల చేనేత కళారూపాలన్నింటినీ ఒకే చోటికి చేర్చే ప్రయత్నం చేస్తోంది. కొన్ని వందల మంది కళాకారులకు ఆర్థికంగా భరోసా ఇస్తోంది.

ఒడుదొడుకులను తట్టుకొని...

ముంబయిలో పుట్టి పెరిగిన దీపకు చేనేత వస్త్రాలంటే ప్రాణం. 'నేషనల్ టాస్క్ ఫోర్స్ ఆన్ హ్యాండ్లూమ్స్'లో ఆమె సభ్యురాలు. "కొత్త ప్రదేశాలను సందర్శించడం నాకు చాలా ఇష్టం. అందులోనే కెరీర్ వెతుక్కోవాలని... ఇరవయ్యేళ్ళ క్రితం ఒక టూరిజం కంపెనీ స్థాపించాను. దేశంలో పలు ప్రాంతాలకు వెళ్ళినప్పుడు... గ్రామీణ ప్రాంతాల్లోని చేనేత కళాకారులు, డిజైనర్లు, వ్యాపారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. భారతీయ చేనేత వస్త్రాల వైవిధ్యం సాటిలేనిదని అప్పుడే అర్థమయింది" అంటున్నారు దీప. కరోనా కారణంగా... ఆ కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అప్పుడే ఆమె దృష్టి చేనేత కళమీద పడింది. 'ద మ్యాజిక్ రూమ్' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ముంబయి, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని చేనేత కళాకారులతో వస్త్రాలు తయారు చేయించారు. మరోవైపు అల్పాదాయ వర్గాల మహిళలకు వివిధ హస్త కళల్లో శిక్షణ ఇప్పించారు. వారికి స్థిరమైన ఆదాయం లభించేలా చేశారు. అయితే ఇది అంత సులువుగా జరిగిపోలేదు. ముఖ్యంగా ఆర్థికమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ ఆ ఒడుదొడుకులన్నిటినీ తట్టుకొని... తన లక్ష్యం వైపు ఆమె పయనించారు.

అది మన బాధ్యత...

"భారతదేశంలోని హస్త కళారూపాలన్నీ, ప్రధానంగా అన్ని రకాల చేనేత వస్త్రాలు ఒకే చోట లభించేలా చూడాలనేది నా కల. దీనికోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, గుజరాత్, బిహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్... ఇలా వివిధ రాష్ట్రాలు తిరిగాను. చేనేత కళాకారులకు పెట్టుబడి అందించి... వివిధ రకాల వస్త్రాలు తయారు చేయించాను. పులియాకు చెందిన చేనేత జమ్దానీ, కచ్‌కు చెందిన అజ్రక్, అసోంకు చెందిన ఎరీ సిల్క్, శాంతినికేతన్ నుంచి కాంతా దుపట్టా, మధుబని హ్యాండ్ ప్రింటెడ్ తుస్సార్ సిల్క్... ఇలా ఎన్నో రకాల వస్త్రాలను తయారు చేయించి, ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తున్నాను. దీని ద్వారా 500 మందికి పైగా కళాకారులకు నిలకడైన ఉపాధి లభిస్తోంది. చేనేత సహకార సొసైటీలు, ఎన్జీవోలు, ఉత్పత్తి బృందాలు, స్వతంత్రంగా పని చేసే కళాకారులు... ఇలా ఎంతో మందితో మేము కలిసి పని చేస్తున్నాం. హ్యాండ్లూమ్ అనేది కేవలం ఒక వస్త్రం కాదు... దానికి ఒక తనదైన చరిత్ర, గుర్తింపు ఉన్నాయి. వాటిని కాపాడుకోవడం మన బాధ్యత. అందుకే దీన్ని నేను వ్యాపారంగా పరిగణించడం లేదు" అని చెబుతున్నారు దీప. వచ్చే ఆదాయంలో ఎక్కువభాగం హస్తకళలకు ప్రాచుర్యం కల్పించడానికి, ప్రోత్సాహం అందించడానికి ఆమె ఖర్చు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా క్రాఫ్ట్, టూర్స్, వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నారు. "మన కళల ప్రాధాన్యం, వాటి మూలాలు పట్టణ ప్రజలకు తెలియాలి. అప్పుడే వారు వాటితో మమేకం అవుతారు" అంటున్న దీప తమ 'మ్యాజిక్ హబ్'ను భారతీయ కళా, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు వేస్తున్నారు.

పిల్లలను బాధ్యతాయుతంగా పెంచాలి..!



తల్లిదండ్రుల పెంపకం మీదనే పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందుకే చిన్నప్పటి నుంచీ పిల్లలకు క్రమశిక్షణ, మంచి అలవాట్లు నేర్పించాలి. పిల్లలను బాధ్యతాయుతంగా పెంచడంలో తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

● పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలి. వాళ్లమీద కోపంతో అరవకూడదు. అజమాయిషీ చేయకూడదు. పిల్లలకు స్నేహ హస్తాన్ని అందిస్తూనే తప్పులను సరిచేస్తూ జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇంట్లో సంతోషకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి. అప్పుడే పిల్లలు తమ భావాలను స్పష్టంగా చెప్పగల్గుతారు.

● పిల్లలను ఇతరులతో పోల్చకూడదు. పిల్లల్లో ఉన్న ప్రత్యేకమైన తెలివితేటలను ఆసక్తిని గుర్తించి తగిన ప్రోత్సాహాన్ని అందించాలి.

● చెప్పిన పనులు చేయకుండా ఒక్కోసారి పిల్లలు మొండికేస్తూ ఉంటారు. అలాంటి సమయాల్లో పిల్లలను దగ్గర కూర్చోపెట్టుకుని బుజ్జగింపు ధోరణిలో పనులు చెప్పి చేయించాలి. ఆ పనులు పూర్తిచేసిన తరువాత కృతజ్ఞతా పూర్వకంగా మాట్లాడితే పిల్లలు సంబరపడతారు. మరోసారి చెప్పిన వెంటనే పనులు చేసేస్తారు కూడా!

● తోటివారితో స్నేహంగా ఉండడం, అవసరమైతే సహాయ సహకారాలు అందించడం లాంటివాటిని పిల్లలకు నేర్పించాలి. కష్టపడడం, నాయకత్వ లక్షణాలు, సమష్టి కృషి ఆవశ్యకతలను వివరించాలి.

● సొంత అభిరుచులు, ఆశయాలను పిల్లలమీద రుద్దకూడదు. దీనివల్ల పిల్లల్లో ఒత్తిడి పెరిగి వారి సృజనాత్మక శక్తి దెబ్బతింటుంది. పిల్లల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి. వాళ్లకి ఇష్టమైన రంగంలో ఎదిగేలా తోడ్పాటును అందించాలి. ఇలాంటి బాధ్యత పిల్లల మనసుల్లో చెరగని ముద్ర వేస్తుంది.

కాళ్లతో బాణాలు వేస్తూ...

ప్రేరణ



చాలామంది చిన్న చిన్న సమస్యలకే భయపడి వెనకడుగు వేస్తారు. కానీ జమ్ము కాశ్మీరుకు చెందిన శీతల్ దేవి, తనలోని శారీరక లోపాన్ని అధిగమించి, నలుగురికీ స్ఫూర్తినిస్తున్నారు. రెండు చేతులూ లేకపోయినా కాళ్లతో బాణాలు వేస్తూ పతకాలు కొల్లగొడుతున్న ఆమె ప్రస్థానమిది..

శీతల్ దేవి.. జమ్మూకశ్మీర్‌లోని ఓ మారుమూల ప్రాంతంలో నిరుపేద కుటుంబంలో పుట్టారు. తండ్రి వ్యవసాయం చేస్తే, తల్లి మేకల కాపరిగా కష్టపడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శీతల్‌కు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. దాంతో ఆమె తల్లిదండ్రులు ఎంతో బాధపడ్డారు. అయినా కూతురికి ధైర్యం చెప్పి అన్ని విషయాల్లో ప్రోత్సహించారు. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు ఓసారి వైద్యం కోసం బెంగళూరు వెళ్లారు శీతల్. అక్కడే ఆమెకు ప్రీతి అనే ఆర్చర్ పరిచయమయ్యారు. ప్రీతి, శీతల్‌కు పారా క్రీడల గురించి, పారా ఆర్చరీ గురించి చెప్పారు. అలా శీతల్‌కు ఆర్చరీ పరిచయమయింది. తరువాత శీతల్.. జమ్మూలోని శ్రీ మాత వైష్ణో దేవీ ష్రైన్ బోర్డ్‌కు వెళ్లారు. "అక్కడ నాలా శారీరక లోపాలే కాక మానసిక సమస్యలున్నవారు కూడా ఆర్చరీ నేర్చుకోవడం చూసి ప్రేరణ పొందాను. మొదట్లో ఆర్చరీ కష్టంగా అనిపించింది. నావల్ల కాదేమో అనిపించింది. కానీ మా కోచ్‌లు కుల్దీప్, అభిలాష్ చౌదరి నన్నెంతో ప్రోత్సహించారు. కాళ్లతో విలు విద్య సాధ్యమేనని నాలో ధైర్యం నూరిపోశారు. చేతులు లేకపోయినా కాళ్లతో బాణాలు వేసే ప్రపంచంలోని తొలి ఆర్చర్‌గా గుర్తింపు పొందిన, అమెరికన్ ఆర్చర్, మాట్ స్టుట్జ్‌మ్యాన్ వీడియోను కుల్దీప్ నాకు చూపించారు. అది చూశాక నాలో పట్టుదల పెరిగింది" అని చెప్పుకొచ్చారు శీతల్. ఆమెలోని పట్టుదలను చూసిన కోచ్ కుల్దీప్, ఆమె కోసం ప్రత్యేకమైన విల్లును తయారు చేయించారు. తరువాత ఆరునెలల్లోనే విలు విద్యలో శీతల్ దేవి ఆరితేరారు. "ఆర్చరీ నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆర్చరీ వలనే నేను ఎంతో మందికి తెలిశాను. వేరే వారిని చూసి నేను ప్రేరణ పొందాను. అలాంటి నేను ఇప్పుడు ఇంకొందరికి ప్రేరణ కావడం చాలా ఆనందంగా ఉంది" అంటున్నారు శీతల్.

> **ఆడపిల్లల్ని ప్రోత్సహించాలి..**
>
> 
>
> "సాధారణంగా గ్రామాల్లో ఆడపిల్లలను బయటకు రానివ్వరు. ఆడవాళ్లు ఏం సాధించగలరని అనుకుంటూ ఉంటారు. కానీ ఆడవాళ్లు ఏమైనా సాధించగలరు. దేశానికి పతకాలు కూడా తీసుకురాగలరు. అయితే అవన్నీ జరగాలంటే మొదట తల్లితండ్రులు తమ కూతుళ్లను నమ్మాలి. ఆపై ప్రోత్సహించాలి. అలాగే సమయం చాలా విలువైనది. ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోకూడదు. ఓటమికి భయపడకూడదు. ఓడినా దాని నుంచి పాఠం నేర్చుకుని విజయం వైపు సాగాలి" అంటున్నారు శీతల్.

ఎన్నో పతకాలు..

ప్రపంచవ్యాప్తంగా చేతులు లేకపోయినా విలువిద్యలో రాణిస్తున్న అతికొద్ది మందిలో శీతల్ ఒకరిగా నిలిచారు. పలు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పతకాలు సాధించారు. యూరోపియన్ పారా ఆర్చరీ కప్‌లో రజతం, వరల్డ్ పారా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రజతం, ఏసియన్ పారా గేమ్స్ 2022లో రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం తన ఖాతాలో వేసుకున్నారు. గతేడాది ప్యారిస్ పారా ఒలింపిక్స్‌లోనూ కాంస్యం సాధించారు. గతేడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శీతల్.. అర్జున అవార్డు అందుకున్నారు.

కొత్తిమీర తాజాగా...



మనం రోజూ వంటకాల్లో కొత్తిమీరను ఉపయోగిస్తూ ఉంటాం. అందుకే బజార్లో తాజాగా కనిపించినప్పుడు పెద్ద కట్టలను తెచ్చుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుంటూ ఉంటాం. కానీ రెండు రోజులకే కొత్తిమీర కుళ్లిపోతూ ఉంటుంది. అలా కాకుండా కొత్తిమీర వారం పాటు తాజాగా ఉండేలా ఎలా నిల్వ చేసుకోవాలో తెలుసుకుందాం...

● పొడవాటి గాజు గ్లాసును తీసుకుని దాని నిండా నీటిని నింపాలి. అందులో కొత్తిమీర కాడలు మునిగేలా కట్టను గ్లాసులో నిలబెట్టాలి. ఆకులకు నీళ్లు తగలకూడదు. ఈ గ్లాసుమీద ఒక ప్లాస్టిక్ కవర్ కప్పి దాన్ని చల్లని ప్రదేశంలో ఉంచాలి. ఈ గ్లాస్‌ని ఫ్రిజ్‌లో కూడా పెట్టవచ్చు. ఇలా చేస్తే కొత్తిమీర చాలా రోజుల వరకు తాజాగా ఉంటుంది.

● కొత్తిమీరను తెచ్చిన వెంటనే కడగకూడదు. దాన్ని ఓ పేపర్ లేదా పలుచని గుడ్డమీద పరచి తడి మొత్తం ఆరనివ్వాలి. తరువాత దాని వేర్లు, కాడలు కొద్దిగా కత్తిరించాలి. ఎండిన, కుళ్లిన ఆకులను తీసివేయాలి. ఇలా శుభ్రం చేసిన కొత్తిమీరను పొడి గుడ్డ లేదా కాగితంలో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. దీన్ని గాలి జొరబడని ప్లాస్టిక్ డబ్బాలో కూడా పెట్టవచ్చు. ఈ డబ్బాను ఫ్రిజ్‌లో పెడితే లోపల తేమ చేరుతుంది కాబట్టి డబ్బాలో ఓ కాగితాన్ని ఉంచడం మంచిది. ఇలా తేమ తగలకుండా జాగ్రత్త చేస్తే కొత్తిమీర తాజాగా నిల్వ ఉంటుంది.



గేట్-2026

దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'గేట్-2026' షెడ్యూల్ వెలువడింది. మొత్తం 30 సబ్జెక్టు పేపర్లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ ఎంట్రెన్స్‌ను గౌహతి ఐఐటీ నిర్వహిస్తోంది. ఎంట్రెన్స్‌లో సాధించిన స్కోరు, ఫలితం వెలువడిన నాటి నుంచి మూడు సంవత్సరాలపాటు వాలీడ్‌గా ఉంటుంది. ఆ స్కోరుతో మూడేళ్లలో ఎంటెక్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ తీసుకోవచ్చు.

- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2025 సెప్టెంబరు 25
- **ఎంట్రెన్స్ తేదీలు:** 2026 ఫిబ్రవరి 7, 8, 14, 15
- **ఫలితాలు:** 2026 మార్చి 19
- **వెబ్‌సైట్:** http://gate2026.iitg.ac.in/

ఎలా ప్రిపేర్ కావాలి

జాతీయ స్థాయిలో అత్యంత పోటీ ఉన్న ఎంట్రెన్స్‌ల్లో 'గేట్' ఒకటి. అభ్యర్థుల టెక్నికల్ నాలెడ్జ్‌కి ప్రామాణికంగా ఈ ఎంట్రెన్స్‌ను భావిస్తుంటారు. గేట్ అత్యంత ప్రామాణికంగా ఉండడానికి కారణం దీనిని ఐఐటీలు నిర్వహించడమే. గ్రాడ్యుయేషన్ తర్వాత ఉద్యోగం చేస్తూ చాలా మంది గేట్ ఎంట్రెన్స్ రాస్తుంటారు. ప్రశ్నలపరంగా చూస్తే ఇందులో మల్టిపుల్ చాయిస్, న్యూమరికల్ తరహా ఆన్సర్, జనరల్ రిలేటెడ్ ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి ఇంజనీరింగ్ కాన్సెప్ట్‌లు, అనలిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ ఎబిలిటీస్ పరీక్షిస్తారు. గేట్ స్కోరుతో ఉన్నత చదువులే కాకుండా ఇతర అవకాశాలు కూడా ఉంటాయి.

ప్లానింగ్: గేట్ ప్రిపరేషన్ మొదలుపెట్టే ముందే ప్రస్తుత వర్క్ షెడ్యూల్‌ను పరిశీలించుకోవాలి. రోజువారీ పనులకు పోనూ ప్రిపరేషన్‌కు ఎంతసమయం కేటాయించగలమనేది అంచనా వేసుకోవాలి. సిలబస్‌ను ముందు పెట్టుకుని సరైన పద్ధతిలో విభజించుకుని, వీక్లీ, మంత్లీ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలి.ఉదాహరణకు ఈ వారం, నెలలో పూర్తిచేయాల్సిన చాప్టర్లు, లేదా సబ్జెక్టులు అని ప్లాన్ చేసుకోవాలి.

సరైన స్టడీ మెటీరియల్: అభ్యర్థి తాను రాసే ఇంజనీరింగ్ సబ్జెక్టుకు సంబంధించి సరైన మెటీరియల్‌ను ఎంచుకోవాలి. దీనికి సంబంధించి కోచింగ్ సెంటర్ల మెటీరియల్ ఉంటుంది. అలాగే చాలా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. గూగుల్‌లో సెర్చ్ చేస్తే వాటికి సంబంధించిన వివరాలు అందుబాటులోకి వస్తాయి.

మొబైల్ యాప్స్, ఆన్‌లైన్ మెటీరియల్: గేట్ అకాడమి, టెస్ట్ బుక్, గ్రేడ్‌అప్, తదితర యాప్స్‌లో స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంటుంది. అలాగే మాక్‌టెస్ట్‌లు, ప్రాక్టీస్ ప్రశ్నలు లభిస్తాయి.

మాక్‌టెస్ట్‌లు: రోజు థియరీ చదవడం, ప్రశ్నలు పూరించడం చేయడంతో ప్రిపరేషన్ పూర్తయినట్లు కాదు. గత సంవత్సర ప్రశ్న పత్రాలు, మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల టైమ్ మేనేజ్‌మెంట్‌తోపాటు బలహీనంగా ఉన్న చాప్టర్లను గుర్తించడం సులువు అవుతుంది. తరవాత తప్పులను పరిశీలించుకుంటే ఎక్కడ మెరుగు పరుచుకోవాలో అర్థం అవుతుంది. మాక్ టెస్ట్‌లు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.

స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మోటివేషన్: ప్రిపరేషన్‌లో మోటివేషన్ ఉండాలంటే ఇప్పటి వరకు ఎంత సిలబస్ పూర్తి చేశారు అనేది పరిశీలించుకుంటూ ఉండాలి. రోజువారీ, నెలవారీ లక్ష్యాలను ఎలా అందుకున్నది చూసుకుంటే మరింత ఉత్సాహం కలుగుతుంది. మాక్‌టెస్ట్‌ల్లో లభించిన స్కోరుతో లక్ష్యాన్ని ఎంత వరకు చేరుకున్నామో అర్థం అవుతుంది. అలాగే మంచి స్టడీ గ్రూప్‌లో చేరడం, లేదా ప్రిపేర్ అయ్యే వ్యక్తులతో కలిసి చదువు సాగిస్తే మోటివేషన్ లభిస్తుంది.

అకడమిక్ అవకాశాలు

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ తర్వాత విద్యార్థులకు పలు అవకాశాలు ఉంటాయి. అందులో పాపులర్ ఆప్షన్ మాత్రం పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్.

ఇంజనీరింగ్ పీజీ

- **మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్)/ మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ):** కాల పరిమితి రెండేళ్లు. ఈ కోర్సు చేయడానికి బీటెక్/బీఈతోపాటు గేట్ స్కోరు ఉండాలి. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలతోపాటు బిట్స్ పిలానీ, డీటీయూ, జాదవ్‌పుర్ యూనివర్సిటీ, అన్నా వర్సిటీ మొదలైనవి ఉన్నాయి.

స్పెషలైజేషన్లు: సీఎస్ఈ, ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్, పవర్ సిస్టమ్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, థెర్మల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ మొదలైనవి.

- **మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్సీ)/ ఎంఎస్(రీసెర్చ్):** ఐఐఎస్సీ, ఐఐటీ, కొన్ని యూనివర్సిటీలు వీటిని అందిస్తున్నాయి. పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి ఇది సరైన కోర్సు. గేట్ లేదా ఆయా సంస్థలు పెట్టుకునే పరీక్షల ద్వారా అడ్మిషన్ లభిస్తుంది.

ఇతర అవకాశాలు

- **పబ్లిక్ సెక్టార్‌లో ఉద్యోగాలు:** ఓఎన్‌జీసీ, బీహెచ్ఈఎల్, ఐఓసీ, గెయిల్, డీఆర్‌డీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజస్‌లు తమ టెక్నికల్ విభాగాల్లో నేరుగా 'గేట్' ర్యాంకర్లకు ఉద్యోగాలు ఇస్తారు.
- **అంతర్జాతీయ అవకాశాలు:** గేట్‌లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుంది. అలాగే విదేశీ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్(ఎన్‌యూఎస్), ఈటీహెచ్ జ్యూరిచ్ తదితర విద్యా సంస్థలు 'గేట్' స్కోరును అంగీకరిస్తాయి.
- **ఇండస్ట్రీ-అకడమిక్ గుర్తింపు:** ఇండస్ట్రీ, అకడమిక్ వైపు 'గేట్' స్కోరును సబ్జెక్ట్ ఎక్సలెన్స్‌కు బెంచ్ మార్కుగా భావిస్తారు.



ప్రొఫెసర్ ఎస్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటీ రాయపూర్

దిక్సూచి

దివ్యాంగ విద్యార్థులకు..

దివ్యాంగ విద్యార్థుల కోసం సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వశాఖ ఉపకార వేతనాలు అందిస్తోంది. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ గుర్తింపు పొందిన వైకల్యం ఉన్న విద్యార్థుల చదువుల కోసం 'స్కాలర్‌షిప్ ఫర్ డిజెబిలిటీస్'ను అందిస్తున్నారు. వీటిలో పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు, దేశీయ, విదేశీ చదువులు, పోటీ పరీక్షల శిక్షణ కోసం కూడా సహాయం చేస్తున్నారు.

స్కాలర్‌షిప్ రకాలు:

- **ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 9, 10 తరగతుల వారికి ఉద్దేశించింది.
- **పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 11వ తరగతి నుంచి పీజీ, డిగ్రీ, డిప్లొమా వారికి ఉద్దేశించింది.
- **టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్:** ప్రముఖ విద్యా సంస్థల్లో యూజీ, పీజీ చదువులకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఫెలోషిప్:** భారతీయ యూనివర్సిటీల్లో ఎంఫిల్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్:** విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది. అభ్యర్థులు దీనికి ఎంపికయ్యే సంవత్సరం ఏప్రిల్ 1 నాటికి 35 సంవత్సరాల లోపు ఉండాలి.
- **ఫ్రీ కోచింగ్ స్కాలర్‌సిప్:** ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోచింగ్‌లకు ఉద్దేశించింది.

అర్హత: 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ డిజెబిలిటీ ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వైకల్యానికి సంబంధించిన సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు ఉండాలి.

కుటుంబ ఆదాయం: రూ.2.5 లక్షలు(ప్రీ-పోస్ట్ మెట్రిక్ దరఖాస్తుదారులకు), రూ.8 లక్షలు(టాప్ క్లాస్, నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఫ్రీ కోచింగ్ దరఖాస్తు దారులకు), నేషనల్ ఫెలోషిప్ వారికి ఎలాంటి ఆదాయ పరిమితి లేదు. ఒకే తల్లిదండ్రుల నుంచి ఇద్దరు పిల్లలు మాత్రమే అర్హులు. కవలల విషయంలో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు: నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ధ్రువపత్రాలు: పాస్‌పోర్ట్ ఫోటో, బర్త్ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ నెంబర్, ట్యూషన్ ఫీజు రసీదు, చివరి విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా వివరాలు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31 **వెబ్‌సైట్:** scholarships.gov.in

స్కాలర్‌షిప్స్

గిరిజన విద్యార్థులకు..

కేంద్ర గిరిజన గిరిజన వ్యవహార శాఖ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివేందుకు 'జాతీయ స్కాలర్‌షిప్ పథకం' అందిస్తోంది. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, సైన్స్ టెక్నాలజీ, హ్యూమానిటీస్, లా, సోషల్ సైన్స్ వంటి విభాగాల్లో చదువుకు ఏడాదికి 2.50 లక్షలతోపాటు ఇతర ఆర్థిక సహాయం పొందవచ్చు.

స్కీమ్ పేరు: జాతీయ గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యా పథకం(టాప్ క్లాస్ స్కాలర్‌షిప్)

అర్హత: అభ్యర్థులు గిరిజన వర్గానికి చెందిన వారై ఉండాలి. మంత్రిత్వశాఖ ప్రకటించిన ప్రముఖ విద్యా సంస్థలో డిగ్రీ, పీజీలో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఆరు లక్షల లోపు ఉండాలి. ఒకే కోర్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరో స్కాలర్‌షిప్ పొందుతూ ఉండరాదు.

ధ్రువపత్రాలు: గిరిజన సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అడ్మిషన్/ఫీజు రశీదు, ఆధార్ లింక్ చేసిన బ్యాంక్ పాస్‌బుక్, అర్హత పరీక్ష సర్టిఫికెట్/మార్క్‌షీట్, బోనఫైడ్ సర్టిఫికెట్

దరఖాస్తు: ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్, అవసర పత్రాల అప్‌లోడ్ తర్వాత మంత్రిత్వశాఖ ధ్రువీకరణ పొందాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

వెబ్‌సైట్: scholar-ships.gov.in



ఆర్ట్స్ విద్యార్థులకూ స్టైపెండ్ బేస్డ్ అప్రెంటిస్‌షిప్

అకడమిక్ లెర్నింగ్‌కి, ప్రాక్టికల్ అప్లికేషన్‌కి మధ్య గ్యాప్‌ని భర్తీ చేసేది 'అప్రెంటిస్‌షిప్'. సాధారణంగా అప్రెంటిస్ అంటే ప్రొఫెషనల్ కోర్సులకే ఉంటుంది. ఎవరో కొద్దిమంది మాత్రమే శిక్షణతోపాటు స్టైపెండ్ ఇస్తారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సైన్స్ విద్యార్థులతో పాటు, ఆర్ట్స్ విద్యార్థులకూ స్టైపెండ్ ఆధారిత శిక్షణ అవకాశాన్ని కల్పిస్తోంది. దీనికోసం ఎలాంటి టెక్నికల్ కోర్సులు చేయాల్సిన అవసరం లేదు. యూనివర్సిటీ అందించే బీఏ, బీకాం, బీఎస్సీ చదువుతున్న విద్యార్థులతోపాటు, గతంలో ఈ కోర్సులు చేసిన వారూ అర్హులే. నెలకు ఏడువేల నుంచి 24 వేల రూపాయల వరకు స్టైపెండ్ ఇస్తారు.

అంబేద్కర్ వర్సిటీ అవకాశం

ఇందులో చేరిన అభ్యర్థులు ఉద్యోగ నైపుణ్యాలను నేర్చుకుంటారు. ఎంట్రప్రెన్యూర్ స్కిల్స్ ఉన్నవారు సొంతంగా వ్యాపారాలు పెట్టుకోవచ్చు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 27 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఇటీవలే 'రిటైలర్స్ అసోసియేషన్స్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'తో అంబేద్కర్ వర్సిటీ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం రిటైలర్స్ అసోసియేషన్‌తో టైఅప్ పెట్టుకున్న క్రోమా, స్టార్ బక్స్, రిలయన్స్, మెడిప్లస్, తనిష్క్, హామ్లీస్ వంటి 56కు పైగా స్టోర్లలో వీరికి శిక్షణ అవకాశాన్ని కల్పిస్తారు. 'ఎర్న్ వైల్ యు లెర్న్' కాన్సెప్ట్‌లో భాగంగా ఏకకాలంలో డిగ్రీ సర్టిఫికెట్, ఉద్యోగ అనుభవం లభిస్తాయి. కోర్సు తర్వాత అభ్యర్థికి, స్టోర్‌కి ఇష్టమైతే ఉద్యోగంలో కొనసాగవచ్చు. శిక్షణ కోసం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులకు వర్సిటీ కేంద్ర కార్యాలయంలో హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

అక్కడ అభ్యర్థి ఏ రంగానికి సరిపోతాడో అంచనా వేసి అందులోకి పంపిస్తారు. పూర్తి వివరాలకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వెబ్‌సైట్(https://online.braou.ac.in/apprenticeship/SAP) చూడవచ్చు. లేదా వర్సిటీ ఫ్రంట్ ఆఫీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

చిరు ప్రయత్నం ఫలించేనా?

- సమ్మె నేపథ్యంలో చిరంజీవిని కలసిన చిన్న నిర్మాతలు
- మెగాస్టార్ శుభవార్త చెబుతానన్నారు: నిర్మాత నట్టికుమార్
- నేడు ఫెడరేషన్‌తో చిరంజీవి చర్చలు?

తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన కార్మికుల వేతన పెంపు సమస్య తన పరిధిలో లేదనీ, దానిపై ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయమే అంతిమం అని చిరంజీవి గతంలో సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే రెండు వారాలుగా టాలీవుడ్ కార్మికుల సమ్మె కొనసాగుతున్నా ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, నిర్మాతలు కానీ సమస్యకు పరిష్కారం సాధించలేకపోయారు. దీంతో టాలీవుడ్ పంచాయితీ మళ్లీ మెగాస్టార్ నివాసానికి చేరినట్లు ఆదివారం నాటి పరిణామాల నేపథ్యంలో తెలుస్తోంది. సయోధ్య కోసం కొందరు నిర్మాతలు ఆదివారం చిరంజీవిని ఆశ్రయించారు. ఇరువర్గాలతో సంప్రదింపులకు తాను సిద్ధమనీ, ఈ సమస్యకు తానో పరిష్కారం చూపుతానని చిరంజీవి అభయం ఇచ్చినట్లు నిర్మాతలు సి. కల్యాణ్, నట్టికుమార్ చెప్పారు. అదే నిజమైతే రెండు వారాలుగా కొనసాగుతోన్న సినీ కార్మికుల సమ్మె పరిష్కారం కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో మరో ముందడుగు పడి, కార్మికుల సమ్మెకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఇండస్ట్రీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అయితే సోమవారం చిరంజీవి ఫెడరేషన్‌తో చర్చలు జరుపుతారని నిర్మాత నట్టికుమార్ చెప్పిన మాటలపై కొందరు సంశయాన్ని వెలిబుచ్చుతున్నారు. గతంలో సమ్మె పరిష్కారం కోసం చిరంజీవి చొరవ చూపుతున్నారంటూ వచ్చిన వార్తలను ఆయన నిర్మొహమాటంగా ఖండించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అయితే నట్టికుమార్ మాట నిజమవుతుందా? చిరంజీవి శుభవార్త చెబుతారా? అనే ఆసక్తి మాత్రం ఇప్పుడు అంతటా నెలకొంది.




కార్మికులతో చిరంజీవి మాట్లాడతానన్నారు: సి. కల్యాణ్

టాలీవుడ్ కార్మికుల సమ్మె విషయంలో మొదట్నుంచి చిరంజీవి పేరు ప్రముఖంగా వినిపిస్తున్నా ఆయన మాత్రం బయట ఎక్కడా స్పందించింది లేదు. సమ్మె పరిష్కారం కోసం ఇండస్ట్రీలోని అగ్రనిర్మాతలంతా ఆదివారం చిరంజీవితో సమావేశమవుతారని శనివారం ఉధృతంగా ప్రచారం జరిగింది. ఏం జరిగిందో కానీ ఆదివారం అగ్ర నిర్మాతల్లో ఎవరూ చిరంజీవిని కలవలేదు. కానీ ఆదివారం ఉదయం నిర్మాత సి. కల్యాణ్ ఒక్కరే చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'కార్మికుల సమ్మె సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు చిరంజీవి గారు ప్రతి రోజూ మాతో మాట్లాడుతున్నారు. త్వరలోనే ఈ సమస్యకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు. 'ఒక పెద్దమనిషిగా ఇరు వర్గాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో చిరంజీవి ఉన్నారు, తనవంతుగా కార్మికులతో మాట్లాడతానన్నారు' అని తెలిపారు. 'చిన్న నిర్మాతలు బాగా ఇబ్బందులు పడుతున్నారు, నా అనుభవంతో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను ఆయనకు వివరించాను. ఫెడరేషన్ గతంలోనే నిర్మాతల ప్రతిపాదనలను అంగీకరించినా, వారి బలహీనతల వల్లే అవేవీ అమల్లోకి రాలేదు సినిమా షూటింగ్స్ అనేవి ఓ కుటుంబ వాతావరణంలో జరగాలి తప్ప, కార్మిక చట్టాల ప్రకారం సినిమాలకు పనిచేయించడం కుదరదు' అని కల్యాణ్ అన్నారు.

చిరంజీవి మాట వింటామని ఫెడరేషన్ చెప్పింది: నట్టికుమార్

ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం నిర్మాత నట్టి కుమార్ ఆధ్వర్యంలో పలువురు చిన్న నిర్మాతలు చిరంజీవిని కలిశారు. సినిమాల నిర్మాణంలో తాము ఎదుర్కొంటున్న కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నట్టికుమార్ మీడియాతో మాట్లాడుతూ 'ఫెడరేషన్‌తో సమావేశమై వారి వాదన కూడా వింటాననీ, త్వరలోనే శుభవార్త చెబుతానని చిరంజీవి చెప్పారు. చిన్న సినిమాలకు ఇబ్బందిరాకుండా చూడాలని మేం ఆయన్ను కోరాం. నిర్మాతల ఇబ్బందులను వివరించాం. మా ప్రతిపాదనలకు చిరంజీవి సానుకూలంగా స్పందించారు, పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. సోమవారం ఫెడరేషన్ నాయకులతో సమావేశమవుతానని చెప్పారు. 'చిరంజీవి ఏం చెబితే అది తూచా తప్పకుండా పాటిస్తామ'ని ఫెడరేషన్ చెప్పింది కాబట్టి ఈ సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నాను' అని నట్టికుమార్ తెలిపారు. అయితే సి. కల్యాణ్, నట్టికుమార్ వ్యాఖ్యలపై గానీ, జరుగుతున్న పరిణామాలపై గానీ ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కానీ స్పందించలేదు. మరి చిరంజీవి స్వయంగా పూనుకొని, ఈ సమస్యకు ఓ పరిష్కారం చూపుతారా, కార్మికులతో సమ్మెను విరమింజేస్తారా, లేదా అనేది వేచిచూడాలి.

క్రీడా నేపథ్యంలో..



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. సిజా రోజ్ కథానాయిక. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా మేకర్స్ 'అర్జున్ చక్రవర్తి' టైటిల్ సాంగ్‌ని ఆవిష్కరించారు. విక్రాంత్ రుద్ర సాహిత్యానికి విఘ్నేష్ భాస్కరన్ స్వరాలు సమకూర్చారు. దీపక్ బ్లూ, సత్యకుమార్, విఘ్నేష్ పాయ్ ఆలపించారు. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.

వినోదం ఖాయం




ఎన్.ఎన్.ఆర్.చౌదరి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'నేను... నా లల్లి'. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ "నేను నా లల్లి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. ఆద్యంతం ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తడం ఖాయం. ఈ చిత్రంలో పాటలు కూడా రాశాను' అని చౌదరి తెలిపారు. కథానాయిక తస్లీమ్ మాట్లాడుతూ 'కుంటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే పాత్ర నాది. చక్కటి సినిమా చూశామన్న అనుభూతి ప్రతి ఒక్కరికీ కలుగుతుంది' అని అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పవన్.. రాజకీయ తుపాను



రజనీకాంత్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ హీరో పవన్ కల్యాణ్‌ను సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ తుపాన్‌గా అభివర్ణించారు. ఆ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ఆదివారం చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. తాజాగా రజనీకాంత్ 50 యేళ్ల సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సంగతి తెల్సిందే. ఆ సందర్భంగా రజనీకాంత్‌కు పవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందేశానికి రజనీకాంత్ ప్రతిస్పందించారు. 'ఏపీ ఉప ముఖ్యమంత్రి, నా సోదరుడు, పొలిటికల్ సైక్లోన్ పవన్ కళ్యాణ్ గారు... ప్రేమతో చెప్పిన విషెస్‌కు ఉప్పొంగిపోయా. మీ విషెస్‌ను ఓ గౌరవంగా భావిస్తున్నా. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని రజనీకాంత్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

నిధి డబుల్ ధమాకా


'హరిహర వీరమల్లు' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు నిధి అగర్వాల్. ఆమె ప్రస్తుతం 'రాజాసాబ్'లో కథానాయికగా నటిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు మారుతి ఈ హారర్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. ఆదివారం నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



మరో హారర్ థ్రిల్లర్‌లో నిధి

నిధి అగర్వాల్ మరో హారర్ థ్రిల్లర్ చిత్రంలో నటించనున్నారు. ఆమె పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఈ చిత్రాన్ని ప్రకటించి, ఆమె లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నిఖిల్‌కార్తీక్.ఎన్ దర్శకత్వంలో పుప్పాల అప్పలరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరాకు టైటిల్‌ను ప్రకటించనున్నారు.

'హలగలి' యోధుని కథ



హీరో డాలీ ధనంజయ, సప్తమి గౌడ ప్రధాన పాత్రల్లో సుకేష్ నాయక్ దర్శకుడిగా చారిత్రక నేపథ్యంతో తెరకెక్కుతోన్న చిత్రం 'హలగలి'. యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కల్యాణ్ చక్రవర్తి ధూళిపాళ్ల నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ధనంజయను ఓ యోధుడిగా పరిచయం చేస్తూ గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డాలీ ధనంజయ మాట్లాడుతూ "నిర్మాత కల్యాణ్, డైరెక్టర్ సుకేశ్ చాలా ప్యాషన్‌తో ఈ ప్రాజెక్టుని రూపొందిస్తున్నారు. తప్పకుండా సినిమా ఒక మంచి అనుభూతిని ఇవ్వబోతుంది. అందరి అంచనాలను అందుకుంటుంది' అని అన్నారు.

సెలెక్టర్లకు సవాల్

- పోటీలో గిల్, జైస్వాల్, అయ్యర్, సిరాజ్
- క్లిష్టంగా మారిన ఆసియా జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: ఆసియా కప్‌నకు భారత జట్టు ఎంపిక సెలెక్టర్లకు కత్తిమీద సాముగా మారింది. రెగ్యులర్ టీ20 ఆటగాళ్లతో పాటు యువ స్టార్లు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్, మహ్మద్ సిరాజ్‌తోపాటు సీనియర్ పేసర్ బుమ్రా కూడా టోర్నీకి అందుబాటులో ఉండనున్నారు. వీళ్లంతా ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఆడలేదు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో వీరిలో ఎవరినీ పక్కనబెట్టే పరిస్థితి లేకపోవడంతో.. సమతూకమైన జట్టును ఎంపిక చేయడం సెలెక్టర్లకు కఠిన సవాల్‌గా మారింది. జట్టు ఎంపిక కోసం మంగళవారం సెలెక్టర్లు సమావేశమయ్యే అవకాశం ఉంది. వచ్చేనెల 9 నుంచి దుబాయ్‌లో జరిగే ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో రెండు లేదా అంతకుమించి మ్యాచుల్లో టీమిండియా ఆడాల్సి రావచ్చు. ఈ నేపథ్యంలో జట్టు ఎంపికలో ఎలాంటి తేడా వచ్చినా తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఇటీవల ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్‌లో క్లిష్టమైన పిచ్‌లపై రాణించిన గిల్ హఠాత్తుగా పొట్టి ఫార్మాట్ రేసులోకి వచ్చాడు. ఆ టూర్ నుంచి రాగానే దులీప్ ట్రోఫీ ఆడడానికి సిద్ధమవడంతో తాను ఏ ఫార్మాట్‌లోనైనా ఆడడానికి సిద్ధమంటూ బోర్డుకు గిల్ సందేశం కూడా పంపాడు. వాస్తవంగా గిల్ అంతర్జాతీయ టీ20లు ఆడి ఏడాది దాటింది. పొట్టి వరల్డ్‌కప్‌లో ట్రావెల్ రిజర్వ్‌గా వ్యవహరించాడు. అయితే, సూపర్ ఫామ్‌లో ఉన్న గిల్‌ను పక్కనబెట్టే సాహసం సెలెక్టర్లు చేస్తారా? ఒకవేళ అతడిని జట్టులోకి తీసుకోవాలనుకుంటే ఏస్థానంలో ఎంపిక చేయాలనేది పెద్ద ప్రశ్నార్థకం. టీ20ల్లో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఓపెనర్లుగా వ్యవహరిస్తుండగా.. తిలక్ వర్మ, సూర్యకుమార్, శివమ్ దూబే, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యాతో బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. గిల్‌ను తీసుకోవాలంటే వీరిలో ఒకరిపై వేటు వేయాలి. పేసర్ సిరాజ్ పరిస్థితి కూడా ఇలాంటిదే. ఏడాదికిపైగా టీ20లకు దూరంగా ఉన్నాడు. కానీ, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అతడి ప్రదర్శన ఎంతో ఆకట్టుకొంది. అయితే, ఐపీఎల్‌లో పెద్దగా రాణించకపోవడం సిరాజ్‌కు కొంత మైనస్‌గా మారే అవకాశం ఉంది. పొట్టి క్రికెట్‌లో బుమ్రాను ఏమాత్రం పక్కనబెట్టలేని పరిస్థితి. జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్ రేసులోనే ఉన్నా.. వారిని జట్టులోకి తీసుకోవడం అంత సులువైన విషయం కాదు.

నేను ఆడతాను!



స్టార్ పేసర్ బుమ్రా పనిభారంపై రకరకాల ఊహాగానాలు వినవస్తున్నాయి. అయితే, ఆసియా కప్‌నకు తాను అందుబాటులో ఉంటానని భారత క్రికెట్ బోర్డుతో పాటు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీకి బుమ్రా సమాచారం ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇటీవలే ముగిసిన ఇంగ్లండ్ టూర్‌లో బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బందులు పడ్డాడు. గతేడాది టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత బుమ్రా మళ్లీ అంతర్జాతీయ వైట్‌బాల్ క్రికెట్ ఆడలేదు. వెన్నునొప్పితో చాంపియన్స్ ట్రోఫీకి కూడా దూరమయ్యాడు. అయితే, బుమ్రా రాకతో భారత బౌలింగ్ మరింత బలంగా మారుతుంది. కాగా, దుబాయ్ పరిస్థితులకు అలవాటు పడటానికి టోర్నీకి కొన్ని రోజుల ముందే టీమిండియాను అక్కడి పంపాలని బీసీసీఐ భావిస్తున్నట్టు తెలిసింది.

10 సెకన్లకు రూ. 14 లక్షలు

ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ తలపడుతుండడంతో టోర్నీకి మరింత క్రేజ్ పెరిగింది. దీంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టోర్నీ ప్రసార హక్కులు దక్కించుకొన్న సోనీ నెట్‌వర్క్ భావిస్తోంది. ఇదే అదనుగా.. టోర్నీలో ప్రకటనల రేట్లను కూడా భారీగా పెంచినట్టు తెలుస్తోంది. టోర్నీలో భారత్ ఆడే మ్యాచ్‌ల సమయంలో కేవలం పది సెకన్ల ప్రకటనకు రూ. 14 నుంచి 16 లక్షలు ధర నిర్ణయించినట్టు సమాచారం. ఇదే ధర ఇండో-పాక్ మ్యాచ్‌లకు కూడా వర్తిస్తుందని ప్రకటనలు ఇచ్చే సంస్థలకు వెల్లడించిందట.

మరో మూడు మార్పులతో..

దేశవాళీ క్రికెట్ నిబంధనలు

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్‌లో బీసీసీఐ మరిన్ని నిబంధనలను ప్రవేశపెట్టనుంది. తీవ్రంగా గాయపడిన ఆటగాడి స్థానంలో మరో ప్లేయర్‌ను ఆడించవచ్చనే నిర్ణయం తీసుకున్న మరుసటి రోజే బోర్డు మరో మూడు నిబంధనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇకనుంచి ఎవరైనా ఉద్దేశపూర్వకంగా షార్ట్ రన్ తీస్తే స్ట్రయికర్‌గా ఎవరు ఉండాలనే నిర్ణయం ప్రత్యర్థి కెప్టెన్ చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేసింది. ఎక్కువ పరుగులు తీసే క్రమంలో బ్యాటర్లు ఒక్కోసారి క్రీజులో బ్యాట్ పెట్టకుండానే పరిగెడుతుంటారు. అవతలి ఎండ్‌లో టెయిలెండర్ ఉంటే ప్రధాన బ్యాటర్లు తనకు స్ట్రయికింగ్ రావాలనే ఉద్దేశంతో కావాలనే ఇలా చేస్తుంటారు. ఇకనుంచి అలాంటి సమయాల్లో తర్వాతి బంతికి బ్యాటింగ్ ఎవరు చేయాలనేది అవతలి జట్టు కెప్టెన్ నిర్ణయం తీసుకుంటాడు. అయితే ఆ క్రికెటర్ కావాలనే షార్ట్ రన్ చేశాడని అంపైర్ తేల్చాల్సి ఉంటుంది. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో పూర్తి రన్ తీయకుండానే పరిగెడితే ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తున్నారు.

మ్యాచ్ మధ్యలో వెళితే..: ఇకనుంచి మ్యాచ్ మధ్యలో బ్యాటర్ రిటైర్ అయి మైదానం వీడితే తిరిగి అతడిని అనుమతించరు. ప్రత్యర్థి కెప్టెన్ అభ్యంతరం చెప్పకపోయినా ఆడించడం కుదరదని బోర్డు తేల్చింది. అతడి ఇన్నింగ్స్‌ను రిటైర్డ్ అవుట్‌గా ప్రకటిస్తారు. కానీ 25.4.2 నిబంధన ప్రకారం గాయం కారణంగా క్రీజును వీడితే మాత్రం తిరిగి బ్యాటర్ ఆడేందుకు వీలుంటుంది. దీంతోపాటు ఐసీసీ ఇటీవల ప్రవేశపెట్టిన వన్డేల్లో రెండు బంతుల విధానాన్ని బోర్డు.. విజయ్ హజారే ట్రోఫీలో అమలు చేయనుంది. ఈ రూల్ ప్రకారం 1 నుంచి 34 ఓవర్ల మధ్య రెండు ఎండ్‌ల నుంచి కొత్త బంతులతో ఆడిస్తారు. ఆ తర్వాత 35వ ఓవర్ నుంచి మాత్రం ఆ రెండిట్లో ఏదో ఓ బంతిని మాత్రమే ఫీల్డింగ్ టీమ్ ఎంచుకోవాల్సి ఉంటుంది.

బాబర్, రిజ్వాన్ లేకుండానే..

ఆసియాకప్‌నకు పాకిస్థాన్ జట్టు



కరాచీ: పాకిస్థాన్ స్టార్ క్రికెటర్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్‌లకు ఆ దేశ క్రికెట్ బోర్డు మరోసారి షాకిచ్చింది. వచ్చే నెలలో జరుగబోయే ఆసియాకప్ టీ20 టోర్నీ కోసం ప్రకటించిన జట్టులో ఈ ద్వయానికి చోటివ్వలేదు. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌లో పాక్ గ్రూప్ దశలోనే తిరుగుముఖం పట్టడంతో ఈ ఫార్మాట్‌లో వీరి ప్రాతినిధ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దక్షిణాఫ్రికాతో గత డిసెంబరులో ఇద్దరూ చివరి టీ20 ఆడారు. అప్పటి నుంచి బాబర్, రిజ్వాన్ లేకుండానే పాక్ పొట్టి ఫార్మాట్‌లో తలపడుతోంది. ప్రస్తుతం అదే పద్ధతి కొనసాగిస్తూ సల్మాన్ ఆఘా నేతృత్వంలో 17 మంది ఆటగాళ్లతో జట్టును పాక్ వెల్లడించింది. ఆసియాకప్‌కన్నా ముందే ఇదే జట్టు ఆతిథ్య యూఏఈ, అఫ్ఘానిస్థాన్‌లతో ముక్కోణపు సిరీస్‌లో ఆడనుంది.

జట్టు: సల్మాన్ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రాఫ్, ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలాత్, కుశ్‌దిల్ షా, మహ్మద్ హారిస్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, అయూబ్, సల్మాన్ మీర్జా, షహీన్ షా అఫ్రీది, సుఫియాన్ మోకిమ్.

అనహత్‌కు రన్నరప్ టైటిల్



న్యూఢిల్లీ: భారత యువ స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్.. ఆస్ట్రేలియాలో జరిగిన ఎస్ఎస్‌డబ్ల్యూ బేగా ఓపెన్‌లో రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది. హబీబా హని (ఈజిప్టు)తో ఫైనల్ పోరులో 11-9, 5-11, 8-11, 4-10తో ఉన్న దశలో అనహత్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలగింది. దీంతో హబీబాను విజేతగా ప్రకటించారు. 17 ఏళ్ల అనహత్ రన్నరప్‌గా నిలిచింది.

గచ్చిబౌలి స్టేడియంలో రెండు కొత్త అకాడమీలు

గచ్చిబౌలి (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో రెండు కొత్త అకాడమీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హాకీ, అథ్లెటిక్స్ అకాడమీలను త్వరలో ప్రారంభించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన హాకీ మైదానం, అథ్లెటిక్స్ స్టేడియం వంటి వసతులు ఇక్కడ అందుబాటులో ఉండటంతో ప్రభుత్వం రెండు శిక్షణా కేంద్రాలను మంజూరు చేశారు. హాకీతో పాటు అథ్లెటిక్స్‌కు సంబంధించి రన్నింగ్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హైజంప్ ఇలా దాదాపు 20 క్రీడాంశాల్లో ఆసక్తికి అనుగుణంగా మూడేళ్లపాటు క్రీడాకారులకు ఈ అకాడమీల్లో శిక్షణ ఇస్తారు.

హీలీ అజేయ సెంచరీ

చివరి వన్డేలో భారత్ 'ఎ'పై ఆసీస్ 'ఎ' గెలుపు



బ్రిస్బేన్: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో మూడు వన్డేల సిరీస్‌ను ఇప్పటికే 2-0తో గెలుచుకున్న భారత్ 'ఎ' జట్టు.. ఆదివారం జరిగిన నామమాత్రపు ఆఖరి మ్యాచ్‌లో 9 వికెట్లతో ఓటమిపాలైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ షఫాలీ (52) అర్ధ సెంచరీ చేయగా, యాస్తిక భాటియా (42) రాణించింది. తహిలా మెక్‌గ్రాత్ 3, గింజర్, హేవర్డ్, లియోరాయిడ్ తలా 2 వికెట్లు తీశారు. ఛేదనలో అలీసా హీలీ (85 బంతుల్లో 23 ఫోర్లు, 3 సిక్సర్లతో 137 నాటౌట్) అజేయ సెంచరీతో కదం తొక్కడంతో ఆసీస్ 27.5 ఓవర్లలోనే 222/1 స్కోరు చేసి గెలిచింది. తహిలా విల్సన్ (59) అర్ధ సెంచరీతో అదరగొట్టింది. ఆసీస్ ఏకైక వికెట్‌ను రాధా యాదవ్ పడగొట్టింది.

పారా వాలీబాల్ వరల్డ్‌కప్ జట్టులో మనోళ్లకు చోటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పారా వాలీబాల్ వరల్డ్‌కప్‌లో తలపడే భారత జట్టులో ఆరుగురు తెలుగు క్రీడాకారులకు చోటు దక్కింది. అమెరికాలో వచ్చేనెల 12 నుంచి 18 వరకు ఈ వరల్డ్‌కప్ జరగనుంది. తెలంగాణ నుంచి ప్రశాంత్ (వరంగల్), నరేష్ యాదవ్ (సూర్యపేట), కల్యాణ్ (మంచిర్యాల), రాజు (ములుగు), ఆంధ్రప్రదేశ్ నుంచి గణేష్ (అనకాపల్లి), విజయకుమార్ (దర్శి)లకు భారత జట్టులోని 15 మంది బృందంలో స్థానం లభించింది.



ముగిసిన వేస్ పేస్ అంత్యక్రియలు

కోల్‌కతా: టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తండ్రి, హాకీ మాజీ ఆటగాడైన డాక్టర్ వేస్ పేస్ (80) అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. వయోభారం, అనారోగ్య సమస్యలతో వేస్ గురువారం కన్నుమూశాడు. అంత్యక్రియలకు భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, అరుణ్‌లాల్, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ తదితరులు హాజరయ్యారు. వేస్ పార్థివ దేహాన్ని తీసుకెళ్తున్న వాహనం ముందు యువ ఆటగాళ్లు హాకీ స్టిక్‌లతో ఇరువైపులా నిల్చొని ఘనంగా నివాళులర్పించారు. 1972 ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన భారత హాకీ జట్టులో వేస్ పేస్ సభ్యుడు. రిటైర్మెంట్ తర్వాత స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడిగా సేవలందించాడు.

ఛెత్రిని ఎందుకు తీసుకోలేదంటే..

ఫుట్‌బాల్ కోచ్ జమీల్

బెంగళూరు: కాఫా నేషన్స్ కప్‌నకు భారత జట్టు ప్రాబబుల్స్‌లో స్టార్ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి పేరు లేకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. అటు సోషల్ మీడియాలోనూ భారత కోచ్ ఖలీద్ జమీల్ తీరుపై క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఛెత్రి పేరు లేకపోవడంపై కోచ్ జమీల్ స్పందించాడు. కొత్త వారిని పరీక్షించే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశాడు. ఛెత్రికి కూడా ఈ విషయం ముందుగానే తెలిపామన్నాడు. ఈనెల 29 నుంచి కాఫా నేషన్స్ కప్ జరగనుంది. 'భారత ఫుట్‌బాల్‌కు ఛెత్రి రోల్ మోడల్. అతడి కోసం జట్టు ద్వారాలు ఎప్పుడూ తెరుచుకునే ఉంటాయి. అయితే ప్రస్తుత శిబిరంలో ఎందుకు లేడంటే.. మేం ఆసియాకప్ క్వాలిఫయర్స్‌కు సన్నాహకంగా ఉపయోగపడే టోర్నీ ఆడుతున్నాం. ఇందులో ఇతర ఆటగాళ్లను పరీక్షించాలనుకున్నా' అని జమీల్ వెల్లడించాడు. మరోవైపు అక్టోబరు 9 నుంచి జరిగే ఆసియాకప్ క్వాలిఫయర్స్‌లో ఛెత్రి ఆడే అవకాశాలున్నాయి.

25,000 ఎగువన బుల్లిష్

(ఆగస్టు 18-22 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో ట్రెండ్

నిఫ్టీ గత వారం 24,703-24,530 పాయింట్ల మధ్యన కదలాడి 202 పాయింట్ల (1.09 శాతం) లాభంతో 24,631 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,000
బ్రేక్‌డౌన్ స్థాయి: 24,300
నిరోధ స్థాయిలు: 24,850, 24,950, 25,050 (24,750 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,425, 24,325, 24,225 (24,525 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18 తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	520
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	553	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

ఫాక్స్‌కాన్ బెంగళూరు ప్లాంట్‌లో ఐఫోన్ 17 ఉత్పత్తి షురూ

రూ.25,000 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేసిన కంపెనీ
చైనా వెలుపల సంస్థకిది ఇదే అతిపెద్ద ప్లాంట్



న్యూఢిల్లీ: తైవాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్.. యాపిల్ ఐఫోన్స్ అసెంబ్లింగ్ కోసం భారత్‌లో అతిపెద్ద యూనిట్‌ను ప్రారంభించింది. బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో త్వరలో మార్కెట్లోకి విడుదల చేయనున్న ఐఫోన్ 17 అసెంబ్లింగ్ ప్రారంభించినట్లు సమాచారం. అయితే యాపిల్ కంపెనీ, ఫాక్స్‌కాన్ గానీ దీనిపై అధికారికంగా నోరు మెదపడం లేదు. ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం ఫాక్స్‌కాన్ 280 కోట్ల డాలర్లు (సుమారు రూ.25,000 కోట్లు) ఖర్చు చేసింది. ఐఫోన్స్ అసెంబ్లింగ్ కోసం చైనా వెలుపల ఫాక్స్‌కాన్ ఏర్పాటు చేసిన అతిపెద్ద ప్లాంటు ఇదేనని భావిస్తున్నారు. చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ వద్ద ఏర్పాటు చేసిన యూనిట్‌లోనూ ఫాక్స్‌కాన్ ఐఫోన్ 17ను అసెంబ్లింగ్ చేస్తోంది. ఐఫోన్ 17ను యాపిల్ సెప్టెంబరులో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

చైనా నిపుణులు లేకపోయినా..

కాగా చైనా.. ఈ ప్లాంట్ నుంచి కూడా తన సాంకేతిక నిపుణులను వెనక్కి తీసుకుంది. దాంతో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ ఫాక్స్‌కాన్.. తైవాన్, ఇతర దేశాల నుంచి నిపుణులను రప్పించి భారత్‌లో ఐఫోన్స్ ఉత్పత్తిని పెంచుతోంది. ఫాక్స్‌కాన్ గత ఆర్థిక సంవత్సరం మన దేశంలో యాపిల్‌కి చెందిన దాదాపు 4 కోట్ల ఐఫోన్లు తయారు చేసింది. వీటి విలువ 2,200 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.92 లక్షల కోట్లు) వరకు ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కనీసం 6 కోట్ల ఐఫోన్లను భారత్‌లో అసెంబ్లింగ్ చేయించాలని యాపిల్ లక్ష్యంగా పెట్టుకుంది.

భారత్‌లో ల్యాప్‌టాప్‌ల తయారీ: సామ్‌సంగ్

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్.. భారత్‌లో ల్యాప్‌టాప్‌ల తయారీని ప్రారంభించింది. గ్రేటర్ నోయిడాలోని ఉత్పత్తి కేంద్రంలో ఈ ల్యాప్‌టాప్‌ల తయారీని ప్రారంభించినట్లు సామ్‌సంగ్ వెల్లడించింది సామ్‌సంగ్ ఇప్పటికే ఫీచర్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వేరబుల్స్, టాబ్లెట్లను ఈ యూనిట్‌లో తయారు చేస్తోంది. తాజాగా పోర్టుఫోలియో విస్తరణలో భాగంగా ల్యాప్‌టాప్‌ల ఉత్పత్తిని కూడా మొదలుపెట్టింది. త్వరలోనే మరిన్ని ఉత్పత్తుల తయారీని భారత్‌లో ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. కాగా ప్రస్తుతం సామ్‌సంగ్‌కు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీ యూనిట్ భారత్‌లోనే ఉంది. యాపిల్ తర్వాత భారత్ నుంచి అత్యధికంగా స్మార్ట్ ఫోన్లను ఎగుమతి చేస్తున్న సంస్థ కూడా సామ్‌సంగ్ కావడం గమనార్హం.



విశాఖ యూజియా ప్లాంట్ నుంచి 20 కొత్త ఔషధాలు

- లాభాల దిశగా చైనా ప్లాంట్: అరబిందో ఫార్మా

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అరబిందో ఫార్మా తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంలోని తన అనుబంధ సంస్థ యూజియా ప్లాంటులో అమెరికా, యూరోపియన్ మార్కెట్ల కోసం 20 కొత్త ఔషధాలను ఉత్పత్తి చేయనుంది. వీటికి అవసరమైన అనుమతుల కోసం ఇప్పటికే ఆయా దేశాల రెగ్యులేటరీ సంస్థలకు దరఖాస్తు చేసింది. కంపెనీ జూన్ త్రైమాసిక ఫలితాల వెల్లడి తర్వాత అనలిస్టుల ప్రశ్నలకు సమాధానంగా అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సంతానం సుబ్రమణియన్ ఈ విషయం వెల్లడించారు. మరోవైపు చైనాలో 14.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,250 కోట్లు)తో ఏర్పాటు చేసిన అరబిందో ఫార్మా అనుబంధ యూనిట్ కూడా ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికల్లా స్థూల లాభం ఆర్జించే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరిస్తున్నట్టు చెప్పారు. కాగా 7 కోట్ల డాలర్ల (దాదాపు రూ.600 కోట్లు) పెట్టుబడితో అమెరికాలో ఏర్పాటు చేసిన రెండు యూనిట్లు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఉత్పత్తి ప్రారంభిస్తాయని సుబ్రమణియన్ వెల్లడించారు.

బయోలాజిక్స్ వ్యాపారంలో మరిన్ని పెట్టుబడులు

హైదరాబాద్ సమీపంలో కాంట్రాక్టు పద్దతిలో బయోలాజిక్స్ ఔషధాల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన ప్లాంటును 2027 మార్చి నాటికి మరో 10 కోట్ల డాలర్ల (సుమారు రూ.860 కోట్లు) పెట్టుబడితో విస్తరించనున్నట్టు సుబ్రమణియన్ చెప్పారు. ఈ ప్లాంటు మీద అరబిందో ఫార్మా ఇప్పటికే 3 కోట్ల డాలర్లు (దాదాపు రూ.255 కోట్లు) ఖర్చు చేసింది.

విమాన ఇంధనంగా వంటనూనె

పానిపట్ రిఫైనరీలో ఉత్పత్తి.. ఐఓసీ చైర్మన్ ఏఎస్ సాహ్ని

న్యూఢిల్లీ: విమాన ఇంధనం రూపురేఖలూ మారిపోతున్నాయి. ప్రస్తుతం ముడి చమురు నుంచి ఉత్పత్తి చేసే ఇంధనమే విమానాల్ని నడిపిస్తోంది. దీనివల్ల ఆకాశంలో పెద్దమొత్తంలోనే కాలుష్యం పోగవుతోంది. ఈ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) పేరుతో ప్రత్యేక విమాన ఇంధనాన్ని అభివృద్ధి చేసింది. ఉపయోగించిన వంట నూనెలతో ఈ ఇంధనాన్ని అభివృద్ధి చేసినట్టు ఐఓసీ చైర్మన్ అర్విందర్ సింగ్ సాహ్ని చెప్పారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న పెట్రోలియం ఆధారిత విమాన ఇంధనం (ఏటీఎఫ్)లో ఈ ఎస్ఏఎఫ్‌ను సగం వరకు కలిపి ఉపయోగించవచ్చని ఆయన తెలిపారు. హరియాణాలో ఐఓసికి చెందిన పానిపట్ రిఫైనరీలో ప్రస్తుతం ఈ ఎస్ఏఎఫ్‌ను కంపెనీ ఉత్పత్తి చేస్తోంది. ఇందుకోసం ఈ రిఫైనరీలో 35,000 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేసింది. ఈ సరికొత్త ఇంధనానికి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) కూడా ఆమోదం తెలిపిందని సాహ్ని చెప్పారు.

ఆచితూచి వ్యవహరించండి..

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం కనిపిస్తోంది. అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు ఈ వారం మార్కెట్ల గమనాన్ని నిర్దేశించనున్నాయి. దేశీయంగా చూస్తే ప్రతిపాదిత జీఎస్‌టీ సంస్కరణలు, ఎస్ అండ్ పీ భారత క్రెడిట్ రేటింగ్ పెంచటం మార్కెట్లకు సానుకూల అంశాలు. గత వారం సూచీలు మెరుగ్గా రాణించాయి. అయినప్పటికీ ఈ వారం మదుపరులు ఆచితూచి వ్యవహరించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

క్రిసిల్: కొన్ని రోజులుగా అప్‌ట్రెండ్‌లో సాగిన ఈ షేరు తాజా మార్కెట్ కరెక్షన్‌తో డీలాపడ్డాయి. ప్రస్తుతం ఒకే స్థాయిలో నిలదొక్కుకుంటూ వస్తున్నాయి. దీర్ఘకాల మూమెంటమ్ క్రమంగా మెరుగుపడుతోంది. గత గురువారం రూ.5,339 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.5,300 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.5,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,240 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విప్రో: ప్రస్తుతం ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో సాగుతోంది. కొన్నాళ్ల క్రితం పుల్‌బ్యాక్ ర్యాలీ కనిపించింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ లేకపోయినప్పటికీ మరోసారి ఈ షేరు కీలకమైన రూ.244 మద్దతు స్థాయిలకు చేరింది. గత గురువారం రూ.246 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.240 శ్రేణిలో ప్రవేశించి రూ.285 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.236 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇన్ఫోసిస్: ఈ షేరు మరోసారి కీలకమైన రూ.1,450 వద్ద మద్దతు తీసుకుంది. ఇప్పటికే ఐటీ రంగ షేర్లు కనిష్ఠ స్థాయికి చేరటంతో ఇన్వెస్టర్లు కొద్దిగా ఆసక్తి కనబరుస్తున్నారు. గత గురువారం రూ.1,447 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,400 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,340 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏషియన్ పెయింట్స్: ప్రస్తుతం ఈ షేరు టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగా పుంజుకున్నాయి. రూ.2,500 వద్ద కీలకమైన నిరోధ స్థాయిని అధిగమిస్తే మరింత పెరిగే అవకాశం ఉంది. గత గురువారం రూ.2,528 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,700 టార్గెట్ ధరతో రూ.2,450 స్థాయిలో పడే కొద్ది కొనుగోలు చేయాలి. అయితే రూ.2,400 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సిప్లా: కొన్ని నెలలుగా ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. స్వల్ప,మధ్యకాలిక మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగయ్యాయి. ఫార్మా రంగం జోరందుకుంటే షేరు పెరిగే అవకాశం ఉంది.

గత గురువారం రూ.1,564 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,500 శ్రేణిలో అక్యుములేట్ చేసుకుంటూ రూ.1,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,440 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ప్రధాన నిరోధం 25,000

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం రికవరీ కనబరుస్తూ 220 పాయింట్ల లాభపడి 24,500 ఎగువన బౌన్స్ బ్యాక్ అయ్యింది. చివరకు అంతకు ముందు వారం ముగింపుతో పోలిస్తే 202 పాయింట్ల లాభంతో 24,630 వద్ద క్లోజైంది. మార్కెట్ ఆరు వారాల అనంతరం డౌన్‌ట్రెండ్‌కు స్వల్పకాలిక విరామం ప్రకటించినట్లు కనిపిస్తోంది. గత వారం మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు కూడా స్వల్ప రికవరీని కనబరిచాయి. మార్కెట్లలో మైనర్ రికవరీ కనిపించినప్పటికీ ఎలాంటి స్పష్టమైన సంకేతాలు వెలువరించలేదు. ఈ వారం స్వల్పకాలానికి సానుకూల సంకేతాలు వెలువరిస్తేనే మార్కెట్ మరింత పటిష్ఠతను సూచిస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: తదుపరి పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించాలంటే నిఫ్టీ మైనర్ నిరోధ స్థాయిలైన 24,800 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన నిరోధం 25,000. ఇక్కడ కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. తదుపరి అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 24,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. సానుకూల, రక్షణ కోసం ఈ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి మద్దతు స్థాయిలు 24,300,24,000

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 336 పాయింట్ల లాభపడి 55,340 వద్ద క్లోజైంది. ఈ వారం పాజిటివ్ ట్రెండ్ కోసం నిరోధ స్థాయిలైన 55,700 ఎగువన నిలదొక్కుకోవాలి. ఒకవేళ నిలదొక్కుకోలేకపోతే 55,000 వద్ద స్వల్పకాలిక మద్దతు స్థాయిలుటాయి. ఇక్కడ స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. అప్రమత్తంగా ఉండటం మంచిది.

పాటర్న్: నిఫ్టీ గత వారం టెక్నికల్ ఓవర్‌సోల్డ్ పొజిషన్ కారణంగా రికవరీ కనబరిచింది. ప్రధానంగా 100 రోజుల చలన సగటు ఎగువన రికవరీ అయ్యింది. 25,000 వద్ద తదుపరి నిరోధం ఉంది. ఇక్కడ కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. 24,000 వద్ద అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్ వద్ద ఉంది. సానుకూలత కోసం ఇక్కడ కచ్చితంగా నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,720, 24,800
మద్దతు	24,500, 24,440

అభ్యర్థుల ఆస్తుల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సింది ఈసీనే

» అలహాబాద్ హైకోర్టు

ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 17: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఆస్తుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉన్నట్టు కనిపిస్తోందని అలహాబాద్ హైకోర్టు అభిప్రాయపడింది. ఆస్తుల జాబితాను ఆదాయపు పన్ను విభాగం తనిఖీలు చేసిన తరువాత వాటిని ప్రజాబాహుళ్యానికి అందుబాటులో తీసుకురావాల్సిన బాధ్యత ఈసీపైనే ఉంటుందని తెలిపింది. ఆస్తుల జాబితాలు ప్రజలకు తెలిసేలా ఏర్పాట్లు చేయాలంటూ 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదంటూ రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎస్.ఎన్ శుక్లా ఆధీనంలోని లోక్ ప్రహరీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అభ్యర్థులు ఫారం-26లో తమ ఆస్తుల వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. వాటిని ఆదాయపు పన్ను విభాగం తనిఖీ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఈ బాధ్యత ఎవరన్నదానిపై సమస్య తలెత్తింది. దీనిని ఆదాయపు పన్ను శాఖే చూడాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది చెప్పారు. తమపై అలాంటి బాధ్యత లేదని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకొని ప్రాథమికంగా చూస్తే ఇది ఎన్నికల కమిషన్ చేయాల్సిన పనే నని అభిప్రాయపడింది. అలా అయితే ఇందుకు కేంద్ర ప్రభుత్వం తమకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. దాంతో కేంద్ర హోం శాఖను ప్రతివాదిగా చేర్చుతూ తదుపరి విచారణను సెప్టెంబరు15కు వాయిదా వేసింది.

సుప్రీంకోర్టు, హైకోర్టుల స్థాయి సరిసమానం

» హైకోర్టుల కొలీజియంలకు ఎలాంటి ఆజ్ఞలు ఇవ్వలేం

» సీజేఐ జస్టిస్ గవాయ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: న్యాయ వ్యవస్థలో సుప్రీంకోర్టు, హైకోర్టుల రాజ్యాంగపర స్థాయి సమానంగా ఉంటుందని సీజేఐ జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. ఒకదాని కింద మరొకటి పనిచేయడం అంటూ ఉండదని తెలిపారు. ఒకటి సుపీరియర్, మరొకటి దిగువస్థాయిది అన్న మాటే ఉండదని చెప్పారు. పరస్పర గౌరవం ఆధారంగా ఆ రెండు వ్యవస్థలు పనిచేస్తాయని తెలిపారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. సుప్రీంకోర్టు, హైకోర్టుల కొలీజియంల పరిధిపైనా స్పష్టత ఇచ్చారు. న్యాయమూర్తి పదవికి ఫలానా వారి పేరు సిఫార్సు చేయాలని హైకోర్టు కొలీజియంకు సుప్రీంకోర్టు కొలీజియం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు. న్యాయమూర్తి పదవులకు ఎవరి పేర్లను సిఫార్సు చేయాలన్నదాన్ని హైకోర్టు కొలీజియంలే నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు. మహా అయితే సుప్రీంకోర్టు కొలీజియం ఎవరి పేర్లనయినా సూచించవచ్చని, అంతే తప్ప వాటిని జాబితాలో చేర్చాలని ఆజ్ఞలు ఇవ్వలేవని చెప్పారు.

న్యూయార్క్ సిటీ క్లబ్‌లో కాల్పులు

» ముగ్గురి మృతి, 8 మందికి గాయాలు

న్యూయార్క్, ఆగస్టు 17: న్యూయార్క్ నగరంలోని ఓ క్లబ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున క్లబ్‌లో చెలరేగిన ఓ వివాదమే కాల్పులకు దారితీసినట్లు భావిస్తున్నామని న్యూయార్క్ కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి 36 షెల్ కేసింగ్‌లను, సమీపంలోని వీధిలో ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఇటీవలి కాలంలో నగరంలో తుపాకీ హింస రికార్డు స్థాయిలో తగ్గిందనుకుంటున్న నేపథ్యంలో.. తాజా కాల్పుల ఘటన భయానకమైనదని ఆమె పేర్కొన్నారు.

ధర్మస్థల వివాదం వెనుక సీఎం ప్రమేయం

» ప్రతిపక్షనేత అశోక ఆరోపణ



బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ధర్మస్థలలో సాగుతున్న వివాదం వెనుక కర్ణాటక సీఎం సిద్దరామయ్య పాత్ర ఉందని.., హిందూ మతం, ఆలయాలకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేసేందుకు కమ్యూనిస్టు భావాలు కలిగిన అర్బన్ నక్సల్స్‌కు ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ప్రతిపక్షనేత అశోక తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం హుబ్బళ్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సౌజన్య, సిట్ కేసులను ఎవరూ వ్యతిరేకించలేదన్నారు. ఎవరో ఒక వ్యక్తి మాటలు విని ముఖ్యమంత్రి సిట్ దర్యాప్తునకు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. కొందరు ధర్మసల ఆలయానికి ఎక్స్‌కవేటర్‌తో దూసుకొస్తామని హెచ్చరిస్తున్నారని, అడవిలో మతోన్మాదులు, నక్సల్స్‌కు ఎర్ర తివాచీ పరిచి జనజీవనంలోకి తీసుకొచ్చిన సిద్దరామయ్య వీటన్నింటికీ కారణమని ఆరోపించారు. వివాదం వెనుక కుట్ర ఉందని డీసీఎం డీకే శివకుమార్ ఆరోపించారని, ఈ విషయమై ముఖ్యమంత్రి నోరు విప్పడం లేదని, కాంగ్రెస్‌లోనే హిందూ వ్యతిరేక, హిందూ అనుకూల గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు, ముస్లింలీగ్‌తోపాటు పలు హిందూ వ్యతిరేక సంఘాలతో సంబంధాలు పెట్టుకున్న కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆలయాలను మూసివేసే ప్రయత్నం చేస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ఆరోపించారు. హుబ్బళ్లిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరో ఒక అనామకుడు విన్నవించాడని ప్రభుత్వం ఏకంగా సిట్ ఏర్పాటు చేసిందన్నారు. ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే పట్ల నోటికొచ్చినట్టు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్



(మొదటి పేజీ తరువాయి)

పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆలిండియా కాయర్ బోర్డు ఛైర్మన్‌గా సేవలందించారు. 2023 ఫిబ్రవరి 18న ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2024 మార్చి 19 నుంచి జూలై 31 వరకు తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 జూలై 27న మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులై కొనసాగుతున్నారు.

ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాతో..

2022లో ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన జగదీప్ ధన్‌ఖడ్.. అనారోగ్య కారణాలు చూపుతూ ఈ ఏడాది జూలై 21న అనూహ్యంగా పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు 7న నోటిఫికేషన్ ఇవ్వగా, 21 వరకు నామినేషన్లకు అవకాశం కల్పించింది. సెప్టెంబరు 9న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రకటించిన అభ్యర్థికే తమ మద్దతు అని, అభ్యర్థి ఎవరనేదీ ఆయన అభీష్టమే నని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రకటించాయి. ఈ నెల 6న జరిగిన సమావేశంలో టీడీపీ సహా కీలక భాగస్వామ్య పక్షాలన్నీ ఈ మేరకు ప్రకటనలు చేశాయి. అయితే 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వానికి ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తుందని బీజేపీ భావిస్తోంది. విపక్ష ఇండియా కూటమిలో కీలకంగా ఉన్న తమిళనాడులోని అధికార డీఎంకే.. సీపీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించదని అంచనా వేస్తోంది.


చంద్రబాబు శుభాకాంక్షలు.. రాంచందర్‌రావు హర్షం..

హైదరాబాద్/అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం పట్ల బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ హర్షం వ్యక్తం చేసింది. సుదీర్ఘ అనుభవం కలిగిన రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా అందరి మన్ననలు పొందుతారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే తరఫున ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ రాజనీతిజ్ఞుడు, సుదీర్ఘకాలం దేశానికి సేవలందించిన గౌరవప్రదమైన నాయకుడు అయిన సీపీ రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా నామినేషన్ వేయడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్ఎస్ఎస్... ఇండియన్ తాలిబన్

» సంఘ్ వల్ల దేశంలో శాంతికి విఘాతం

» కాంగ్రెస్ నేత హరిప్రసాద్ విమర్శలు



న్యూఢిల్లీ, ఆగస్టు 17: ఆర్ఎస్ఎస్‌పై ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించడంపై మాటల తూటాలు పేలుతున్నాయి. కాంగ్రెస్ మాజీ ఎంపీ, ప్రస్తుత కర్ణాటక శాసనమండలి సభ్యుడు బీకే హరిప్రసాద్.. సంఘ్‌ను ఇండియన్ తాలిబన్లుగా పేర్కొంటూ, ఈ సంస్థవల్ల దేశంలో శాంతికి విఘాతం కలుగుతోందని హరిప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జీవో ఆర్ఎస్ఎస్ అని, ఎందరో స్వయంసేవకులు దేశ స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలను త్యాగం చేశారని ప్రధాని మోదీ కొనియాడిన విషయం విదితమే. దీనిపై స్పందించిన హరిప్రసాద్... సంఘ్ ఏనాడైనా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదా అని నిలదీశారు. అసలు ఆర్ఎస్ఎస్ ఒక రిజిస్టర్డ్ సంస్థ కూడా కాదని, అయినా దానికి నిధులు ఎలా సమకూరుతున్నాయో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నేత మండిపడ్డారు. దీనిపై బీజేపీ కూడా దీటుగా స్పందించింది. ఆర్ఎస్ఎస్‌ను గాంధీ, జయప్రకాశ్ నారాయణ్‌లే కొనియాడారని బీజేపీ అధికార ప్రతినిధి షెహనాజ్ పూనావాలా పేర్కొన్నారు. సాక్షాత్తూ కాంగ్రెస్ మాజీ అగ్రనేత ప్రణబ్ ముఖర్జీ కూడా సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్‌దే తాలిబన్ మైండ్‌సెట్ అంటూ దుయ్యబట్టారు.

మానసిక వేధింపులను ఎదుర్కొనే మహిళల్లో గుండె జబ్బులు వచ్చే ముప్పు ఎక్కువ

» హార్వర్డ్ వర్సిటీ పరిశోధకులు అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 17: మానసిక వేధింపులను ఎదుర్కొనే మహిళల్లో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ముప్పు సాధారణం కన్నా 41% ఎక్కువని హార్వర్డ్ వర్సిటీ పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒకరు ఏదో ఒక సందర్భంలో వేధింపులకు గురవుతున్నారని ఈ అధ్యయనం ఆందోళన వ్యక్తం చేసింది. "అది చేయవద్దు.. ఇది చేయవద్దు.. అని మహిళలపై ఇంట్లో ఆంక్షలు విధిస్తారు. పనిచేసే చోట్ల మహిళలు ఎన్నో వేధింపులు ఎదుర్కొంటారు. మానసిక వేధింపుల్లో హింస ఉండని కారణంగా చాలా మంది వీటిని తక్కువ ప్రమాదకరమైనవిగా భావిస్తారు. కానీ, ఇవి మహిళల వయస్సు పెరుగుతున్న కొద్దీ వారి ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని కలుగజేస్తాయి. గుండె జబ్బులు, స్ట్రోక్‌కు కారణం అవుతాయి" అని అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకురాలు రెబెకా తెలిపారు. మానసిక వేధింపులతో మహిళల్లో ఒత్తిడి పెరిగి, అది నరాల వ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని, తద్వారా వారి శారీరక ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. రెండు దశాబ్దాల పాటు నిర్వహించిన ఈ అధ్యయనాన్ని 'సర్క్యులేషన్' అనే జర్నల్‌లో ప్రచురించారు.

ఢిల్లీలో శుభాన్షు శుక్లాకు ఘన స్వాగతం

» నేడు ప్రధాని మోదీని కలవనున్న శుక్లా

» తర్వాత స్వస్థలం లఖ్‌నవూకు పయనం



శుక్లాకు స్వాగతం పలుకుతున్న రేఖాగుప్తా, జితేంద్రసింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారత వ్యోమగామిగా రికార్డు సృష్టించిన శుభాంశు శుక్లా.. ఆదివారం తెల్లవారుజామున స్వదేశానికి తిరిగొచ్చారు. శుక్లాతోపాటు బ్యాకప్ వ్యోమగామిగా అమెరికాకు వెళ్లిన ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా భారత్‌కు చేరుకున్నారు. వీరికి ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ ఘన స్వాగతం పలికారు. యాక్సియం-4 మిషన్ శిక్షణలో భాగంగా శుక్లా గతేడాది అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఏడాది తర్వాత తొలిసారిగా భారత్‌కు చేరుకోవడంతో శుక్లాకు స్వాగతం పలకడానికి ఆయన భార్య కామ్నా, కుమారుడు కియాష్ కూడా విమానాశ్రయానికి చేరుకున్నారు. భారీగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులు త్రివర్ణ పతాకాలు ఊపుతూ, డ్రమ్స్ వాయిస్తూ స్వాగతం పలికారు. శుభాంశు శుక్లా విజయానికి గుర్తుగా 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత మొదటి వ్యోమగామి-2047 నాటికి వికసిత్ భారత్ కోసం అంతరిక్ష కార్యక్రమం కీలక పాత్ర' అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చకు ప్రతిపాదించింది. భారత్‌కు చేరుకున్న శుక్లా ముందుగా సోమవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలుసుకుంటారు. అనంతరం తన స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూకు వెళ్లనున్నారు. ఈ నెల 22-23వ తేదీల్లో జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన తిరిగి దేశ రాజధానికి చేరుకుంటారు. అమెరికాలోని ఫ్లోరిడా నుంచి ఈ ఏడాది జూన్ 25న అంతరిక్షంలోకి దూసుకెళ్లిన యాక్సియం-4 మిషన్‌లోని నలుగురు వ్యోమగాముల్లో శుభాంశు శుక్లా ఒకరు. విజయవంతంగా ఐఎస్ఎస్‌లోకి చేరిన ఈ నలుగురు వ్యోమగాములు అక్కడ పలు ప్రయోగాలు పూర్తిచేసుకుని ఈ ఏడాది జూలై 15న భూమిపైకి చేరుకున్నారు.

వినూత్నంగా మెట్రో రెండో దశ

యూ-గిడ్డర్ విధానంలో ట్రాక్ నిర్మాణం.. రెండు పిల్లర్ల మధ్య పొడవాటి స్పాన్ ఏర్పాటు

» డీపీఆర్‌లో పొందుపరిచిన హెచ్‌ఏఎంఎల్ అధికారులు

» ప్రీ కాస్టు యార్డు నుంచి నేరుగా తరలించేలా చర్యలు

» తక్కువ ఖర్చుతో పనులు పూర్తయ్యే అవకాశం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నగరంలో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మెట్రో రెండో దశ నిర్మాణాన్ని వినూత్నంగా చేపట్టనుంది. విదేశాల్లోని సాంకేతికతను వినియోగించి నూతన తరహాలో కారిడార్లను పూర్తి చేసేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు కేంద్రానికి పంపించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో వివిధ నిర్మాణ పద్ధతులను పొందుపరిచారు. ప్రధానంగా మెట్రో ట్రాక్ నిర్మాణాన్నియూ-గిడ్డర్ విధానంలో చేపట్టనున్నారు. మెట్రో మొదటి దశలో సెగ్మెంటల్ విధానంలో పిల్లర్లను నిర్మించగా.. ఈసారి ఈ కొత్త పద్ధతిని అనుసరించనున్నారు. ఇందులో రెండు పిల్లర్ల మధ్య ఒకే గిడ్డర్ పెడుతున్నారు. ఇది 20-35 మీటర్ల వరకు ఉంటుంది. వాస్తవంగా యూ-గిడ్డర్ అనేది ఎలివేటెడ్ మెట్రో రైలు వయాడక్ట్‌ల నిర్మాణంలో ఉపయోగించే నిర్దిష్టమైన ప్రీకాస్ట్ కాంక్రీట్ బీమ్. దీనిని 'యూ' ఆకారపు క్రాస్ సెక్షన్ ద్వారా తయారు చేస్తుంటారు. ఇలాంటి గిడ్డర్లు ట్రాక్‌లకు నిర్మాణాత్మకమైన బలాన్ని అందిస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా, గతంలో బెంగళూరులో 31 మీటర్ల పొడవైన యూ-గిడ్డర్‌ను ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం చెన్నై మెట్రో రైలు రెండో దశ నిర్మాణంలో 33.33 మీటర్లను చేపడుతున్నారు. ఇది దేశంలోనే అతి పొడవైన గిడ్డర్‌గా ఉంది. ఈ నిర్మాణం ద్వారా తక్కువ ఖర్చు అవుతుందని, హైదరాబాద్ మెట్రో రెండో దశలో దీనిని ఉపయోగించాలని డీపీఆర్‌లో పొందుపరిచారు.

ప్రీకాస్టు యార్డులు ఇక్కడే..!

ఢిల్లీ నుంచి డీపీఆర్‌లకు ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ మేరకు టెండర్లు పిలిచి నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కాగా, ప్రీకాస్టు యార్డు (పిల్లర్లు, వయాడక్టులు, గిడ్డర్ల తయారీ)లను మొదటి దశలో ఉప్పల్, కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేశారు. అయితే రెండో దశలో 8 కారిడార్లకు మెటీరియల్ పెద్ద ఎత్తున అవసరం ఉంది. దీంతో హెచ్‌ఏఎంఎల్ అధికారులు మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో 2, కోకాపేట్ వద్ద ఒకటి, ఎయిర్‌పోర్టు మార్గంలో 2, ఎల్బీనగర్ వద్ద ఒకటి చొప్పున యార్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక రెండో దశ విస్తరణలో భాగంగా స్టేషన్ల వద్ద ఓపెన్ పార్కింగ్ విధానం చేపట్టి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని భావిస్తున్నారు. భవిష్యత్తులో ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ కాంప్లెక్సుల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రధానంగా నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో త్వరలో అన్ని స్టేషన్ల వద్ద చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వేగంగా పనులు..

మెట్రో రెండో దశలో ప్రతిపాదించిన 8 కారిడార్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇందులో భాగంగా పార్ట్-ఏ, పార్ట్-బీ డీపీఆర్‌లకు కేంద్రం నుంచి అనుమతి తీసుకొచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే ప్రతిపాదిత కారిడార్లకు కేంద్రం అనుమతి ఇచ్చేలోపు పాతబస్తీ పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించేందుకు హెచ్‌ఏఎంఎల్ అధికారులు వడివడిగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా 7.5 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి కావాల్సిన ఆస్తుల సేకరణను పూర్తి చేసి నిర్మాణాలను తొలగిస్తున్నారు.

పేగులు బయటికి వచ్చేలా కరిచాయ్!

(మొదటిపేజీ తరువాయి)



వీధికుక్కల దాడిలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న శ్రీదేవి

ఉన్నారు. ముఖ్యంగా నల్లగొండకు చెందిన ఓ మహిళ వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. నల్లగొండ 13వ వార్డులోని గిరకబావిగూడెం ప్రాంతంలో పందుల శ్రీదేవిపై దాడి చేసిన వీధి కుక్కలు పేగులు బయటికి వచ్చేంతలా కరిచాయి. శ్రీదేవి తన ఇంటి ముందు ఉండగానే దాడి జరిగింది. బాధితురాలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీదేవితోపాటు నల్లగొండ 13వ వార్డుకే చెందిన విహాన్(2), వీరేశం(20)పై కూడా వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. మరోపక్క, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం ఒక్క రోజే 27 మంది వీధి కుక్కల దాడిలో గాయపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగిలో 16 మంది, కొడంగల్‌లో ఓ బాలుడు సహా ఏడుగురు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఓ చిన్నారి సహా నలుగురు బాధితులు ఉన్నారు. పరిగిలోని ఖాన్‌కాలనీ, మార్కెట్‌యార్డు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో అశోక్(20), సయ్యద్‌ఖాజా పాషా(65), నాగమణి(60), కె.బుచ్చయ్య(52), బుగ్గన్న(50), ఎండీ హబీబ్(50), తాజుద్దీన్(16), షఫీ(42), అంజయ్య(60), రవి(32), సరోజ(24), రాము పవార్(40), సుదర్శన్(25), అర్జున్(20), భరత్(22), షేక్ షరీఫ్(50) వీధి కుక్కల దాడిలో గాయపడ్డారు. పరిగి, తాండూరు ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో బాధితులను వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఇక, కొడంగల్‌లోని కార్గిల్ కాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో ఓ బాలుడు, జోగు అనంతయ్య అనే మునిసిపల్ కార్మికుడు సహా ఏడుగురు వీధి కుక్కల దాడిలో గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని కప్పపాహడ్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న జంగిలి శశాంక్(4) అనే బాలుడిపై దాడి చేసిన వీధి కుక్క.. ఆ తర్వాత 8వ వార్డులో మరో ముగ్గురిని కరిచింది. శశాంక్‌ను వీధి కుక్క బారి నుంచి రక్షించే ప్రయత్నంలో అతని తాత యాదయ్య కూడా గాయపడ్డారు. శశాంక్, యాదయ్య ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణ అంశంలో సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదంటూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందింది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో ఉండగా దాడి చేసిన వీధి కుక్కలు ఆరుగురిని గాయపరిచాయంటూ సంతోష్ అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేశారు. వీధి కుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించాలని హెచ్‌ఆర్సీని కోరారు.

వైద్యవిద్య కోసం విదేశాలకు!

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని కన్సల్టెన్సీలు చెబుతున్నాయి. కొన్ని దేశాల్లోని విశ్వవిద్యాలయాలు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలను అమలుచేస్తున్నాయి. 'ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్' (ఎఫ్ఎంజీఈ) రాసి ఉత్తీర్ణత సాధించే వారి శాతం బాగా పెరిగింది. గతంలో ఇది 20శాతం లోపు ఉండగా ఈ ఏడాది 33 శాతానికి పెరిగినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. ఈ రెండు కారణాలతో ఇక్కడి విద్యార్థులు విదేశాలకు క్యూ కడుతున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పైన్స్, కిర్గిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లోని యూనివర్సిటీలు ఎన్ఎంసీ మార్గదర్శకాలను పాటిస్తున్నాయి. భారతీయ విద్యార్థులను ఆకర్షించేందుకు ఆరేళ్లల్లో వైద్య విద్య కోర్సుతో పాటు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసేలా నిబంధనలను రూపొందించుకున్నాయి. అలాగే అంగ్లంలోనే వైద్యవిద్య బోధన జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. విదేశాల్లోనైతే తక్కువ ఖర్చుతో వైద్యవిద్యను పూర్తిచేసే అవకాశం ఉండటం కూడా ఆవైపు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షిస్తోంది. రాష్ట్రంలో యాజమాన్య కోటాలో ఎంబీబీఎస్ పూర్తి చేయాలంటే కనీసం రూ.55-60 లక్షలు కావాలి. ఎన్ఆర్ఐ కోటాలోనైతే రూ.1.25 కోట్ల వరకు అవుతోంది. విదేశాల్లోనైతే కాలేజీ, హాస్టల్ ఫీజుతో కలుపుకొని రూ.30 లక్షల్లోనే ఎంబీబీఎస్ పూర్తిచేసే అవకాశం ఉంది. ఈ లెక్కలను బేరీజు వేసుకొని కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను విదేశాలకు పంపేందుకు మొగ్గుచూపుతున్నారు. కాగా రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 63 వైద్య కళాశాలలు ఉండగా, వాటిలో 9వేల వరకు ఎంబీబీఎస్ సీట్లున్నాయి. మరో మూడేళ్ల తర్వాత ఏటా కాలేజీల నుంచి పది వేల మంది వరకు ఎంబీబీఎస్ వైద్యులు బయటకొస్తారు. ఈ సంఖ్యకు.. విదేశాల్లో చదువు పూర్తిచేసుకొని వచ్చేవారి సంఖ్య అదనం. ఫలితంగా వీరందరికీ ఉపాధి దొరకడం చాలా కష్టమని నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఏటా 1350 మంది వరకు దంత వైద్య విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి బయటకొస్తున్నారు. వారికి ఉపాధి దొరక్క ఐటీతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాస్తున్నారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో ఎంబీబీఎస్ వైద్యులకు ఎదురుకానుందని సీనియర్ వైద్యులు చెబుతున్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం

నిరుటి కంటే ఈసారి మెడిసిన్ చదివేందుకు విదేశాలకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. ముందుగా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. టైమ్‌పాస్ చదువులు వద్దని చెబుతున్నాం. ముఖ్యంగా ఎఫ్ఎంజీఈ ఉత్తీర్ణత సాధించకుంటే ఐదారేళ్ల సమయం వృథా అవుతుంది. తల్లిదండ్రులు దళారులను ఆశ్రయించి వారి వలలో చిక్కుకోవొద్దు. దీర్ఘకాలంగా కన్సల్టెన్సీలను నడుపుతున్న వారినే సంప్రదించాలి. పదేళ్లకు పైగా వైద్యవిద్యను ఆఫర్ చేస్తున్న విదేశీ యూనివర్సిటీల్లోనే మెడిసిన్ చేయాలి.

- సతీశ్, ఎస్.జీ కన్సల్టెన్సీ, హైదరాబాద్

యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

» ఈ నెలలో 80 వేల టన్నులు అదనంగా ఇవ్వాలి

» రైతులు అవసరానికి మించి యూరియా కొనొద్దు: తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేటాయింపుల మేరకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. 9.80 లక్షల టన్నుల్లో ఇప్పటి వరకు కేవలం 5.32 లక్షల టన్నులు మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని తెలిపారు. ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ డాక్టర్ గోపి, హాకా ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ ఎండీ రాములు, అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్‌లతో సచివాలయంలో తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కేటాయించిన 8.30 లక్షల టన్నుల్లో స్వదేశీ యూరియా 4.34 లక్షల టన్నులు, దిగుమతి యూరియా 3.96 లక్షల టన్నులు రావాల్సి ఉండగా.. స్వదేశీ యూరియా 3.27 లక్షల టన్నులు, దిగుమతి యూరియా 2.05 లక్షల టన్నులు వచ్చినట్లు పేర్కొన్నారు. రామగుండం ఫ్యాక్టరీ 145 పనిదినాల్లో.. 78 రోజులు యూరియా ఉత్పత్తి చేయకపోవటం ప్రధాన సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. 80 వేల టన్నుల యూరియాను రాష్ట్రానికి అదనంగా సరఫరా చేసేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, గద్వాల జిల్లాల్లో యూరియా అమ్మకాలు ఎక్కువైనట్లు నివేదిక వచ్చిందన్నారు. యూరియాను ఇతర అవసరాలకు మళ్లించకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేయాలని, దారిమళ్లిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు అవసరానికి మించి యూరియా కొనొద్దని, ప్రతిపక్ష పార్టీలు చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మి ఆందోళనకు గురికావొద్దని సూచించారు. యూరియాకు సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకోకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ యూరియా కొరత ఉన్నదని తెలిపారు.

పర్యాటక కేంద్రంగా పాపన్నగౌడ్ కోట

» రూ.4.5 కోట్లతో అభివృద్ధి పనులు: పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బహుజన ధీరుడు, గోల్కొండ ఖిలాను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సర్వాయిపేటలో నిర్మించిన కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రూ.4.5 కోట్ల వ్యయంతో కోటను అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు. పాపన్నగౌడ్ 375వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్ ట్యాంక్ బండ్ సమీపంలోని బోట్స్ క్లబ్ వద్ద ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేయనున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో మంత్రి పొన్నం వెల్లడించారు. దళిత, బడుగు, మైనార్టీ వర్గాలు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన గొప్ప సామాజిక బహుజన విప్లవకారుడు పాపన్న గౌడ్ అని స్మరించుకున్నారు. కాగా, పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని మంత్రి పొన్నం, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

అప్రమత్తంగా ఉండండి.. అలసత్వం వద్దు: సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడే పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహించడం తగదని మంత్రి సీతక్క ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. ఆదివారం పీఆర్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు మొత్తం 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్నవారు పనిప్రదేశాలను వదిలి వెళ్లరాదని, వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

వరంగల్ నేతల వివాదంపై వీహెచ్ నేతృత్వంలో కమిటీ!

- గజ్వేల్ నేతల వివాదంపై సబ్ కమిటీ ఏర్పాటు..
- రాజగోపాల్‌రెడ్డి అంశంపై మారోమారు సమావేశం
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ భేటీలో నిర్ణయాలు..

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి నేతల మధ్య సమన్వయం తెచ్చేందుకు పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఓ కమిటీ వేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయించింది. చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన గాంధీభవన్‌లో ఆదివారం భేటీ అయిన కమిటీ.. ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అనంతరం మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో జరుగుతున్న అంశాలపైన కాంగ్రెస్ సీనియర్ నాయకులతో ఒక కమిటీ వేయాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు లేఖ రాయనున్నట్లు తెలిపారు. కాగా.. ఇటీవల మంత్రి వివేక్ సమక్షంలో సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి.. గజ్వేల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేతపై దాడి చేసిన ఘటనపై క్రమశిక్షణ కమిటీ సమావేశంలో చర్చించారు. దీనిపై విచారణ కోసం కమిటీ కన్వీనర్ శ్యామ్‌మోహన్ నేతృత్వంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ.. మంగళవారం మంత్రి వివేక్‌ను కలిసి ఘటనకు సంబంధించి వివరాలను సేకరించనుంది. ఇటు మంత్రి పదవికి సంబంధించి పార్టీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అంశంపైనా కమిటీలో చర్చించారు. దీనిపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాత మరోమారు సమావేశం అవ్వాలని నిర్ణయించారు.

బాంబు పెట్టారనడానికి సిగ్గు లేదా..?

- హరీశ్‌రావుపై ఆది శ్రీనివాస్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'కాళేశ్వరం కట్టింది.. అది కూలిందీ బీఆర్ఎస్ హయాంలోనే కదా..! కాంగ్రెస్ పార్టీ వాళ్లు బాంబు పెట్టారని, కుట్ర చేశారని సిగ్గు లేకుండా ఎలా మాట్లాడుతున్నారు?' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాల వల్ల కూలిన కాళేశ్వరం.. ఇప్పుడు తెలంగాణకు గుదిబండలాగా మారిందన్నారు. ఆనాడే తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ కట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేడిగడ్డలో నీళ్లు నిల్వ చేసి.. ఆ బ్యారేజ్ కొట్టుకుపోతే రేవంత్ ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని హరీశ్ చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆయన బురద రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు.

ఆర్ఎస్ ప్రవీణ్.. మీకు జ్ఞానముందా?

- మేడిగడ్డ అంశంలో బీజేపీకి ఏం సంబంధం?: వెంకటేశ్ నేత

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ పిల్లర్‌ను బాంబులతో పేల్చివేశారంటూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక మూర్ఖుడిలా, మతిభ్రమించి ఆరోపణలు చేశారని బీజేపీ నేత, మాజీ ఎంపీ వెంకటేశ్ నేత మండిపడ్డారు. 'అసలు మీకు జ్ఞానముందా? ఒక మాజీ ఐపీఎస్ అధికారి మాట్లాడే మాటలేనా అవి.. మేడిగడ్డ పిల్లర్‌ను బాంబులతో పేలిస్తే, ఆనాటి మీ ప్రభుత్వం ఎందుకు సీబీఐ విచారణ కోరలేదు? మేడిగడ్డ కుంగుబాటుకు బీజేపీకి ఏం సంబంధం?' అని నిలదీశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి హాలీవుడ్ స్థాయిలో ఆర్ఎస్ ప్రవీణ్ కట్టుకథ అల్లారని దుయ్యబట్టారు. కల్పిత కథల డైరెక్టర్‌గా హాలీవుడ్‌కు వెళ్లాలని.. ఆయనకు బాంబు భాస్కర్ అవార్డు కూడా వస్తుందని ఎద్దేవా చేశారు.

తెలంగాణకు యూరియా ఇవ్వకుండా వివక్ష

- నేడు పార్లమెంటులో వాయిదా తీర్మానం ఇస్తాం: చామల

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు యూరియా ఇవ్వకుండా కేంద్రం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి దుయ్యబట్టారు. ఇదే అంశంపై సోమవారం పార్లమెంటులో వాయిదా తీర్మానం ఇస్తామని, మకరద్వారం వద్ద నిరసన తెలుపుతామని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో చామల మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, కేంద్రం మాత్రం ఉద్దేశపూర్వకంగానే యూరియా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. 'తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌లో 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. జూలై వరకు 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేంద్రం కేవలం 4.36 లక్షల మెట్రిక్ టన్నులే ఇచ్చింది. సకాలంలో యూరియా అందించాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు నేను కూడా కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు వినతి పత్రాలిచ్చాం. కానీ కేంద్రం స్పందించలేదు' అని చెప్పారు. ఈ విషయమై పార్లమెంటులో చర్చకు పట్టుపడతామని, రైతుల పక్షాన కేంద్రాన్ని నిలదీస్తామని తెలిపారు.

21న ఓయూలో హాస్టల్ భవనాలను.. ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఆ హోదాలో ఓయూలో ప్రసంగించనున్న తొలి సీఎం

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే విధంగా రూ. 80 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఓయూ ఉప కులపతి ప్రొ. కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. సి కాశీం ఆదివారం సీఎం నివాసంలో ఆయన్ను కలిసి ఆగస్టు 21న జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. ఇరవై ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డినే అని వారు చెప్పారు. అదే రోజు ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి "తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు, ప్రభుత్వ ప్రణాళిక" అనే అంశం మీద సీఎం ప్రసంగించనున్నారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టళ్ల నిర్మాణాలకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. దాంతో పాటు ఈ కార్యక్రమంలో "సీఎం రీసెర్చ్ ఫెలో షిప్" అనే పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

జలాల్లో వాటా తేలాకే.. ప్రాజెక్టులు కట్టుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమని.. తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం, బీడు భూములను సాగులోకి తెచ్చుకోవడం కోసమని చెప్పారు. ఏపీలోని విశాఖ నగర పర్యటనకు వచ్చిన భట్టి ఆదివారం ఉదయం అక్కడ మీడియాతో మాట్లాడారు. సముద్రంలోకి వెళ్లే జలాలు అంటూ ఏపీ నేతలు మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. గోదావరి నదిపై తెలంగాణ చేపట్టిన ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్, దేవాదుల వంటి ప్రాజెక్టులు పూర్తికాలేదని చెప్పారు. తమ ప్రాజెక్టులు వాటాలు తేల్చి మిగిలిన వాటిని సమృద్ధిగా వాడుకోవచ్చని పేర్కొన్నారు. అలాకాకుండా తమ అవసరాలు తీరకుండా దిగువన ప్రాజెక్టులు నిర్మిస్తే.. భవిష్యత్తులో నీటి కేటాయింపుల సమస్యలు వస్తాయని స్పష్టం చేశారు. నీటి వాటాలు తేల్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతి లేదని, పార్టీ తెలంగాణలో బలంగా ఉండాలనే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరుతున్నారని భట్టి చెప్పారు. ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ వెలుగొందుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి హాట్‌లైన్‌లో టచ్‌లో ఉన్నారంటూ వైఎస్ జగన్ చేసిన ఆరోపణలు ఆయన వ్యక్తిగతమన్నారు. కాగా, నచ్చిన పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును కేంద్ర పాలకులు కాలరాస్తున్నారని భట్టి విమర్శించారు. అందుకే తమ నాయకుడు రాహుల్‌గాంధీ ఉద్యమిస్తున్నారని, ప్రజలు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

23న టీపీసీసీ పీఏసీ భేటీ

మహేశ్‌గౌడ్, పొన్నంతో సీఎం రేవంత్ సమావేశంలో నిర్ణయం

- స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై పీఏసీలో చర్చ
- 42%పై పార్టీ పరంగా భేటీలో తీర్మానం
- ఆ తర్వాత ప్రభుత్వ పరంగా ముందుకు

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం వీలున్న అన్ని అవకాశాలనూ పరిశీలిస్తోంది. ఈ అంశంపై చర్చించేందుకు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఈ నెల 23న సమావేశం కానుంది. గాంధీభవన్‌లో జరగనున్న ఈ భేటీలో ప్రధానంగా ఈ అంశంపైనే చర్చించి.. పార్టీ పరంగా నిర్ణయానికి రానున్నారు. అనంతరం దానికి అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గంలో సమీక్షించి.. ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ తీసుకువచ్చిన ఆర్డినెన్సు రెండూ కేంద్ర ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉన్న విషయం తెలిసిందే. అయితే నెలలు గడుస్తున్నా వీటిపై కేంద్రం ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో అసెంబ్లీలో తీర్మానం ద్వారా జీవో తీసుకువస్తే ఎలా ఉంటుందన్నదానిపై న్యాయ నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సమీక్షిస్తున్నారు. లేదా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి ముందుకు వెళ్లాలన్న అంశంపైనా పరిశీలన జరుగుతోంది. ఈ అంశాలపై చర్చించేందుకు పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ భేటీలో నిర్ణయించారు. అయితే రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ భేటీ వాయిదా పడుతూ వచ్చింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటలకు టీపీసీసీ పీఏసీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. స్థానిక ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోపాటు సంస్థాగతంగా పార్టీ నిర్మాణంపైనా పీఏసీ భేటీలో చర్చించనున్నారు. అనంతరం ఒకటి, రెండు రోజుల తరువాత బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై క్యాబినెట్ భేటీ జరగనుంది. పీఏసీలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా.. బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ ఒక నిర్ణయానికి రానుంది. ఇదిలా ఉండగా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు కూడా సమావేశమయ్యారు. ఈ నెల 22న శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో అమరవీరుల స్మారక స్తూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

ప్రైవేటు అంబులెన్స్‌ల దందాకు కళ్లెం?

(మొదటి పేజీ తరువాయి)



వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు వైద్య శాఖ కమిషనర్ డాక్టర్ సంగీతా సత్యనారాయణ ప్రైవేటు అంబులెన్స్‌ల వివరాలను సేకరిస్తున్నారు. ఒక్క పాలమూరు జిల్లాలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల దోపిడీపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రోగుల పరిస్థితిని బట్టి వాళ్లను తప్పుదోవ పట్టించడం లేదా అధిక చార్జీలు వసూలు చేయడం వంటివి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఖమ్మం పట్టణానికి చెందిన శ్రీనివాస్ తండ్రి ఓ రోజు గుండెపోటుకు గురయ్యారు. తక్షణమే ఆయన్ను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి తక్షణమే హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. అంబులెన్స్ కోసం ఆరా తీయగా.. వెంటనే ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ రంగంలోకి దిగాడు. రోగికి ఆక్సిజన్ అవసరం ఉంటుందని, అలాగే వైద్యుడు తోడుగా ఉండాలని హడావుడి చేశాడు. తండ్రి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అంబులెన్స్ డ్రైవర్ చెప్పిన దానికల్లా శ్రీనివాస్ అంగీకరించాడు. అయితే, ఆర్థిక స్తోమత లేకపోవడంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. ఖమ్మంలో ప్రయాణం ప్రారంభం కాగానే సర్కారీ దవాఖానాకే వెళదామని చెప్పిన డ్రైవర్.. సూర్యాపేట దాటాక మాట మార్చాడు. సర్కారీలో వైద్యులుండరని, సరిగా సేవలందవని శ్రీనివాస్‌ను బెదరగొట్టాడు. ప్రైవేటుకు వెళితేనే బతికిబట్టకడతారని చెప్పాడు. చివరికి అంబులెన్స్ డ్రైవర్ అనుకున్నట్లుగానే తనకు తెలిసిన, కమీషన్ ఇచ్చే ప్రైవేటు ఆస్పత్రికే తీసుకెళ్లాడు. అంతేకాదు ఆక్సిజన్‌తో పాటు వైద్యుడిని కూడా తెచ్చినందుకు ఏకంగా రూ.30 వేలు వసూల్ చేశాడు. ఈ మధ్య కాలంలో జరిగిన ఈ ఘటనను శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. మరోవైపు, ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రైవేటు అంబులెన్స్‌ల దందాపై ఏకంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. పాలమూరు జిల్లాలోని రోడ్డు ప్రమాద బాధితులకు హైదరాబాద్‌లోని సర్కారీ దవాఖానాల్లో బెడ్లు లేవని చెబుతూ అమీర్‌పేట, ఎల్బీ నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో అంబులెన్స్ డ్రైవర్లు ఆస్పత్రి బిల్లులో 25-30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. దీనిపై అక్కడి ప్రజాప్రతినిధులు విచారణ చేయగా.. అంబులెన్స్‌ల దోపిడీ బయటపడింది.

ఆ జిల్లాల్లో హవా..

తెలంగాణ వ్యాప్తంగా ప్రైవేటు అంబులెన్స్ యజమానులంతా ఒక నెట్‌వర్క్‌లా ఏర్పడి వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని జిల్లాల్లో ప్రైవేటు అంబులెన్స్‌ల వ్యవస్థ మరీ అరాచకంగా ఉంటోంది. ఆస్పత్రుల బిజినెస్ బాగా జరిగే చోటనే ప్రైవేటు అంబులెన్స్‌ల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. రోగిని ఒక ఆస్పత్రి నుంచి మరో చోటుకు తరలించాలనగానే.. అంబులెన్స్ యజమానులకు సమాచారం అందుతోంది. వాట్సాప్ నెట్‌వర్క్‌ల ద్వారా రోగిని మరో ప్రైవేటు ఆస్పత్రికి ఎలా తరలించాలనేది ముందే నిర్ణయిస్తారు. ప్రైవేటు ఆస్పత్రులు ఇచ్చే కమీషన్ ఆధారంగా అంబులెన్స్‌ల ద్వారా రోగులను చేరవేయడం పరిపాటిగా మారింది. కొన్నిసార్లు ఆస్పత్రుల బిల్లు కంటే అంబులెన్స్‌ల వాయింపే ఎక్కువగా ఉంటోందని బాధితులు వాపోతున్నారు. రాష్ట్రంలో ప్రైవేటు అంబులెన్స్‌ల దందా ఎక్కువగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డిలో ఉంటోంది. కోల్‌బెల్ట్ ఏరియాలోనూ ఈ ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. మంచిర్యాల, పెద్దపల్లిలో ప్రైవేటుకు వచ్చే కేసులు ఎక్కువగా కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. కరీంనగర్ కేసులు హైదరాబాద్‌కు రిఫర్ అవుతున్నాయి. ఈ రిఫరల్ దందాలో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లదే కీలక పాత్ర. ఇక ఖమ్మం, మహబూబ్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో ప్రైవేటు అంబులెన్స్‌ల దందా ఎక్కువ నడుస్తున్నట్లు వైద్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రైవేటు అంబులెన్స్‌లు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రులు, ఇతర ప్రైవేటు ఆస్పత్రుల బయటే ఉంటున్నాయి. ఒక వేళ రోగిని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వేరే చోటుకు తరలించాలంటే బయటి వాహనాలను ఏ మాత్రం రానివ్వడం లేదు.. ప్రభుత్వ అంబులెన్స్ 108 వాహనాలను కూడా ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లు అడ్డుకుంటున్నారు. కొన్నిసార్లు 108 సిబ్బందిని బెదిరిస్తున్నారు. తమ అంబులెన్స్‌లోనే తీసుకెళ్లాలని బెదిరింపులకు దిగడం సాధారణంగా మారిందని కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ బాధితుడు తెలిపారు. అంబులెన్స్‌లో బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్), అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్ఎస్), ఐసీయూ అంబులెన్స్‌లు ఉంటాయి. కి.మీ.కు ఇంత చార్జ్ అనే నిబంధన వీటికి లేదు అంబులెన్స్ రకాన్ని బట్టి గుంజేస్తారు. బీఎల్ఎస్ అంబులెన్స్ అయితే 10 కి.మీ. రూ.5 వేల వరకు, ఏఎల్ఎస్ అయితే రూ. 6-8 వేలు, ఐసీయూ అయితే రూ.10 వేల వరకు వసూల్ చేస్తున్నారు. ఇక మృతదేహాలను తీసుకెళ్లాలంటే రెట్టింపు చార్జీలు తీసుకుంటున్నారు.

వనస్థలిపురం నుంచి నిమ్స్‌కు రూ.2,500

మా నాన్నకు కిడ్నీలు చెడిపోవడంతో వనస్థలిపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించాం. వారం తర్వాత వైద్యులు నిమ్స్‌కు తీసుకెళ్లాలని రిఫర్ చేశారు. అందుకోసం ఓ ప్రైవేటు అంబులెన్స్‌ను మాట్లాడాం. వనస్థలిపురం నుంచి నిమ్స్‌కు రూ.2,500 వసూల్ చేశారు. ప్రైవేటు అంబులెన్స్‌లపై సర్కారు పర్యవేక్షణ ఉండాలి. ప్రతి కి.మీ.కు ఒక రేటు పెట్టాలి. అప్పుడే అంబులెన్స్ దౌర్జన్యాల నుంచి సాధారణ ప్రజానీకానికి ఉపశమనం కలుగుతుంది.

\- రాజేందర్‌రెడ్డి, హయత్‌నగర్.

పర్యవేక్షణ ఏదీ?

ప్రైవేటు అంబులెన్స్‌లపై ఏ శాఖ పర్యవేక్షణ ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రైవేటు అంబులెన్స్‌ల రిజిస్ట్రేషన్ వరకే రవాణా శాఖ పరిమితమవుతోంది. ఆ తర్వాత అవి ఏ శాఖ పరిధిలోకి రావడం లేదు. ఇంకా చెప్పాలంటే అసలు ఏ శాఖ పరిధిలోకి వస్తాయో కూడా వైద్య శాఖ ఉన్నతాధికారులకు అవగాహన లేదు. ఈ నేపథ్యంలో ప్రైవేటు అంబులెన్స్‌ల దందాపై ఎవరికి ఫిర్యాదు చేయాలో బాధితులకు తెలియడం లేదు. తమపై ఫిర్యాదులు చేసేవారు లేకపోవడం, ఏ శాఖ పరిధిలోకి కూడా రాకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌ల దందా దర్జాగా నడుస్తోంది. దేశంలో ప్రైవేటు అంబులెన్స్ సేవలు జాతీయ, రాష్ట్ర స్థాయి నిబంధనల మేరకు నిర్వహించబడతాయి. మోటారు వాహనాల చట్టం 1988 జాతీయ అంబులెన్స్ కోడ్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట పరిధిలో వీటిపై పర్యవేక్షణ ఉండాలి. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని జిల్లాల్లో కలిపి ఆరు సీట్ల సామర్థ్యం కలిగిన ప్రైవేటు అంబులెన్స్‌లు 1,625 ఉన్నాయి. అత్యధికంగా హైదరాబాద్‌లో 478 ఉన్నాయి. వీటితో పాటు మారుతీ మినీ ఇకో అంబులెన్స్‌లు మరో 1,000-1,500 ఉన్నాయి. మరోవైపు సర్కారు ఆధ్వర్యంలో నడిచే 108అంబులెన్స్‌లు 626వరకు ఉన్నాయి. అవి సరిపోనందువల్లే ప్రైవేటు అంబులెన్స్‌ల డ్రైవర్లు రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఊహాజనిత ఫ్యూచర్‌సిటీకి ఫ్యూచర్ లేదు: కేటీఆర్

హైదరాబాద్/గంభీరావుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో తన కుటుంబసభ్యుల ప్రయోజనంకోసం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరదని, ఆయన చెప్పే ఊహాజనిత ఫ్యూచర్‌సిటీకి భవిష్యత్తులేదని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దుచేసి, దాని స్థానంలో ఫ్యూచర్‌సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులు కాంగ్రెస్ సర్కార్ చేతిలో మోసపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అవసరంతో పాటు.. ఎన్నికల సంఘానికే సమగ్ర ప్రక్షాళన అవసరమని కేటీఆర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు అధ్వాన్నస్థితికి చేరుకున్నాయని.. విద్యారంగంపట్ల కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలంగాణ భవన్‌లో ఆరోపించారు.

ఆడబిడ్డ ఆహ్వానం.. మనసును కదిలించింది

ఆడబిడ్డ ఆహ్వానం.. తన మనసును కదిలించిందని కేటీఆర్ అన్నారు. తండ్రి, అన్నయ్యను కోల్పోయిన నవత అనే యువతి.. తన వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కోరిన మేరకు కేటీఆర్ ఆదివారం సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

తెలంగాణ సర్కార్ హెలికాప్టర్‌ను రాహుల్ ఏ హోదాలో వాడుతున్నారు?: రాకేశ్ రెడ్డి

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఖర్గే తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టర్‌ను ఏ హోదాలో వాడుతున్నారని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రతిని పట్టుకుని ఊరేగే రాహుల్ గాంధీకి ఇది చట్ట విరుద్ధం అని తెలియదా అని నిలదీశారు.

సింగూరు భద్రతకు శాశ్వత చర్యలు

- ఆనకట్ట పటిష్ఠతకు 16 కోట్లు: దామోదర

పుల్‌కల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకుంటుందని, ఆనకట్ట పటిష్ఠతకు రూ.16 కోట్లు మంజూరయ్యాయని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం ఇసోజీపేట గ్రామ శివారులో భారీ వర్షాలకు సింగూరు ఎడమ ప్రధాన మెయిన్ బ్రాంచి కెనాల్‌కు పడిన గండిని ఆదివారం మంత్రి రాజనర్సింహ.. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి పరిశీలించారు. గండి పడిన ప్రాంతానికి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో వారంతా ట్రాక్టర్‌లో వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. తరుచుగా ఇక్కడ కాలువకు గండి పడుతున్నదని, అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. యుద్ధప్రాతిపదికన కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మంత్రి సింగూరు ప్రాజెక్టు వద్దకు చేరుకుని అంతర్భాగంలో ఆనకట్ట దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. వానాకాలం తర్వాత సింగూరు కాల్వలకు సిమెంట్ లైనింగ్ పనులను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

కరెంటు లేని బడులు 5431

(మొదటి పేజీ తరువాయి)



విద్యుత్తు లేని బడుల సంఖ్య 3366గా ఉంది. మొత్తం బడుల్లో ఇది 7.84%.

- రాష్ట్రంలో ప్రత్యేకంగా బాలికల మరుగుదొడ్లు లేని బడుల సంఖ్య 2811గా ఉండగా, 5124 పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించినా ఉపయోగంలో లేవు. అలాగే మొత్తం పాఠశాలల్లో 6459 బడుల్లో బాలురకు మరుగుదొడ్లు లేవు.
- రాష్ట్రంలోని 42,901 బడులకుగాను 33,434 స్కూళ్లలో కంప్యూటర్ వసతి ఉండగా.. 9467 పాఠశాలల్లో (22.06%) లేదు. 25,787 బడుల్లో (60.1%) ఇంటర్‌నెట్ సౌకర్యం లేదు.
- 1101 బడుల్లో తాగునీటి సౌకర్యం లేకపోగా.. 3139బడుల్లో నీటివసతి ఉన్నా వినియోగంలో లేదు.
- తెలంగాణలోని మొత్తం 42,901 బడుల్లో 2022-23 విద్యాసంవత్సరానికిగాను 33,940 పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యశిబిరాలు నిర్వహించగా, 8961 బడుల్లో నిర్వహించలేదు.

14.3 శాతమే..

విద్యార్థి విద్యా జీవితానికి కీలకమైన ప్రాథమిక విద్యలో తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా మొత్తం ప్రాథమిక పాఠశాలల్లో 24 శాతం ఉపాధ్యాయులుండగా, మాధ్యమిక పాఠశాలల్లో 28.6, ఉన్నత పాఠశాలల్లో 47.3శాతం మంది ఉన్నారు. రాష్ట్రాలవారీగా చూస్తే ప్రాథమిక విద్యలో అతి తక్కువ ఉపాధ్యాయులున్న రాష్ట్రాల్లో గుజరాత్, కర్ణాటక, తెలంగాణ తొలి 3 స్థానాల్లో నిలిచాయి. గుజరాత్‌లోని మొత్తం బడుల్లో ప్రాథమిక టీచర్ల శాతం కేవలం 8.6శాతంగా ఉండగా.. మాధ్యమిక, ఉన్నత బడుల్లో 56.1%, 35.3 శాతంగా ఉంది. అలాగే కర్ణాటకలో ఈ శాతాలు వరుసగా 10.9, 34.2, 54.9గా ఉన్నాయి. ఇక మన రాష్ట్రంలోని మొత్తం పాఠశాలల ఉపాధ్యాయుల్లో ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 14.3శాతమే ఉండగా, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో 16.0, 69.6శాతంగా ఉన్నారు.

గురుశిష్యుల నిష్పత్తిలో ముందంజ..

ఉపాధ్యాయుడు, విద్యార్థి నిష్పత్తిలో తెలంగాణ అనేక రాష్ట్రాల కంటే ముందంజలో ఉంది. రాష్ట్రంలోని 42,901 పాఠశాలల్లో.. 72.93 లక్షల విద్యార్థులు, 3.41 లక్షల ఉపాధ్యాయులు ఉన్నారు. అంటే తెలంగాణలో సగటున ప్రతి 21 మంది విద్యార్థులకూ ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. విద్యలో, అక్షరాస్యతలో ముందంజలో ఉన్న కేరళలో ప్రతీ 22 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండగా.. ఢిల్లీలో ఆ సగటు 28గా, గుజరాత్‌లో 29గా, కర్ణాటకలో 27, ఆంధ్రప్రదేశ్‌లో 26, తమిళనాడులో 24గా ఉంది. జాతీయసగటు 25:1గా ఉంది. జాతీయ సరాసరితో పోలిస్తే తెలంగాణ ఎంతో మెరుగ్గా ఉంది.

టీచర్ల సంఖ్యలో ఢిల్లీ టాప్..

ఒక్కో పాఠశాలలో సరాసరి ఉపాధ్యాయుల సంఖ్య చూస్తే.. 29 మంది ఉపాధ్యాయులతో ఢిల్లీ ప్రథమస్థానంలో నిలిచింది. 18 మందితో కేరళ రెండోస్థానంలో ఉండగా తెలంగాణలో 8 మంది ఉన్నారు. ఈ విషయంలో జాతీయసగటు 7గా ఉంది. అలాగే పాఠశాలలో సరాసరి విద్యార్థుల సంఖ్యలో కేరళ ప్రథమస్థానంలో ఉంది. అక్కడ ఒక్కో పాఠశాలలో సగటున 396 మంది విద్యార్థులు ఉన్నారు. హరియాణాలో 238 మంది విద్యార్థులు ఉండగా.. బిహార్‌లో 225, తమిళనాడులో 221, గుజరాత్‌లో 214 మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కూళ్లలో సగటున 142 మంది విద్యార్థులు ఉండగా.. తెలంగాణలో ఒక్కో పాఠశాలలో సరాసరి విద్యార్థుల సంఖ్య 170గా ఉంది.

విద్యార్థుల్లేని బడుల్లో 3వ స్థానంలో..

2023-24 విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా చేరని పాఠశాలల సంఖ్యలో పశ్చిమబెంగాల్ అగ్రస్థానంలో ఉంది. అక్కడ 3254 బడుల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. తర్వాత 2167తో రాజస్థాన్ రెండోస్థానంలో ఉండగా 2097తో తెలంగాణ తృతీయ స్థానంలో ఉంది. అంటే.. రాష్ట్రంలోని 2097 బడుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. అలాగే తెలంగాణలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 5985 ఉన్నాయి. ఈ జాబితాలో 13,198 బడులతో మధ్యప్రదేశ్ ప్రథమస్థానంలో ఉండగా, 12,611 స్కూళ్లతో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో, 8866 పాఠశాలలతో ఉత్తరప్రదేశ్ మూడోస్థానంలో నిలిచాయి. దేశవ్యాప్తంగా మొత్తం 1,10,971 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి.

- తెలంగాణలో ఒక్కరే టీచర్ ఉన్న బడుల్లో 2023-24లో మొత్తం 88,429 మంది విద్యార్థులు చేరారు.
- సామాజికవర్గాల వారీగా చూస్తే.. తెలంగాణలో ఓబీసీ వర్గం విద్యార్థులు 49.7శాతంగా ఉండగా, జనరల్ 24.3 శాతం, 16 శాతం ఎస్సీలు, 15.5% ముస్లింలు, 10 శాతం ఎస్టీలు ఉన్నారు.

మోటార్లు మీరు ఆన్ చేస్తారా? మేం ఆన్ చేయాలా?

కాళేశ్వరంపై అబద్ధపు ప్రచారాలను కప్పిపుచ్చుకొనేందుకు ప్రభుత్వం కుట్ర: హరీశ్

సిద్దిపేట ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందనే అబద్ధపు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. గోదావరిలో వరద జలాలను ఒడిసిపట్టకుండా, వృధాగా సముద్రంలోకి వదిలేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాల కోసం రైతులపై పగ తీర్చుకుంటోందని వ్యాఖ్యానించారు. ఎల్లంపల్లికి భారీగా వరద వస్తోందని, మోటార్లు ఆన్ చేస్తే నీళ్లు మిడ్ మానేరులోకి వచ్చిపడతాయని.. అయినా ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయడం లేదని చెప్పారు. 'మోటార్లు మీరు ఆన్ చేస్తారా? లేక వేలాది మంది రైతులతో కలిసి వచ్చి మేమే మోటార్లు ఆన్ చేయాలా?' అని నిలదీశారు. ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. "ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 62వేల క్యూసెక్కుల వరద వస్తోంది. కడెం ప్రాజెక్టు నుంచి లక్షన్నర క్యూసెక్కుల వరద ఎల్లంపల్లికి వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంపుహౌస్, నంది మేడారంలో మోటార్లు స్విచాన్ చేస్తే రోజుకు రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయి. వారం కిందటే మంత్రి ఉత్తమ్‌కు దీనిపై లేఖ రాశాం. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు, చెరువులు ఖాళీగా ఉన్నాయని.. వరద నీటిని ఎత్తిపోసి నింపాలని కోరాం. కానీ స్పందన లేదు. మోటార్లు ఆన్ చేయకుండా నీళ్లన్నీ సముద్రంలోకి వదులుతున్నారు" అని హరీశ్‌రావు మండిపడ్డారు. వానలు సరిగా లేక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చెరువులు నిండలేదని, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకుని, వరద నీటిని ఒడిసిపట్టాలన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని చెప్పిన అబద్ధాన్ని కప్పిపుచ్చుకోవడానికి మోటార్లను ఆన్ చేయడం లేదా? కృష్ణా ప్రాజెక్టులకు వరదలతో ఉచితంగా జల విద్యుత్తు అందుతోంది. దానితో మోటార్లు నడిపించి రిజర్వాయర్లు నింపడానికి రేవంత్‌రెడ్డికి, ఉత్తమ్‌కు ఏం అడ్డం వచ్చింది? మిడ్ మానేరు, ఎల్ఎండీ ఖాళీగా ఉన్నాయి. ఎస్సారెస్పీలోకి వరద వస్తున్నా వరద కాలువ తెరిచి వాటిలోకి నీళ్లు ఎందుకు వదలడం లేదు?" అని హరీశ్‌రావు నిలదీశారు. రిజర్వాయర్లన్నీ నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంటలు పండుతాయని చెప్పారు.

మోటార్లు పాడయ్యేలా కుట్ర!

కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్ల నిర్వహణలో ప్రభుత్వం కుట్ర చేస్తోందని.. వాటిని తరచూ ఆన్, ఆఫ్ చేస్తూపోతే పాడైపోయి వేల కోట్ల నష్టం వస్తుందని హరీశ్‌రావు ఆరోపించారు. బీహెచ్ఈఎల్ సంస్థ కూడా దీనిపై ప్రభుత్వాన్ని హెచ్చరించిందని చెప్పారు. మోటార్లు పాడైపోయేలా చేసి బీఆర్ఎస్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. తాను అవగాహనతోనే ఈ విషయం చెబుతున్నానన్నారు.


యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి గర్భాలయం క్యూలైన్లలో భక్తులు

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో కొండపై రద్దీ నెలకొంది. మూడు రోజుల పాటు (శుక్ర, శని, ఆదివారం) వరుస సెలవుల నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉభయ క్యూలైన్లలో రద్దీ కనిపించింది. సుమారు 55వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం(ఆరగింపు) సమయాల్లో ఉభయ క్యూలైన్లలో భక్తులు సుమారు 3గంటలు వేచి ఉన్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.55,05,696 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

» అధ్యక్షుడిగా సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా లింగారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నల్లగొండకు చెందిన ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ నుంచి టి.లింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.శంతన్(నిజామాబాద్), వి.రాజిరెడ్డి(కరీంనగర్), టి.శ్రీశైలం(మహబూబ్‌నగర్), బి.రేణుక(హైదరాబాద్), చాప బాబు(ములుగు) ఎన్నికయ్యారు. అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకులుగా ఎం.గంగాధర్(హనుమకొండ), ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.ఈశ్వర్ రెడ్డి(కరీంనగర్), సభ్యులుగా సిహెచ్.వెంకటేశ్వర్లు(సూర్యాపేట), బి.సదానందం(సిరిసిల్ల) ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవనంలో జరిగిన 15వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.


ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 24 కుక్క పిల్లల దత్తత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణకు జీహెచ్ఎంసీ చేపట్టిన దత్తత కార్యక్రమానికి హైదరాబాద్ వాసుల నుంచి మంచి స్పందన వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలు నేపథ్యంలో వీధి కుక్కలను పట్టుకునేందుకు ఓ పక్క ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన జీహెచ్ఎంసీ.. మరోపక్క 'బీ ఏ హీరో.. అడాప్ట్ డోంట్ షాప్' నినాదంతో కుక్కపిల్లల దత్తతకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా బంజారాహిల్స్‌లోని జలగం వెంగళరావు పార్కులో ఆదివారం నిర్వహించిన మేళాలో 39 దేశవాళీ కుక్క పిల్లలను దత్తతకు అందుబాటులో ఉంచింది. ఇందులో 24 కుక్క పిల్లలను హైదరాబాద్‌కు చెందిన జంతు ప్రేమికులు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ.. కుక్క పిల్లల దత్తత కార్యక్రమం వీధి కుక్కల నియంత్రణకు దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


కుక్కపిల్లలను ఆప్యాయంగా ఎత్తుకున్న చిన్నారులు

మద్యం మత్తులో రోడ్డెక్కేస్తున్న కుర్రకారు!

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో అధికంగా దొరుకుతుంది యువతే

సైబరాబాద్ పరిధిలో వారంలో 272 కేసులు.. ఇందులో 18-30 ఏళ్ల వారు 126 మంది

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరం అనే మాటను హైదరాబాద్ యువత పెడచెవిన పెడుతోందా? మద్యం మత్తులో రోడ్డెక్కి ప్రమాదం అంచున దూసుకెళుతోందా? అంటే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల వివరాల జాబితా అవుననే అంటోంది. హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన వారిలో యువతే అధికంగా ఉంటున్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో 272 మందిపై భారతీయ న్యాయ సంహిత-2023 సెక్షన్ 105 ప్రకారం డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని పోలీసులు ఆదివారం ప్రకటించారు. మాదాపూర్, రాజేంద్రనగర్, శంషాబాద్, గచ్చిబౌలి, షాద్‌నగర్, చేవెళ్ల, నార్సింగి, రాయదుర్గం, మియాపూర్, కూకట్‌పల్లి, బాలానగర్, జీడిమెట్ల, అల్వాల్, కేపీహెచ్‌బీ, మేడ్చల్, ఆర్‌సీ పురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. అయితే, ఈ 272 మందిలో 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు వారు 126 మంది ఉండడం గమనార్హం. పోలీసులు విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 18-20ఏళ్ల లోపు వారు 8 మందిపై, 21-30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన 118 మందిపై కేసులు నమోదయ్యాయి. అలాగే, 31-40 ఏళ్ల లోపు వారు 90 మంది, 41-50 ఏళ్లలోపు వయస్సు వారు 42 మంది, 51-60 ఏళ్ల లోపు ఉన్న 10 మంది, 61 ఏళ్ల పైబడిన నలుగురిపై కేసులు నమోదయ్యాయి. ఇక, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ద్విచక్రవాహనదారులే అధికంగా ఉండడం గమనార్హం. మొత్తం 272 కేసుల్లో 227 మంది ద్విచక్రవాహనదారులు ఉన్నారు. త్రిచక్రవాహనదారులు 15, ఫోర్ వీలర్ వాహనదారులు 29 మంది ఉన్నారు. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నా.. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని పోలీసులు కోరుతున్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి జరిమానాతోపాటు పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.



డ్రంకెన్ డ్రైవ్ కేసులు

వయస్సు	కేసులు
18-20	8
21-30	118
31-40	90
41-50	42
51-60	10
61 ఏళ్ల పైవారు	4

రహదారుల పైనా ఏఐ!

హడలెత్తిస్తోన్న రోడ్డు ప్రమాదాలకు చెక్.. ప్రమాదాలను తగ్గించేందుకు స్మార్ట్ విధానాలపై దృష్టి

» భారత్, తెలంగాణలోనూ ఆ దిశగా అడుగులు

» ప్రమాదం జరిగిన వెంటనే అధికారులకు సమాచారం

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏటా లక్షలాది మందిని బలి తీసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారం తీసుకునే దిశగా ప్రపంచ దేశాలన్నీ అడుగులు వేస్తున్నాయి. ఆయా దేశాలన్నీ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఈ మేరకు వాహనదారుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యంగా ఏఐ ఆధారిత 'అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ విధానంలో మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్ వినియోగించుకునే ఏఐ ఆధారిత కెమెరాలను రహదారులపై ఏర్పాటు చేస్తారు. ఈ అత్యాధునిక వ్యవస్థ ద్వారా తొలుత హైవేలపై నిబంధనల ఉల్లంఘనకు చెక్ పెడతారు. వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోకపోయినా, పరిమితికి మించి వేగంతో నడిపినా ఈ స్మార్ట్ కెమెరాలు సులువుగా పసిగడతాయి. వెంటనే ప్రయాణికులకు సిగ్నల్స్ రూపంలో హెచ్చరికలు జారీచేస్తాయి. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక సిబ్బందికి, జాతీయ రహదారుల అధికారులకు సమాచారం అందిస్తాయి. అవసరమైన ఎమర్జెన్సీ సేవలను అక్కడికి పంపేలా పని చేస్తాయి. నిబంధనలు అతిక్రమించిన వాహన వివరాలను సంబంధిత అధికారులకు చేరవేయడంతో పాటు మానవ ప్రమేయం లేకుండానే చలాన్లు జారీ చేస్తాయి. ఇలా హైవేలపై టెక్నాలజీ వినియోగం ద్వారా కనీసం 2030నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఏడాదిలో నమోదవుతున్న రోడ్డు ప్రమాదాలు, తద్వారా సంభవిస్తున్న మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో ఆయా దేశాలు ముందుకు సాగుతున్నాయి.



అమెరికా, చైనాల్లో ఇప్పటికే స్మార్ట్ విధానం

అమెరికా, చైనా దేశాలు ఇప్పటికే తమ దేశాల్లో చాలా చోట్ల స్మార్ట్ విధానాల్ని అమల్లోకి తెచ్చాయి. ముఖ్యంగా చైనా అయితే వాహనాల తయారీ సంస్థలతోనే చర్చలు జరుపుతోంది. అత్యంత భద్రతతో కూడిన వాహనాలను ప్రజలకు అందించాలని, ప్రమాదాలు జరిగినా ప్రయాణికులు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా సంస్థలకు సూచిస్తోంది. అలాగే ఆస్ట్రేలియా కూడా స్మార్ట్ రోడ్ టెక్నాలజీని అమలుచేస్తోంది. రాత్రిపూట జరిగే ప్రమాదాలను తగ్గించే విధంగా రోడ్లకు అంచున ఫొటో లూమినిసెంట్ మార్కింగ్‌లను చేస్తోంది. ఇది పగటిపూట సూర్య కిరణాలను గ్రహించుకుని, రాత్రిపూట ఒక రకమైన రంగులో మెరుస్తుంది. అది వాహనదారులకు రోడ్డు ఎటువైపుగా ఉందో.. ఎటు వెళ్లాలన్నది స్పష్టంగా తెలియజేస్తుంది.

ప్రయోగాత్మకంగా ఢిల్లీ-గురుగ్రామ్ హైవేపై

భారత్‌లోనూ ఢిల్లీ-గురుగ్రామ్ హైవేపై ఈ స్మార్ట్ వ్యవస్థను తాజాగా ప్రారంభించారు. దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది. కిలో మీటరుకు ఒకటి చొప్పున మొత్తం 110 హై రిజల్యూషన్ కెమెరాలను అమర్చింది. ఇవి 24 గంటలు రహదారులపై జరిగే ప్రతి కదలికను రికార్డు చేస్తాయి. ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రమాదాల్ని గుర్తించడం సహా దాదాపు 14 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను ఈ కెమెరాలు గుర్తించగలవు. త్వరలో హైదరాబాద్-నాగపూర్ (ఎన్‌హెచ్-44) మార్గంలోనూ స్మార్ట్ హైవే విధానం అందుబాటులోకి రానుంది. కాగా, రోడ్డు ప్రమాదాలతో దేశ వార్షిక జీడీపీకి మూడు శాతం కలుగుతోందని స్వయంగా కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 2024లో దేశ వ్యాప్తంగా 4.80లక్షల నుంచి 5లక్షల వరకు రోడ్డు ప్రమాదాలు జరగగా.. దాదాపు 1.72లక్షల మందికి మృతి చెందారని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయి. దీని ప్రకారం దేశంలో ప్రతీ గంటకు 20-22 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. తెలంగాణలోనూ ఈ ఏడాది 25,934 ప్రమాదాలు జరగ్గా 7,281 మంది మరణించారని పోలీసు, రవాణా శాఖ నివేదికలు చెబుతున్నాయి. రోజుకు సగటున 70 ప్రమాదాలు, 20 చొప్పున మరణాలు చోటుచేసుకున్నాయని గణాంకాలతో స్పష్టమవుతోంది.

నిర్మాణం, నిర్వహణ లోపాలు

కార్లు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, భారీ వాహనాలు, ఆటోలు, సైకిళ్లు, పాదచారులు ఇలా అందరూ రోడ్డును అస్తవ్యస్తంగా ఉపయోగించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. లోపభూయిష్టమైన రోడ్ల డిజైన్, నాసిరకమైన నిర్మాణాలు, అసమర్థ నిర్వహణతో పాటు మారని మనుషుల తీరు, సంస్థాగత నిర్లక్ష్యం సంక్షోభానికి కారణమవుతున్నాయి. ట్రాఫిక్ నియమాలు కఠినంగా అమలుకాకపోవడం, మితిమీరిన వేగం మద్యం సేవించి వాహనాలు నడపడం, చట్టాలు కఠినంగా లేకపోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు కచ్చితమైన అవగాహన లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి.

గుట్టలుగా దరఖాస్తులు..
అరకొరగా పరిష్కారం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు 8,27,330

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఆగస్టు 15 నాటికి వీలైనన్ని దరఖాస్తులకు పరిష్కారం చూపుతామని అధికారులు ప్రకటించారు. మూడు విడతల్లో 605 మండలాల్లో 10,889 రెవెన్యూ సదస్సులు జరగ్గా.. 8,27,330 దరఖాస్తులు వచ్చాయి. సాదాబైనామా సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున.. ఆ దరఖాస్తులను మినహాయించి.. మిగిలిన వాటిని ఐదు క్యాటగిరీలుగా విభజించి.. న్యాయపరమైన ఇబ్బంది లేని వాటిని ఆగస్టు 15 నాటికి పరిష్కరిస్తామని చెప్పారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సిబ్బంది కొరత, సాంకేతిక ఇబ్బందులతో ఆగస్టు 13 వరకు 8.53 శాతం దరఖాస్తులనే ఆమోదించారు. సమస్య పరిష్కారమైందని తెలుపుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తులు 2.52 శాతమే ఉన్నాయి. రెవెన్యూ సదస్సులు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను క్యాటగిరి చేశాక.. క్షేత్రస్థాయి అధికారులకు కొన్ని సందేహాలు వచ్చాయి. వాటిపై సీసీఎల్ఏ నుంచి స్పష్టత కావాలని కోరినా.. సకాలంలో స్పష్టత ఇవ్వలేదు. అసైన్డ్ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారం, నోటీసుల జారీ వంటి వాటిపై భూ భారతి నిబంధనల్లో మరింత స్పష్టత ఇవ్వాలని తహసీల్దార్లు కోరారు. దీనికి తోడు క్షేత్రస్థాయి సిబ్బంది లేకపోవడంతో నోటీసుల జారీకి కొంత జాప్యం జరిగింది. వచ్చిన దరఖాస్తులకు 8,65,681 నోటీసులు తయారు చేసి.. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, బాధితులకు అందజేయడం పెద్ద ప్రహసనంగా మారింది. ఆగస్టు 15 నాటికి వీలైనన్ని దరఖాస్తులు పరిష్కరించాలనే లక్ష్యంతో కలెక్టర్లు వారి పరిధిలో ఉండే తహసీల్దార్లకు రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ క్రమంలో ఆగస్టు 13 వరకు జరిగిన ప్రక్రియలో.. మొత్తం దరఖాస్తుల్లో 70,540 దరఖాస్తులకు ఆమోదం తెలపగా.. 20,829 దరఖాస్తులకు సంబంధించి ఆన్‌లైన్‌లో సమస్య పరిష్కారమైనట్లు నమోదు చేశారు. మొత్తం దరఖాస్తుల్లో పరిష్కార ఆమోదం పొందినవి 8.53 శాతం కాగా, సమస్య పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేసినవి 2.52 శాతం ఉన్నాయి.

సౌరశక్తితో జీరో బిల్లు

ఔటర్ లోపలే కాదు ఓఆర్ఆర్ ఆవల కూడా సోలార్ యూనిట్లు

» పెరుగుతున్న సౌరవిద్యుత్తు వినియోగం

» కేంద్ర ప్రభుత్వ 'బిజిలీ ముఫ్త్' పథకంతో జోష్

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇంతకాలం ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) పరిధిలో మాత్రమే పరిమితమైన సోలార్ రూఫ్‌టాప్‌లు.. క్రమంగా ఇతర నగరాలు/మునిసిపాలిటీలకూ విస్తరించాయి. ఇప్పుడు గ్రామాల్లోనూ సౌర విద్యుత్తు వెలుగులు జిగేల్‌మంటున్నాయి. కరెంటు బిల్లుల భారం నుంచి తప్పుకోవడానికి వినియోగదారులు.. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు సోలార్ రూఫ్‌టాప్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. సౌర ఫలకాలతో సొంత అవసరాలకు విద్యుత్తును వాడుకోవడమే కాకుండా.. డిస్కమ్‌లకు కూడా విక్రయించే అవకాశాలుంటాయి.



భారీగా తగ్గుతున్న బిల్లులు

సోలార్ ప్లాంట్లతో విద్యుత్తు బిల్లులు భారీగా తగ్గుతున్నాయి. ఎంతలా అంటే..? సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోకముందు 500 యూనిట్ల వినియోగానికి రూ.4 వేల వరకు బిల్లు వచ్చేది. 5 కిలోవాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక.. రూ.290తో సరిపోతోంది. తెలంగాణలో తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలు గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పొందుతుండగా.. మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు బ్యాంకు లోన్‌తోనైనా రూఫ్‌టాప్ సోలార్ అమర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. నెలకు 300 యూనిట్ల బిల్లు వచ్చే కుటుంబం 3 కిలోవాట్ల సోలార్ యూనిట్‌ను అమర్చుకుంటే.. నెలవారీ కరెంటు బిల్లు రూ.175కు పరిమితమవుతోంది. అదే నెలకు 200 యూనిట్లతో రూ.822 బిల్లు వచ్చేవారికి సోలార్ యూనిట్ ఏర్పాటు తర్వాత రూ.75 మాత్రమే వస్తోంది.

బిజిలీ ముఫ్త్ యోజనతో..

దేశవ్యాప్తంగా కోటి మందికి 'ప్రధానమంత్రి-సూర్యఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని వర్తింపజేయాలని కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. రాష్ట్రంలో ఈ పథకం కింద 57,281 దరఖాస్తులు రాగా.. 16,382 కనెక్షన్లు ఇచ్చారు. వీరికి సబ్సిడీ కింద రూ.115.37 కోట్లను కేంద్రం విడుదల చేసింది. గతంలో అమలు చేసిన రూఫ్‌టాప్ సోలార్(ఆర్‌టీఎస్) కింద 567 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్లు పెట్టుకోగా.. తాజాగా కేంద్రం ప్రకటించిన పీఎం సూర్యఘర్ కింద రాష్ట్రంలో 65.48 మెగావాట్ల ప్లాంట్లు పెట్టుకున్నారు. 3 కిలోవాట్ల దాకా సబ్సిడీ కింద రూ.78 వేలు అందితే.. సబ్సిడీ పోనూ యూనిట్ ఏర్పాటు ఖర్చు రూ.1.20 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు అవుతోంది. ప్రతీనెల 150 యూనిట్ల దాకా విద్యుత్తును వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ పెట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే దీనికి అయ్యే వాస్తవిక వ్యయం రూ.1.10 లక్షలు కాగా.. కేంద్ర సబ్సిడీ రూ.60వేలుగా ఉంది. అంటే.. వినియోగదారులు రూ.50 వేలను భరిస్తే సరిపోతుంది. దానికి కూడా బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలిస్తున్నాయి. ఇలా 1-2 కిలోవాట్ల సోలార్ బిగించుకునేవారికి నెలకు కనీస బిల్లు రూ.75 మాత్రమే వస్తోంది. నిజానికి 150 యూనిట్లకు రూ.700 బిల్లు అవుతుంది. 1-2 కిలోవాట్ల సౌర విద్యుత్తుతో రూ.625 ఆదా అవుతోంది.

వినియోగం ఇలా..

సౌర విద్యుత్తు వినియోగదారులు వేసవిలో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తమ రూఫ్‌టాప్‌పై ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నేరుగా వాడుకుంటారు. అదనపు విద్యుత్తు(నెట్ మీటర్ ఉంటే) డిస్కమ్‌లు కొనుగోలు చేస్తాయి. సూర్యాస్తమయం నుంచి తిరిగి సూర్యోదయం దాకా డిస్కమ్‌ల విద్యుత్తును వాడుకోవడమో.. లేదా సౌరవిద్యుత్తును బ్యాటరీలో నిల్వ చేసి వినియోగించుకోవడమో చేయవచ్చు.

3 కిలోవాట్లకే సబ్సిడీ సీలింగ్

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో ఒక్క కిలోవాట్‌కు 40% సబ్సిడీ అందేది. క్రమంగా దాన్ని తగ్గిస్తూ వచ్చారు. ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల మేర సబ్సిడీ పడిపోయింది. అంటే.. 3 కిలోవాట్ల దాకా రూ.54 వేల సబ్సిడీ అందేది. 3-10 కిలోవాట్ల యూనిట్లకు ప్రతి కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇచ్చేవారు. పీఎం సూర్యఘర్ బిజిలీ ముఫ్త్ యోజన తర్వాత సబ్సిడీ కొంత మేర పెరిగింది. అయితే.. 3 కిలోవాట్ల వరకే సబ్సిడీకి అవకాశం ఉంటుంది. గరిష్ఠంగా 3 కిలోవాట్లకు రూ.78వేల సబ్సిడీ వస్తుంది. 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేల చొప్పున సబ్సిడీలు అందుతాయి. సూర్యఘర్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి వారంపది రోజుల్లో ప్యానెళ్ల బిగింపు పూర్తవుతుంది. ఆ తర్వాత నెట్‌మీటర్(డిస్కమ్‌లకు విద్యుత్తు అమ్మేందుకు)ను బిగిస్తారు. ఈ ప్రక్రియలు పూర్తయ్యాక.. రూఫ్‌టాప్ సోలార్ యూనిట్‌కు సంబంధించిన రిపోర్టులు కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు అందగానే.. 15 రోజుల్లో సబ్సిడీ అందుతుందని సన్‌టెక్ సోలార్ ప్రతినిధి సురేశ్ తెలిపారు.

గ్రామాల్లోనూ సోలార్ ప్లాంట్లు

గ్రామాల్లోనూ సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లు పెట్టుకునేవారి సంఖ్య పెరిగింది. 3 కిలోవాట్ల దాకా ప్లాంట్లు పెట్టుకుంటున్నారు. సబ్సిడీ ఉన్నంత సామర్థ్యంలోనే ప్లాంట్లు పెరుగుతున్నాయి. దాంతో 3 కిలోవాట్లలోపు ప్లాంట్లు పెట్టుకునేవారి సంఖ్య పెరిగింది.

\- గంగాధర్, స్రవంతి సోలార్, నిజామాబాద్

5 కిలోవాట్లతో జీరో బిల్లు

ప్రతినెల రూ.4 వేల దాకా వచ్చే బిల్లు 5 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌ను బిగించాక.. రూ.290కు తగ్గిపోయింది. 5 కిలోవాట్ల యూనిట్ ఏర్పాటుకు రూ.3.50 లక్షలు ఖర్చయింది. నిర్వహణ ఖర్చు కూడా నామమాత్రంగా ఉంటుంది. పిడుగులు పడ్డప్పుడు మాత్రం సోలార్ పవర్ స్విచ్ పడిపోయి, ట్రిప్ అవుతుంది. తిరిగి ఆన్‌చేసుకుంటే సరిపోతుంది.

\- కొప్పరపు శ్రీనివాస్‌రెడ్డి, నారపల్లి

ఒకప్పుడు 2,500 బిల్లు

రూ.2.50 లక్షలతో 5కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ పెట్టుకున్నాం. 3 కిలోవాట్ల యూనిట్లనే వాడుతున్నాం. ప్లాంట్ పెట్టకముందు నెలకు రూ.2500ల దాకా బిల్లు వచ్చేది. రూఫ్‌టాప్ అమర్చాక జీరో బిల్లు వస్తోంది. సోలార్ ప్యానెళ్లపై దుమ్ము.. ధూళి పడకుండా నిరంతరం శుభ్రపర్చడం మంచిది.

\- ముఖ్రం, కాచిగూడ

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరం

» ఆధునిక పద్ధతులతో వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలి: కిషన్‌రెడ్డి

వర్గల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచదేశాలకు ఎగుమతిచేసే స్థాయికి భారత్ ఎదిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయిపల్లి వద్ద విత్తనోత్పత్తి కంపెనీ క్రిస్టల్ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో వ్యవసాయ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు పంట సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి కంపోస్టు ఎరువుల వాడకంపై దృష్టిపెట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరమని, రైతులు ఈ వ్యవసాయం చేపట్టాలన్నారు. సాగులో క్రిమిసంహారక మందులు, అధిక ఎరువుల వాడకంతో నేలలో పోషకాలు దెబ్బతినడంతో పాటు ప్రజలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. సాగులో కంపోస్ట్ ఎరువులు వాడి పర్యావరణానికి హాని కలగకుండా చూడాలని చెప్పారు. రైతులు ఆధునిక పద్ధతులతో వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం, డెయిరీ రంగాన్ని ప్రోత్సహిస్తూ తగిన విధంగా నిధుల కేటాయించడంతోపాటు కనీస మద్దతు ధరను పెంచుతోందని, పంటల బీమా పథకాన్ని వర్తింపజేస్తోందని చెప్పారు. మోదీపై ఎంత ఒత్తిడి వస్తున్నా ఇతర దేశాల పంట ఉత్పత్తుల జోలికి వెళ్లకుండా దేశీయ వ్యవసాయం, రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. భారత్‌ను గొప్ప ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతూ అమెరికా వంటి దేశాలకు దీటైన సమాధానం చెబుతున్నారన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు గతంలో రూ.2,300 కోట్లు కాగా, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక రూ.3,000 కోట్ల నుంచి ప్రస్తుతం రూ.26,000 కోట్ల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. 2014 సంవత్సరంలో క్వింటాలు ధాన్యం ధర రూ.1,300 ఉండగా ప్రస్తుతం రూ.2,360 మద్దతు ధరను కేంద్రం అందిస్తోందన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు లైంగిక వేధింపులు

» నూతనకల్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ సస్పెన్షన్

సూర్యాపేట క్రైం/నూతనకల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించిన ఘటనలో నూతనకల్ ఎస్సై వాసా ప్రవీణ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నూతనకల్‌లో విధులు నిర్వహించే సమయంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ మహిళా కానిస్టేబుల్‌ను వేధించారని గత నెలలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సైని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశామని తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో వాస్తవమేనని తేలడంతో విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

రెరా చట్టంతో రియల్టీపై
ప్రజల్లో పెరిగిన విశ్వాసం

» కేంద్రం నుంచి రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

» ముసిగిన క్రెడాయ్ ప్రాపర్టీ షో

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రెరా చట్టం వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పారదర్శకత, బాధ్యతాయుత పాలన రియల్ ఎస్టేట్ రంగానికి బలమైన పునాది అని తెలిపారు. హైదరాబాద్‌లో మూడు రోజులు జరిగిన క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడారు. హైదరాబాద్‌ను వ్యాక్సిన్ రాజధానిగా ఎదగడమేకాకుండా ఫార్మా, ఐటీ, హెల్త్‌కేర్, సీడ్ ఎగుమతుల్లో నగరం అగ్రగామిగా నిలిచిందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), రీజినల్ రింగ్ రైలు, మెట్రో విస్తరణ వంటి మెగా ప్రాజెక్టులు నగర కనెక్టివిటీని పెంచి కొత్త అభివృద్ధి అవకాశాలను కలిగిస్తాయని తెలిపారు. వరంగల్ విమానాశ్రయం పునరుద్ధరణ, ఆదిలాబాద్ ఎయిర్‌బేస్‌ను కమర్షియల్‌గా మార్చే ప్రయత్నాలు రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. కేంద్రం నుంచి తెలంగాణ మౌలిక వసతుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ టెక్నాలజీ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కృషి జరుగుతోందని చెప్పారు. ప్రజలు దేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్న ప్రధాని పిలుపునకు స్పందించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.జయదీప్ రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల ప్రదర్శనలో 70కి పైగా డెవలపర్లు, 300కి పైగా రెరా అనుమతి ఉన్న ప్రాజెక్టులు పాలుపంచుకోగా.. డెవలపర్లకు సుమారు రూ.400కోట్ల వ్యాపారావకాశాలు వచ్చినట్టు తెలిపారు. ఈ ప్రదర్శనకు 50వేల మందికి పైగా సందర్శకులు వచ్చారు. కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రతినిధులు బి.జగన్నాథరావు, కాంతి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రాపర్టీ షోలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో క్రెడాయ్ ప్రతినిధులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.